thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 116 | కరీంనగర్ శనివారం, 5 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి : ఖర్గే

దేశంలో గుత్తాధిపత్యం కారణంగా సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి వెళ్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికల సంస్థలతో సహా అన్నింటిలోనూ కేంద్రం జోక్యం చేసుకుంటోంది. అన్నిచోట్లా తన ఆధిపత్యాన్ని నెలకొల్పు తోంది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ కారణంగా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్ వైపు మొగ్గు చూపుతు న్నాయి. ప్రపంచంలో ఎక్కడా ఈవీఎంలు అందుబాటులో లేవు. 140 కోట్ల మంది ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతున్నారు. త్వరలోనే ఈ దేశ యువత మేలుకొని బ్యాలెట్‌లకు మద్దతుగా ఈవీఎంలకు వ్యతిరేకంగా తమ గొంతు వినిపిస్తారు' అని ఖర్గే పేర్కొన్నారు.

# హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం

## రేవంత్ - భట్టి ద్వయం తెలంగాణ అభివృద్ధిని.... ముందుకు తీసుకుపోతోంది - ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే




హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణం కార్యకర్తలేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఇలా అందరూ కలిసికట్టుగా భారత రాష్ట్ర సమితిని ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి' సభలో ఖర్గే మాట్లాడారు.

**ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం...**"గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది.

గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొస్తోంది. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమే. బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోంది.

**ఆ విషయంపై మోదీ ఎందుకు నోరు విప్పరు?..**దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మరి మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారు.. కానీ ఆ విషయంపై ప్రధాని నోరు విప్పరు.

గతంలో అమెరికా బెదిరించినా ఇందిరాగాంధీ భయపడలేదు. దేశం కోసం ఇందిర, రాజీవ్‌గాంధీ ప్రాణాలు అర్పించారు. భాజపా, ఆర్ఎస్ఎస్ నుంచి ఒక్కరైనా ప్రాణాలు అర్పించారా?

**మణిపుర్ ఈ దేశంలో భాగం కాదా?...** ఇప్పటి వరకు ప్రధాని 42 దేశాలు తిరిగారు.. కానీ మణిపుర్ వెళ్లడానికి మాత్రం మనసు రాలేదు. ఆ రాష్ట్ర అంశంపై ఒక్కసారి కూడా ఆయన పెదవి విప్పలేదు. రాహుల్‌గాంధీ, నేను మణిపుర్ వెళ్లాం.. మోదీ మాత్రం వెళ్లలేదు. మణిపుర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపుర్ వాసులు భారతీయులు కాదా? సెక్యులర్, సోషలిస్టు పదాలను ఆర్ఎస్ఎస్, భాజపా, మోదీ, అమిత్‌షా సహా ఎవరూ రాజ్యాంగం నుంచి తొలగించలేరు. మోదీజీ.. ముందు దేశ ప్రజల బాధలు వినండి.. ఆ తర్వాత విదేశాల సంగతి చూడొచ్చు. అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు.. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు" అని ఖర్గే విమర్శించారు.




హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సంఘం నుంచి రాజకీయ పార్టీగా గుర్తింపు పొంది గత ఆరు సంవత్సరాలుగా ఏ ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలను రాజకీయ పార్టీల జాబితాల నుంచి తొలగించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మీ పార్టీల పేరును రిజిస్టర్ పార్టీల జాబితా నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలంటూతెలంగాణలోని 13 పొలిటికల్ పార్టీలకు శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం షో కాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో చర్యలు తీసుకునేందుకు ఈ 13 పార్టీలకు నోటీసులు ఇవ్వాలని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. పార్టీల పేరుతో దినపత్రికల్లో ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో పాటు సంబంధింత పార్టీని జాబితా నుంచి తొలగించాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన ప్రతిపాదనలను ఈ నెల 10వ తేదీ లోపు సమర్పించాలని ఆదేశించింది. జిల్లా అధికారుల నుంచి వచ్చే నివేదికను కేంద్ర ఎన్నికల కమిషన్ కు పంపనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఓ షర్మిల...ఓ కవిత...ఆ రెండు పార్టీలకూ గండమే !



వైసీపీ ఎందుకు ఓడిపోయింది అంటే ఈ రోజుకీ సరైన విలువైన కారణం చెప్పలేరు. ఎందుకు అంటే అనేక కారణాలు అందులో ఇమిడి ఉన్నాయి. వాటిలో అత్యధిక శాతం అధినాయకత్వానికి నేరుగా సంబంధం ఉన్నవే. అందువల్లనే ఓటమి మీద ఆత్మ విమర్శలు సమీక్షలు పూర్తి స్థాయిలో ఉన్నాయా అన్నదే ప్రశ్న. వైసీపీ ఓటమికి అనేక కారణాలు ఉండొచ్చు కానీ అతి ప్రధాన కారణం సెంటిమెంట్ లాంటి వైఎస్ షర్మిల అంటే ఆ పార్టీ పెద్దలు ఒప్పుకోక పోవచ్చు. కానీ ఇది పచ్చి నిజం అనే కఠిన విశ్లేషణలు ఉన్నాయి. షర్మిల జగన్ మీద నేరుగా చేసిన ఆరోపణలను వైసీపీ హార్డ్ కోర్ రీజియన్ అయిన రాయలసీమ జిల్లాల వారు నమ్మారు. అందుకే మొత్తంగా 52 అసెంబ్లీ సీట్లకు గానూ ఏడంటే ఏడు సీట్లు మాత్రమే దక్కాయని చెబుతారు. ఇక షర్మిల జగన్ మీద తన రాజకీయ పోరాటానికి ముందు వైసీపీ తీవ్రంగా వ్యతిరేకించే టీడీపీకి స్ట్రాంగ్ గా సపోర్టు చేసే ఒక ప్రముఖ చానల్ ని ఎంచుకున్నారు ఆ చానల్ నుంచే ఆమె జగన్ మీద తాను చేయబోయే భవిష్యత్తు పోరాటాల గురించి చూచాయగా వివరించారు. ఆ తరువాత కూడా జరిగింది అదే. వైసీపీ ఫ్యాన్ కి ఎదురు నిలిచి సునామీ లాంటి ఎదురు గాలితో ఫల్టీ కొట్టించడం వెనక షర్మిల ప్రభావం గాఢంగా ఉందని అంతా నమ్ముతారు. ఇక చూస్తే అదే బాటలో బీఆర్ఎస్ లో మరో చెల్లెమ్మ కవిత వెళ్తున్నారా అన్నది చర్చగా ఉంది. ఎందుకు అంటే బీఆర్ఎస్ మీద విమర్శలు చేస్తూ టీడీపీకి బలమైన మద్దతుగా ఉన్న ఒక ప్రముఖ చానల్ కి వెళ్ళి మరీ కవిత తన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆమె కూడా బీఆర్ఎస్ మీద పరోక్ష విమర్శలు చేశారు. కేసీఆర్ కేటీఆర్ ల గురించి ఆమె తన మనసులోని మాటను చెప్పకనే చెప్పారు. బీఆర్ఎస్ లో తన పాత్ర గురించి చెప్పారు. ఇక తన రాజకీయ ఆకాంక్షల గురించి కూడా ఆమె ఎక్కడా దచుకోవడంలేదు. ఇవన్నీ కూడా సహజంగానే బీఆర్ఎస్ కి పెద్దగా గిట్టని చానల్ లో ఆమె ఇంటర్వ్యూ రూపంలో ఇవ్వడం అంటే కచ్చితంగా గులాబీ పార్టీకి గుచ్చుకున్నట్లే అని అంటున్నారు. ఇలా ఇద్దరు చెల్లెమ్మలు ఒకే బాటన పయనిస్తున్నారా అన్నదే ఇపుడు అంతా చర్చించుకుంటున్నారు. ఇక కవిత తనకు ఉన్న తెలంగాణా జాగృతి వేదిక నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ కేసీఆర్ సహనాన్ని పరీక్షిస్తున్నారు అని అంటున్నారు. ఆమె ఇస్తున్న ప్రకటనలు ఆమె వైఖరి కేసీఆర్ కి ఇబ్బందిగానే మారుతున్నాయని కూడా అంటున్నారు. ఇది చాలదు అన్నట్లుగా బీఆర్ఎస్ మీద నిత్యం ఏదో విధంగా వ్యతిరేక వార్తలు వండి వార్చే ఒక చానల్ లో కూర్చుని ఇంటర్వ్యూలు ఇవ్వడం అంటే ఆమె ఏమి చెప్పదలచుకున్నారు అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఆ విధంగా ఆమె చేయడం ద్వారా బీఆర్ఎస్ ని ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఇరకాటంలో పెట్టేశారు అని అంటున్నారు. నాడు ఒక చెల్లెమ్మ కొంగు బిగించి వైఎస్ జగన్ కి ఆగర్భ ప్రత్యర్థిగా మీడియా రంగంలో ఉన్న ఒక చానల్ ముందు చెప్పాల్సింది అంతా చెప్పరు. అలా ఆమె వేసిన తొలి అడుగు వైసీపీ రాజకీయ పతనానికి దారి తీసింది అని గుర్తు చేస్తున్నారు. పట్టుదలలో తన అన్నకు ఎక్కడా తీసిపోని షర్మిల పనిగట్టుకుని ఏపీలో కాంగ్రెస్ అధ్యక్ష పదవి స్వీకరించి తాను ఏమి లబ్ది పొందారో తెలియదు కానీ తన అన్నను మాజీ సీఎం గా చేయడానికి మాత్రం ఎంతగానో దోహద పడ్డారు అని విశ్లేషణలు ఉన్నాయి. ఇక ఇపుడు షర్మిల కూడా బీఆర్ఎస్ పెద్దలు వ్యతిరేకించే చానల్ లో ద్వారానే తొలి అడుగు వేస్తున్నారా అన్నదే చర్చగా ఉంది. అలా ఆమె వేసే అడుగులు రేపటి రోజున బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తుకు గండంగా మారుతాయా అన్నదే చర్చగా ఉంది. ఆంధ్రాలో ఒక ఆడపడుచు పిడికిలి బిగిస్తే వైసీపీకి ఏమి జరిగిందో అంతా చూశారు. ఇక తెలంగాణాలో చూస్తే మరో ఆడపడుచు దూకుడు చేస్తున్నారు. మరి గులాబీ పార్టీకి ముళ్ళు గట్టిగానే గుచ్చుతాయని అంటున్నారు. అయితే షర్మిలను కాంగ్రెస్ అనే జాతీయ పార్టీ తన ఆయుధంగా ప్రయోగించింది అని అంటారు. కవితకు ఏ రాజకీయ పార్టీ దన్ను దొరుకుందో ఏ రకమైన అండ ఆమె అందుకోబోతున్నారో ప్రస్తుతానికి సస్పెన్స్ అని అంటున్నారు.



# 'ఆమె'కే అగ్రతాంబూలం

## బీజేపీ జాతీయ అధ్యక్ష పీఠంపై మహిళ..!

## ఆ ముగ్గురిలో ఎవరికి దక్కేనో?

న్యూఢిల్లీ: కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవడంతోపాటు దేశంలో సగానికిపైగా రాష్ట్రాల్లో అధికారం చేలాయిస్తున్న బీజేపీ.. పార్టీని మరింతగా విస్తరించేందుకు సిద్ధమవుతున్నది. మరోసారి ఢిల్లీ పీఠాన్ని దక్కించుకోవడం, విపక్షాల ఏలుబడిలో ఉన్న ఆ ఐదారు రాష్ట్రాలను తన ఖాతాలో వేసుకోవడానికి కాషాయ దళం ప్రణాళికలు రచిస్తున్నది. గత ఎన్నికల్లో పార్టీ విజయాల్లో కీలకపాత్ర పోషించిన మహిళలను చేజార్చుకోకూడదని కమలం పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఇందులో భాగంగా పార్టీ జాతీయ అధ్యక్ష పీఠంపై మహిళను కూర్చోబెట్టాలని తీవ్రంగా ఆలోచిస్తున్నది.

దీనికి ఆర్ఎస్ఎస్ కూడా పచ్చజెండా ఊపినట్లు సమాచారం. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, తమిళనాడు ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షురాలు పురందేశ్వరి పేర్లను పార్టీ అగ్రనాయకత్వం పరిశీలి స్తున్నది. ఈ ముగ్గురిలో ఎవరినో ఒకరిని అధ్యక్ష పదవి వరించనుంది. ఒకవేళ అదే జరిగితే కషాయ దళానికి తొలిసారిగా ఓ మహిళ సారథి కానున్నది. అయితే ఈ రేసులో ప్రధాని మోదీ కేబినెట్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తున్నది.

**నిర్మలా సీతారామన్..** పార్టీ అధ్యక్ష రేసులో నిర్మలా సీతారామన్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఇటీవలే జేపీ నడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎస్ సంతోశ్‌లు నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో సీతారామన్ పేరునే చర్చించినట్లు తెలుస్తున్నది. కేంద్ర ఆర్థిక మంత్రిగా, రక్షణమంత్రిగా తానేంటో నిరూపించుకున్న ఆమెకు పార్టీలో సుదీర్ఘమైన అనుభవం ఉంది. అలాగే నాయకత్వ సామర్థ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఆమె నియామకంతో దక్షిణాదిలో పాగా వేయాలన్న లక్ష్యం కూడా నెరవేరే అవకాశం ఉందని భావిస్తున్నారు.

త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కలిసొచ్చే అవకాశం ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని భావిస్తున్న మోదీ సర్కార్.. త్వరలోనే ఈ బిల్లును కూడా ఆమోదించాలని ఆలోచిస్తున్నది. ఈ నేపథ్యంలో నిర్మలమ్మ అయితేనే సరైనవారని పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనగా ఉన్నది. ఆమెకు ఆర్ఎస్ఎస్ కూడా సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తున్నది.

**వనతి శ్రీనివాసన్...** తమిళనాడుకు చెందిన వానతి శ్రీనివాసన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. న్యాయవాది వృత్తి నుంచి రాజకీయ నాయకురాలిగా ఎదిగిన ఆమె ప్రస్తుతం కోయంబత్తూర్ సౌత్ ఎమ్మెల్యేగా ఉన్నారు. 1993లో బీజేపీలో చేరిన ఆమె అంచలంచలుగా ఎదుగుతూ.. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. 2020లో ప్రమోషన్ పొందిన ఆమె.. బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. అనంతరం 2022లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా నియమితురాలై.. తమిళనాడు నుంచి ఈ పదవి పొందిన మొదటి మహిళగా నిలిచారు.

**పురందేశ్వరి...** బహుభాషా కోవిధురాలైన రాజమండ్రి ఎంపీ, ఏపీ బీజేపీ మాజీ ప్రెసిడెంట్ పురందేశ్వరి కూడా పార్టీ జాతీయ అధ్యక్ష రేసులో నిలిచారు. కేంద్రమంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న ఆమె నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ పుంజుకున్నది. ఆపరేషన్ సిందూర్‌పై వివిధ దేశాల్లో పర్యటించిన ప్రజాప్రతినిధుల బృందంలో పురందేశ్వరి కూడా ఉన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి చేపట్టాలంటే ఆర్ఎస్ఎస్ మద్దతు కూడా ఉండాల్సిందే. అధ్యక్ష ఎంపికలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాత్ర ప్రధానమైనది. ఇటీవల పలు రాష్ట్రాల్లో నియమితులైన పార్టీ అధ్యక్షుల్లో ఆర్ఎస్ఎస్ ముద్ర స్పష్టంగా కనిపిస్తున్న విషయం తెలిసిందే. పార్టీలో మొదటి నుంచి కొనసాగుతున్న వారికే పదవుల్లో ప్రియార్టీ ఇస్తున్నది. ఈ నేపథ్యంలో పురందేశ్వరికి ఈ విషయం ప్రతిబంధకంగా మారే అవకాశం ఉన్నది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన ఆమె.. కొన్నేండ్ల క్రితమే బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. కాగా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా పదవీకాలం రెండేండ్ల క్రితమే (2023, జనవరి) ముగిసింది. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పదవీకాలాన్ని 2024 జూన్ వరకు పొడిగించారు.

నూతన అధ్యక్షుడిని ఎంపికచేయకపోవడంతో ఆయన ఇంకా ఆ పదవిలోనే కొనసాగుతున్నారు. ఆయనను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవడంతో అధ్యక్షుడి మార్పు తప్పనిసరి అయింది. దీంతో పార్టీ అగ్రనాయకత్వం అధ్యక్ష మార్పుపై తీవ్ర కసరత్తు చేస్తున్నది.



# కొత్త, పాత తేడాలొద్దు

## కొత్త, పాత తేడాలొద్దు.. అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలి: మల్లికార్జున ఖర్గే

హైదరాబాద్: పార్టీలో అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. కొత్తపాత తేడా వద్దని.. త్వరలో అన్ని కమిటీల నియామకం పూర్తిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలపై గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశమైంది. తొలుత పాశమైలారం ఘటనపై నేతలు సంతాపం తెలిపారు. అనంతరం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై చర్చించారు. జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ కార్యక్రమాలపై సమాలోచనలు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ పార్టీకి సంబంధించిన అంశాలపై బయట ఎలాంటి విమర్శలు చేయొద్దని.. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమన్వయం చేయాలని దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులపై మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా మంత్రులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కొత్త, పాత నేతల మధ్య సమన్వయం లేదన్నారు. కొత్తగా వచ్చినవారు పాతవారితో కలిసి వెళ్తే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు.



# రాష్ట్రంలో వచ్చే పదేళ్లు మనదే అధికారం

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పదవులను నేతలు సాధారణంగా తీసుకోవద్దని.. వాటితోనే గుర్తింపు, గౌరవం వస్తుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

రాజకీయాల్లో ఎదిగేందుకు అవి ఉపయోగపడతాయని చెప్పారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో వచ్చే పదేళ్లు మన పార్టీయే అధికారంలో ఉంటుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. "నేను పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు 45 లక్షల సభ్యత్వాలు చేశాం. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాల వారితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలా మందికి ప్రభుత్వంలో పదవులు వచ్చాయి. రానున్న రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయి. మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికలు ప్రభావితం చేయబోతున్నాయి. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలి. నాయకులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో చాలా విజయాలు సాధించాం. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలి. కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తేవాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ సభ: రామచందర్‌రావు



హైదరాబాద్: సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ సభ నిర్వహిస్తోందని తెలంగాణ భాజపా అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు 'ఎక్స్' వేదికగా విమర్శించారు. కాంగ్రెస్ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని వ్యాఖ్యానించారు. గ్యారెంటీలు, హామీల పేరుతో హడావుడి తప్ప అమలులో మాత్రం శూన్యమని విమర్శించారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేసి.. ఎస్సీ, ఎస్టీలకు సంకెళు వేసి భీమ్ పేరుతో నాటకమాడుతోందన్నారు. ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలకు తూట్లు పొడిచి.. న్యాయాన్ని, రాజ్యాంగ విలువలను కాంగ్రెస్ ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు.

## మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై స్పందించిన కేటీఆర్



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. సాధారణ వైద్య పరీక్షల కోసం నిన్న సాయంత్రం ఆయన సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరారని తెలిపారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయులు పర్యవేక్షించేందుకు కొన్ని రోజులు ఆసుపత్రిలో ఉండాలని వైద్యులు సూచించినట్టు చెప్పారు. ఎలాంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు లేవని, వైటల్స్ అన్నీ సాధారణంగానే ఉన్నాయన్నారు. కేసీఆర్ క్షేమం గురించి ఆరాతీస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు రోజులుగా నీరసంగా ఉండడంతో కేసీఆర్ గురువారం సాయంత్రం ఆసుపత్రికి వచ్చారు. ఆయనను పరీక్షించిన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ ఎంవీ రావు సూచనతో ఆసుపత్రిలో చేరారు. వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వర్గాలు గురువారం రాత్రి 9.30 సమయంలో బులెటిన్ విడుదల చేశాయి. "నీరసంతో బాధపడుతూ కేసీఆర్ ఆసుపత్రిలో చేరారు. ప్రాథమిక పరీక్షల్లో రక్తంలో షుగర్ స్థాయులు అధికంగా, సోడియం స్థాయులు తక్కువగా ఉన్నట్లు తేలింది. కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉంది. షుగర్, సోడియం సాధారణ స్థాయికి వచ్చే వరకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతారు' అని హెల్త్ బులెటిన్‌లో డాక్టర్ ఎంవీ రావు పేర్కొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖలో 2,363 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం

**హైదరాబాద్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో పెద్ద సంఖ్యలో పోస్టుల భర్తీకి అనుమతి లభించింది. దాదాపు 2,363 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఒప్పంద, పొరుగుసేవల కింద ఈ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది.**



# లక్డీకాపూల్‌లో రోశయ్య విగ్రహం

**హైదరాబాద్: నగరంలోని లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి , ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా నేతలు నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.**



# లింగంపల్లిలో ఆక్రమణల తొలగింపు

శేరిలింగంపల్లి: హైదరాబాద్‌లోని లింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ ప్రాంతంలో హైడ్రా ఆధ్వర్యంలో నాలా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ పనులను అడ్డుకున్నారు.


హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు. నాలాలోకి వచ్చిన భవనాలు కూల్చకుండా సోమేశ్వరాలయానికి సంబంధించిన భూమి స్వాధీనం చేసుకొని నాలా నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు దేవాదాయ శాఖ అధికారిణి భారతి ఆక్షేపించారు. నాలా ఆక్రమించిన వారిని వదిలేసి దేవాలయ భూమిని ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ విషయంలో కార్పొరేటర్‌ను కలగజేసుకోవద్దని కోరారు. చర్చలు సాగుతున్న క్రమంలో కూల్చివేతలు తాత్కాలికంగా ఆగిపోయాయి.



# ఖమ్మం-వరంగల్ హైవేపై ఘోర ప్రమాదం

మరిపెడ: ఖమ్మం - వరంగల్ హైవేపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరిపెడ శివారు కుడియాతండా వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్ మృతి చెందాడు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో మంటలు ఆర్పివేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్': రాజ్‌నాథ్‌సింగ్



హైదరాబాద్: హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్థాన్‌తో పాటు ప్రపంచానికి మనం బలమేంటో చూపించామన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశాం తప్ప.. పౌరులను కాదని చెప్పారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో క్షత్రియ సేవా సమితి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్), భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రాజ్‌నాథ్ మాట్లాడారు. గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో బ్రిటిష్ వారితో ఆయన పోరాడారని గుర్తుచేశారు. "భారత్ కోసం అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చింది. అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో ఆధునిక ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఆయన. బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాలనేది ఆయన నుంచి మనం నేర్చుకోవాలి. అడవి బిడ్డల కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారు. ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నాం" అని రాజ్‌నాథ్ అన్నారు

## గనుల లీజ్ రెన్యువల్‌కు సింగిల్ విండో సిస్టం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: 500 మినరల్ బ్లాక్స్‌లో లీజ్ రెన్యువల్ సులభతరం చేశామని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గనుల లీజ్ రెన్యువల్‌కు సింగిల్ విండో సిస్టం అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. కోల్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఖనిజాల ఉత్పత్తిలో కోల్ ఇండియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆత్మనిర్భర్ కోసం కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. స్థానికుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. అత్యాధునిక సాంకేతికత వినియోగించి ఖనిజాలు ఉత్పత్తి చేస్తున్నట్టు చెప్పారు. అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో కూడా కోల్ ఇండియా అడుగుపెట్టిందని తెలిపారు.




## ప్రయత్నాలు ఫలించకపోయినా..: 'సీఎం కుర్చీ'పై డీకే శివకుమార్ వ్యాఖ్య

కర్ణాటక రాజకీయాల్లో సీఎం మార్పుపై ఇటీవల తీవ్ర చర్చ జరిగింది. కాంగ్రెస్ అధిష్ఠానం బుజ్జగింపులతో డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్‌సర్దుకుపోవడంతో.. ప్రస్తుతానికి సమస్య తీరిపోయింది. అయితే సీఎం కావాలన్న తన కోరిక అలాగే ఉందనే అర్థంలో డీకే తాజాగా వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ ఆకాంక్షలపై మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. "ప్రయత్నాలు ఫలించకపోయినా.. నేను బలంగా కోరుకున్న దాని కోసం చేసిన ప్రార్థనలకు సమాధానం దొరక్కుండాపోదు. అయితే రాజకీయాల గురించి చర్చించే సందర్భం ఇది కాదు. రాష్ట్రానికి మంచి జరగాలి" అంటూ తన ఆకాంక్షలను నేరుగా బయటపెట్టకుండా సమాధానం చెప్పారు డీకే. మల్లికార్జున ఖర్గే తమకు జాతీయ అధ్యక్షుడని, ఆయన సూచనల ప్రకారం పార్టీ కోసం పనిచేస్తామన్నారు. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందన్నారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే.. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేయడంతో ఆ ఊహాగానాలకు చెక్ పడింది. ఆ సమయంలో డీకే ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. "ఆయన(సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలి" అని మీడియాతో మాట్లాడిన సంగతి తెలిసిందే. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారని వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. తాను కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తానని డీకే బహిరంగంగానే చెప్పిన సంగతి తెలిసిందే.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ

## – జూలై 5...రావూరి భరద్వాజ జయంతి



ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు. రావూరి భరద్వాజ (జులై 5, 1927 – (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథ రచయిత, నవల రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చుకున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాల లమినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపాడు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింప బడుతుంది. ఈయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్నతనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనల్లో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించు కున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు. రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపం లోని మొగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు. 1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరద్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరద్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకలనాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించు కున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కొముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువదమైంది. ఆత్మగతం, బానిసాతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరథ్యం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు. విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలి సరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది. రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్ళు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్ళు అనే పేరు పెట్టారు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రచన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్ళు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారా వాహికగా వెలువడిన పాకుడురాళ్ళు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి.

1980లో కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది. 1987లో రాజలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సేవానిరతికి ప్రతిరూపం కంచర్ల సుగుణమణి

## – జూలై 5...కంచర్ల సుగుణమణి వర్ధంతి




భారతదేశ చరిత్రలో మహిళా నేతలు పోషించిన పాత్ర విశిష్టమైనది. సంఘ సేవ చేసేవారు ఎంతో మంది ఉండవచ్చు. కాని సంఘ సేవే పరమావధి గా తమ జీవితాలను అంకితం చేసే వారు బహు అరుదుగా వుంటారు. ఆలాంటి త్యాగ మూర్తులలో అగ్ర భాగాన నిలుస్తారు కంచర్ల సుగుణమణి. ఆమె ప్రముఖ సంఘ సేవకురాలు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ కు అసలు సిసలైన అనుచరురాలిగా ఆమె సుప్రసిద్ధురాలు. ఆమె 1919, నవంబర్ 27వ తేదీన కాకినాడలో గురుజు వెంకటస్వామి, సూర్యనారాయణమ్మ దంపతులకు జన్మించారు. ఆ రోజులలోనే ఈమె మగపిల్లలతో సమానంగా మహారాజా కాలేజీలో డిగ్రీ చదివారు. చిన్నప్పటినుండి మంచి వాతావరణంలో పెరగడంవల్ల ఆమెకు సేవాభావం అలవడింది. ఆమె వివాహం గాంధేయవాది కంచర్ల భూషణంతో జరిగింది. ఆ రోజుల్లోనే కట్నకానుకలు వద్దని, చదువు, సంస్కారం వున్న అమ్మాయి కావాలని కంచర్ల భూషణం ఆమెను వివాహం చేసుకున్నారు. ఆమె చదువుకునే రోజులలోనే భూకంపాలు, వరదలు, ఉప్పెనలు వచ్చినప్పుడు, ఇంటింటికీ వెళ్ళి విరాళాలు సేకరించి కాలేజీ యాజమాన్యానికి అప్పగించారు. తనలోని తపనను అక్షరాలతో పొదిగి గృహలక్ష్మి, భారతి వంటి పత్రికలకు వ్యాసాలు వ్రాసింది. స్త్రీ జనోద్ధరణ కోసం 1937లో లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే సంస్థ ప్రారంభించారు. భర్త ఉద్యోగరీత్యా ఈమె ఢిల్లీ వెళ్ళారు. ఆకాశవాణిలో ఆమె తొలి తెలుగు ప్రసంగం ఢిల్లీ నుండి ప్రసారమయింది. 1944 సంవత్సరంలో భర్తకు బదిలీ కావడంతో మద్రాసుకు మకాం మార్చారు. భర్త ప్రోత్సాహంతో, ఆమె దుర్గాబాయమ్మను సందర్శించి ఆమెతో పాటుగా సేవ చెయ్యాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. దుర్గాబాయమ్మ దానికంగీకరించి ఆమెకు "ఆంధ్రమహిళ" పత్రిక పూర్తి బాధ్యతను అప్పగించింది. మద్రాసులో ఆమెకు బులుసు సాంబమూర్తి, భోగరాజు పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు మొదలైన ప్రముఖుల సాంగత్యంతో ఆమె ఎన్నో విషయాలు తెలుసు కోగలిగారు. దుర్గాబాయమ్మ గారితో కలిసి "కస్తూరిబా నిధి"కి విరాళాలు ఒక సంవత్సరంలో 6 లక్షలు ప్రోగు చేశారు. ఆ రోజుల్లో 6 లక్షలంటే సామాన్యం కాదు. మహాత్మాగాంధి ఆజ్ఞ ప్రకారం దుర్గాబాయమ్మతో కలసి ఆ నిధితో ఆమె రాష్ట్రమంతా పర్యటించి, "కస్తూరిబా సేవా సంఘాలు" స్థాపించి అనుభవజ్ఞులైన సేవికలను ఏర్పాటు చేశారు. ఈనాటికీ అవి నిర్విరామంగా సేవలు చేస్తున్నాయంటే వాటి వెనుక ఆమె కృషి ఎంతో ఉంది. భర్త ఉద్యోగరీత్యా అరకు వెళ్ళినప్పుడు అక్కడి గిరిజనుల పూరిళ్ళు, ఆహారం, భాష, కట్టుబాట్లు విచిత్రంగా వుండటం ఆమె గమనించారు. అక్కడి అనారోగ్యాలూ, విష జ్వరాలూ, కొండదేవతలకిచ్చే నరబలులు, జంతు బలులూ చూసి చలించి పోయి, మద్రాసులోని స్త్రీ శిశు సంక్షేమ అధికారి పారిజాతం నాయుడికి లేఖ రాశారు. ఆమె సహకారంతో ఒక సంక్షేమ కేంద్రాన్ని స్థాపించి, తమ కాలనీలోని స్త్రీల సహకారంతో పిల్లలకు చదువు, ఆటపాటలు, కుట్లు, పారిశుధ్యం నేర్పుతూ సుగుణమణి ఐదు సంవత్సరాలు వారికి సేవ చేశారు. ఇప్పటికీ అక్కడ ఆ కేంద్రంలో స్త్రీలకు, పిల్లలకు చదువు, వృత్తివిద్యలు, ఆరోగ్య సూత్రాలు నేర్పుతున్నారు. 1944 నుంచీ ఆలిండియా రేడియోలోనూ, టి.వి. వచ్చిన తరువాత అన్ని ఛానల్స్‌లోను ఎన్నో స్త్రీల సమస్యల గురించి తన నిశ్చితాభిప్రాయాలను వెలిబుచ్చుతూనే ఉండేవారు. శిశువుల నుంచీ వృద్ధుల దాకా స్త్రీలను ఆదుకోవాలనే ఆశయంతో సుందర్ నగర్‌లో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు. ఆమె దుర్గాబాయమ్మ కోరిక మేరకు 1957 అక్టోబరులో హైదరాబాదు వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. "ఆంధ్ర మహిళాసభ" హైదరాబాద్ శాఖను అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. అప్పుడు విద్యానగర్‌లో ప్రారంభించిన "ఆంధ్ర మహిళాసభ" మెటర్నిటీ హాస్పిటల్, హేండీక్రాఫ్ట్స్ ఇన్‌స్టిట్యూట్, హైస్కూల్, హాస్టల్, అసెంబ్లీహాల్ లతో నిండిపోతే, ఉస్మానియా యూనివర్సిటీలో కూడా స్థలం తీసుకుని ఆర్ట్స్, సైన్స్, లా కాలేజీలు, కంప్యూటర్ కోర్స్, సంగీతం క్లాసులు, లిటరసీ భవన్, గాంధీభవన్, హాస్టల్, వికలాంగుల స్కూలు, ఫిజియోథెరపీ, నర్సింగు హాస్టల్ అలా ఎన్నో ఏర్పాటు చేశారు. 260 మంది పిల్లలు ఎన్నో వృత్తి విద్యలు నేర్చుకుంటున్నారు. "ఆంధ్ర మహిళాసభ" పెట్టిన కొత్తలో దుర్గాబాయమ్మతో కలిసి ఆమె ఇంటింటికీ తిరిగి బేడా, పావలా కూడా విరాళాలుగా సేకరించింది. అలా మొదలైన సేవ మరణించే వరకూ లక్షలలో విరాళాలు సేకరిస్తూ "ఆంధ్రమహిళాసభ"ను శాఖోప శాఖలుగా విస్తరిస్తూ, కొన్ని శాఖలకు కార్యదర్శిగా, సలహాదారుగా సేవలు చేస్తూ, 6 ఏళ్ళు అధ్యక్షురాలిగా సమర్ధ వంతంగా ఆ పదవిని నిర్వహించారు. దుర్గాబాయమ్మ మరణించాక 'ఆంధ్ర మహిళాసభ' పూర్తి బాధ్యతలను చేపట్టారు. ట్రస్ట్ బోర్డ్‌కి మరణించే వరకు తన సహాయ సహకారాలను అందించారు. ఆమె ఆధ్వర్యంలో దుర్గాబాయమ్మ సెంటినరీ సెలబ్రేషన్స్ చాలా ఘనంగా జరిగింది. మద్రాసు, హైదరాబాద్‌ల లోనే కాకుండా, కర్నూలు, సంగారెడ్డి, మహబూబ్ నగర్, ఇబ్రహీంపట్నం లలో కూడా ఆంధ్ర మహిళాసభ ఎంతో కృషి చేస్తున్నది. ఎడల్ట్ ఎడ్యుకేషన్ రూరల్ ఏరియాలలో లిటరసీ హౌస్ దక్షిణ భారతంలో "ఆంధ్ర మహిళాసభ"లో మాత్రమే వున్నది. వాలంటరీ సెక్టార్‌లో కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ ఇచ్చే మొదటి సంస్థ యిదే. ఇన్ని సంస్థలు దుర్గాబాయమ్మ తదనంతరం కూడా అంత ఘనంగానూ నడుస్తున్నా యంటే, అది ఆమె ఓర్పు, నేర్పు, సహనం, సమయపాలనల వల్లనే. "ఆంధ్ర మహిళ" పత్రిక పూర్తి బాధ్యత సుగుణమణి తీసుకున్నారు. అందులో కనుపర్తి వరలక్ష్మమ్మ, ఆచంట రుక్మిణమ్మ, కాంచనపల్లి కనకాంబ మొదలైన ఆనాటి ప్రముఖ రచయిత్రుల వ్యాసాలను ప్రచురించటమే కాదు, తనూ స్వయంగా వ్రాసి పత్రికను తీర్చిదిద్దారు. ప్రూఫులు దిద్దటం దగ్గరనుంచీ, స్టాంపులు అంటించి నడిచివెళ్ళి పోస్ట్ చెయ్యటం దాకా అన్ని బాధ్యతలూ ఈమే నిర్వర్తించే వారు. అటు 'ఆంధ్ర మహిళాసభ'లో స్త్రీ సంక్షేమంతో పాటుగా, యిటు 'బాలానంద సంఘం'లో శిశుబాలల సంక్షేమానికీ ఆమె అంకితమైనారు. 'బాలానంద సంఘం'లో మొదటి నుంచే ఉ పాధ్యక్షురాలిగా ఆమె ఎంతో సేవ చేశారు. రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావు, అక్కయ్య న్యాయపతి కామేశ్వరి దంపతులకు ఆమె ఎంతో ఆత్మీయురాలు. న్యాయపతి రాఘవరావు చనిపోయి తరువాత 1984 నుండి ఆమె బాలానంద సంఘం అధ్యక్షురాలిగా పనిచేసింది. ఆమె ఆధ్వర్యంలో "ఆంధ్ర బాలానంద సంఘం" 1990 సంవత్సరంలో స్వర్ణోత్సవాలను దిగ్విజయంగా జరుపుకున్నది. ప్రజా జీవితంలో ఎన్నో పదవులు ఆమెను వరించాయి. ఆంధ్ర మహిళా సభ కార్యదర్శి/సలహాదారు/అధ్యక్షురాలుగా, ఆంధ్ర బాలానంద సంఘం ఉపాధ్యక్షురాలు/అధ్యక్షురాలుగా, మద్రాస్ రాష్ట్ర సొసైటీ అడ్వయిజరీ బోర్డు సభ్యురాలుగా, వికలాంగుల సలహాబోర్డు సభ్యురాలుగా, కస్తూర్బా గాంధీ సేవాసంఘం ఉమెన్ కమిటీ కార్యదర్శిగా, శారదా సంఘం ఆంధ్రప్రదేశ్ ఛైర్‌పర్సన్ గా, ఉమ్మడి ఏపీ కార్మిక సంక్షేమ సలహా కమిటీ సభ్యురాలుగా వివిధ పదవులు చేపట్టి సేవలు అందించారు. 1991లో: ఛైల్డ్ వెల్ఫేర్‌కి గాను నేషనల్ అవార్డు అప్పటి ప్రెసిడెంట్ చేతుల మీదుగా, 1991లో శిరోమణి ఇన్‌స్టిట్యూట్, న్యూఢిల్లీ వారి చేత వికాసశ్రీ అవార్డు 1993 లో భరతముని కళా అవార్డు, 1994లో రాజీవ్‌రత్న నేషనల్ అవార్డు, 2000లో మిలీనియమ్ అవార్డు, 200లో రామకృష్ణ మఠ్ ద్వారా లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు, 2001లో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా హైదరాబాద్ పెరల్ సిటీ జూనియర్ ఛాంబర్ వారిచె హైదరాబాద్ పెరల్ అవార్డు, 2002లో గాంధీగారి మనుమరాలు, తారాగాంధీ చటర్జీ ద్వారా సర్వోదయా సంస్థ అవార్డు, 2005లో రామినేని ఫౌండేషన్ విశేష పురస్కారం, కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తమ సంఘసేవకురాలు పురస్కారం, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అవార్డు, ఇందిరా ప్రియదర్శిని ప్రతిభా అవార్డు తదితర పురస్కారాలు, సన్మానాలు పొందారు.ఆమె తన 99వ యేట 2017, జూలై 5వ తేదీ బుధవారం హైదరాబాదులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పునర్నిర్మాణపు పంథాలో బీజేపీ: నాయకత్వ మార్పు మార్గనిర్దేశక మలుపు



తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న ఈ తరుణంలో, భారతీయ జనతా పార్టీ ఆత్మ పరిశీలన దశను అనివార్యంగా ఎదుర్కొంటోంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఆశించిన ఫలితాలను సాధించక పోవడం, పునాది స్థాయిలో కార్యకర్తల్లో విరక్తి చెలరేగడం, నాయకత్వ విభేదాలు పెరగడం వంటి అనేక పరిమితులు బీజేపీని తన వ్యూహ పటాన్ని పునర్విమర్శించుకునే పరిస్థితిలోకి నెట్టాయి. ఈ సందర్భంలో కొత్త రాష్ట్ర అధ్యక్షుని నియామకం ు ఒక క్రమబద్ధమైన మార్పుగా కాకుండా, రాజకీయ పునర్నిర్మాణానికి సంకేతంగా పరిగణించబడుతోంది. ఈ బాధ్యతను చేపట్టిన నాయకుడి ముందుంది పూలమార్గం కాదు. ఒకవైపు పార్టీ అంతర్గతంగా వర్గ పోరాటాలు, అసంతృప్తులు, భావ పరస్పరతల లోపం అడ్డంకిగా నిలుస్తున్నాయి. మరోవైపు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తన పరిపాలన బలం ద్వారా ప్రజల్లో పునాది పటిష్టం చేసుకుంటోంది. ఈ సంక్లిష్ట నేపథ్యంలో బీజేపీ తన పునరాగమనం కోసం చక్కటి నాయకత్వ శక్తిని, కార్యాచరణ చాతుర్యాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. గతకొంత కాలంగా బీజేపీలో రెండు ప్రధాన వర్గాల మధ్య విభేదాలు ముదిరి పోయాయి ు కేంద్రానికి సమీపంగా ఉన్న నాయకులు వర్సెస్ ప్రాంతీయ నాయకులుబీ వలస వచ్చిన ప్రముఖులు వర్సెస్ సుదీర్ఘకాలం పాటు శ్రమించిన మూల కార్యకర్తలు. ఈ భావ ద్వంద్వాలు పార్టీ ఏకత్వాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. అందుకే కొత్త నాయకుడికి సమతుల్య వ్యవహారం, సూత్రబద్ధమైన సమన్వయం అత్యవసరంగా మారింది. ప్రతి వర్గానికీ న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా పార్టీలో మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని నింపే బాధ్యత ఆయనదే. క్యాడర్ నిశ్శబ్దం ు ఒక వ్యాప్తి చెందిన అసంతృప్తికి సంకేతం. గ్రామస్థాయిలో నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు తమ శ్రమకు సరైన గుర్తింపు లేకపోవడం, నాయకత్వం వారిని పట్టించుకోక పోవడం వల్ల తీవ్రమైన నిరాశకు లోనవుతున్నారు. కార్యక్రమాలు కేంద్రితంగా, వర్చువల్ ప్లాట్‌ఫామ్లకే పరిమిత మవుతున్నాయి. ఈ స్థితిని మార్చేందుకు బూత్ స్థాయి నుంచి ప్రారంభమయ్యే ప్రత్యక్ష ప్రచారం, తలసరి కార్యకర్తలతో చర్చలు, స్థానిక అభిప్రాయాలకు గౌరవం వంటి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా అధ్యక్షునిపై ఉంది. ఇటీవలి కాలంలో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు బీజేపీలో ప్రముఖ స్థానాలు పొందడంపై పాత క్యాడర్‌లో అసంతృప్తి ఏర్పడిన దృష్టిలో, కొత్తవారికి గౌరవం ఇవ్వడంలోనే కాక, మూల కార్యకర్తలకు న్యాయం చేయడంలోనూ సమతుల్య ధోరణి అవసరం. ఒక వర్గానికే ప్రాధాన్యం ఇచ్చి, మరొక వర్గాన్ని నిర్లక్ష్యం చేసిన తరుణాల్లో పార్టీకి ఒరిగిన నష్టాలు ఇప్పటికీ నిలిచిన పాఠాలుగా ఉన్నాయి. పార్టీ ప్రజల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలంటే, నిరుద్యోగ సమస్య, రైతుల సంక్షేమం, విద్యా వ్యవస్థ లోపాలు, నీటి వనరుల అక్రమ వినియోగం వంటి అంశాలపై శ్రద్ధగా స్పందించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోంది. అయినప్పటికీ బీజేపీ నుండి రావాల్సిన రాజకీయ స్పందన శక్తిహీనంగా ఉన్నదన్న అభిప్రాయం క్యాడర్ మధ్య చెలామణిలో ఉంది. ఈ లోటును నూతన నాయకత్వం సరిదిద్దుతూ, ప్రజల్లో విశ్వాసాన్ని రేకెత్తించే దిశగా ఉద్యమ పంథాను ఆవిష్కరించాలి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన వెనకడుగు తర్వాత, 2029ను దృష్టిలో పెట్టుకుని బీజేపీ ఇప్పుడే బూత్ స్థాయి శిక్షణా కార్యక్రమాలు, సామాజిక వర్గాల విశ్లేషణ, ఓటరు సెగ్మెంటేషన్ వంటి వ్యూహాత్మక అంశాలపై చురుకుగా పనిచేయాలి. వ్యూహాలు ఢిల్లీ మార్గదర్శకాలను అనుసరించక పోవచ్చుబీ స్థానిక పరిచయంతో, ప్రజల మన్ననతో మేళవించుకున్న తాత్విక మార్గమే రాష్ట్రంలో ప్రభావవంతంగా పనిచేయగలదు. ఇలాంటి సంక్లిష్ట పరిణామాల్లో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఎన్. రాంచందర్ రావు ు బీజేపీకి మౌలిక పునర్నిర్మాణానికి ఉపయుక్తమైన నాయకుడిగా అభివర్ణించ బడుతున్నారు. చట్టవేత్తగా, విద్యావేత్తగా, శాసన మండలిలో సభ్యుడిగా ఆయనకు ఉన్న అనుభవం ఓ గుర్తింపు. ప్రజాస్వామ్య పరంగా పదునైన వ్యాఖ్యానాలే కాకుండా, బహిరంగ వేదికలపై సూత్రీకృతమైన విశ్లేషణతో ప్రజల మన్నన పొందిన ఆయన, పార్టీలో నిబద్ధతకు, సంయమనానికి, సమన్వయానికి ప్రతీకగా నిలిచే సామర్థ్యం కలిగివున్న నాయకుడు. రాంచందర్ రావు రాజకీయ ప్రయాణం ఎప్పుడూ దూకుడుతో కన్నా నైతిక పట్టుదలతో నడిచింది. భాషలో మితం, వ్యవహారంలో గంభీరత, వ్యూహంలో సహజ సూత్రీకరణ ు ఇవన్నీ ఆయనకు సహజ లక్షణాలు. పార్టీకి ఆయన అందించగల శక్తి కేవలం గణాంకాలదైనా కాదు ు అది విలువలపైన ఆధారపడి ఉంటుంది. బూత్ స్థాయి కార్యకర్తల మద్దతును తిరిగి పొందేందుకు ఆయన ప్రామాణికత ముఖ్యమైన ఆయుధంగా మారవచ్చు. కేంద్ర నేతలతో ఆయనకు ఉన్న సంపర్కం, విశ్వసనీయత రాష్ట్రానికి మరింత సహకారాన్ని చేకూర్చే అవకాశంగా మారుతుంది. కేంద్ర పథకాల ప్రజాదరణ పెంచేలా మీడియా, ప్రజా వేదికల ద్వారా అవగాహన కల్పించే ప్రక్రియలో ఆయన ప్రభావాన్ని పెంచే వీలుంది. ఒక పార్టీ నాయకుడిగా మాత్రమే కాక, ఒక సామరస్య చైతన్యానికి ప్రతినిధిగా ఆయన శక్తిని వినియోగించుకుంటే ు తెలంగాణ బీజేపీ పునఃస్థాపనకు ఇది చిహ్నం కావచ్చు. తెలంగాణ బీజేపీ ప్రస్తుతం ఒక మలుపును కాదు ు ఒక మార్గాన్ని దాటి కొత్త దిశను చేరాలన్న సంకల్పాన్ని ముందుంచుకుని ముందుకు సాగాలి. ఇది కేవలం నాయకత్వ మార్పు కాదు ు ఇది పార్టీ ఆత్మశోధన, పునర్నిర్మాణానికి సంకేతం కావాలి. ఈ మార్పు గౌరవం కాదు%ౌ% బాధ్యత. ఈ బాధ్యత నెరవేరితేనే బీజేపీకి రాష్ట్రంలో ఉన్నత స్థాయిలో తిరిగి ఎదిగే అవకాశాలు ప్రత్యక్షమవుతాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు, కాలమిస్టు %– 9440595494**




మార్కాపురం: సగటు మనిషిని బెదిరించడం వల్లే వైకాపాకు ఈ పరిస్థితి వచ్చిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రకాశం జిల్లా నరసింహపురంలో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో పవన్ ప్రసంగించారు. "2029లో అధికారంలోకి వస్తే మా అంతు చూస్తామని వైకాపా నేతలు అంటున్నారు. మీరు అధికారంలోకి రావాలి కదా? ఎలా అధికారంలోకి వస్తారో మేమూ చూస్తాం. వ్యక్తిగతంగా నాకు ఎవరిపై కక్ష ఉండదు. గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను పట్టించుకోలేదు. రౌడీయిజం, గూండాయిజంతో భయపెట్టి వేధించారు.

మంచినీరు అందించాలన్న ధ్యాస కూడ గత పాలకులకు లేదు. ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కావాలి. జల్ జీవన్ మిషన్ పథకాన్ని ఆపేస్తున్నామని కేంద్రం మాకు చెప్పింది. నీళ్లు ఇవ్వడం రాష్ట్రానికి సంబంధించింది.

కేంద్ర మంత్రి పాటిల్‌ను కలిసి అన్ని విషయాలు వివరించా. నీటి ఎద్దడి ప్రాంతాలకు రూ.84 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పాం. ప్రస్తుతం జల్ జీవన్ మిషన్ మొదటి విడత రూ.1,290 కోట్లతో శంకుస్థాపన చేసుకున్నాం. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా ప్రకాశం జిల్లాలో అతిపెద్ద తాగునీటి పథకమిదే. దాదాపు 10 లక్షలకు పైచిలుకు జనాభాకు తాగునీటిని అందించబోతున్నాం.

**ఆలయం భూములు దోచుకోవాలనుకుంటే అంతే సంగతి...** గత పాలకులు రూ.లక్షల కోట్లు అప్పులు పెడితే వాటన్నింటిని తట్టుకుని ఇవాళ ముందుకెళ్తున్నాం. వారి హయాంలో ఎలాంటి తాగునీటి పథకం చేపట్టలేదు. ఎన్నికల ముందు శిలాఫలకాలు వేసేందుకే పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. సకాలంలో నిధులు వస్తే 18 నుంచి 20 నెలల్లో పూర్తి చేస్తాం. నేను ప్రత్యేకించి ఈ పథకాన్ని పర్యవేక్షిస్తా. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం భూములు దోచుకోవాలనుకుంటే అంతే సంగతి. వైకాపా హయాంలో ఎక్కడ ఖాళీ భూములు కనిపించినా వాటిని దోచేశారు. ఆక్రమణకు గురైన ఆలయాల భూములను తిరిగి వెనక్కి తీసుకునే ప్రక్రియ ప్రారంభించాం. వాటికి రక్షణ కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది" అని పవన్ కల్యాణ్ అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయస్వామి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చురకలు

## సంపాదకీయం

# బీజేపీ ఆశ బారెడు.. ఫలితం మూరెడు ..!

ఆశ ఉండొచ్చు.. కానీ, దానికి కూడా కొన్నిపరిమితులు ఉంటాయి. అయితే.. ఆశే కదా.. ఎంతైనా ఉండొచ్చు అన్న ధోరణిలో కమలం పార్టీ నాయకులు ఉన్నారు. పైపై మెరుగులు చూస్తూ.. కూటమి సర్కారుపై విమర్శలు గుప్పిస్తున్నారు. కూటమిగా ఉంటామని చెబుతూనే.. మంత్రి పదవులు, ఇతర నామినేటెడ్ పదవుల విషయంపై ఒకరకంగా యాగీ చేస్తున్నారన్నది పరిశీలకులు చెబుతున్న మాట. 2014-19 మధ్య కూడా ఇలానే తాము బలంగా ఉన్నామన్న భ్రమంలోనే కమల నాథులు కాలం వెళ్లబుచ్చారు. అందుకే.. ఎడాపెడా.. అప్పట్లోనూ వ్యవహరించారు. కానీ, వాస్తవం ఏంటి? అసలు ప్రజల్లో బలం ఎంత? అనే విషయాలను పరిశీలిస్తే.. బీజేపీకి ఉన్న ప్రజా బలం చాలా చాలా తక్కువ. టీడీపీతో జత కట్టినప్పుడు మాత్రమే ఆ పార్టీ అన్నో ఇన్నో స్థానాల్లో విజయం దక్కించుకుంటోంది. ఇది జగమెరిగిన సత్యం. కానీ, గెలవక ముందు ఒక మాట.. గెలిచిన తర్వాత మరో మాట అన్నట్టుగా నాయకులు వ్యవహరిస్తున్నారు. గెలిచే వరకు.. టీడీపీతో ఉంటామని అంటారు. గెలిచి.. అధికారంలోకి వచ్చాక.. ఇంకేముంది.. అసలు మా వల్లే ప్రభుత్వం ఏర్పడిందని ప్రచారం చేస్తున్నారు. పదవుల విషయంలో డిమాండ్లు చేస్తున్నారు. కానీ.. టీడీపీ నాయకులు లేకుండా.. టీడీపీ మద్దతు లేకుండా.. పట్టుమని పది స్థానాల్లో గెలిచింది లేదు. ఈ విషయాన్ని మరిచిపోతున్న వారిలో సీనియర్ నాయకులు కూడా ఉన్నారు. విష్ణుకుమార్ రాజు వంటి వారు అనేక పర్యాయాలు విజయం దక్కించుకున్నారు. కూటమి రాజకీయాలు ఆయనకు కొత్తకాదు. కానీ, ఎప్పుడు కూటమి విజయం దక్కించుకున్నా..కలివిడి లేకపోగా... వివాదాలకు కారణం అవుతున్నారు. ఇది ప్రభావవంతంగా ప్రజల మధ్యకు చేరడంతో బీజేపీపై ఒకవిధమైన ఆలోచన వ్యక్తమవుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. కానీ, దీనిని మరిచిపోతున్నారు. మంత్రిపదవులు, నామినేటెడ్ పదవుల విషయంలో పట్టు బట్టడం.. బహిరంగ విమర్శలు చేయడం ద్వారా.. బీజేపీకి ప్రయోజనం లేదు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుని అసెంబ్లీలో కనీసం 20-40 సీట్లు దక్కించుకునే స్థాయికి ఎదగడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

# సహకారం... సమిష్టి శక్తికి దర్పణం, సమాజ అభివృద్ధికి మార్గం - జూలై మొదటి శని వారం, జూలై 5: అంతర్జాతీయ సహకార దినోత్సవం




ప్రపంచం నేడు అనేక సంఘర్షణల మధ్య సామాజిక సమగ్రత కోల్పోతున్న తరుణంలో, సమానత్వాన్ని, సమిష్టి ప్రయోజనాన్ని, సమాజ సంక్షేమాన్ని ప్రాతినిధ్యం వహించే వ్యవస్థ సహకార మొక దారి చూపుతుంది. ప్రతి సంవత్సరం జూలై మొదటి శనివారం రోజున ప్రపంచ మంతటా అంతర్జాతీయ సహకార దినోత్సవం జరుపు కుంటారు. ఈ సంవత్సరం, 2025లో, జూలై 5న ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతోంది. ఇది కేవలం ఒక ఉత్సవం కాదు%ౌ% సహకార భావనను మరింత విస్తరించేందుకు, సామాజిక భద్రతకు, ఆర్థిక సమానత్వానికి మార్గదర్శకంగా నిలిచే రోజుగా భావించాలి. సహకార భావనకు వాస్తవంగా భారతీయ సమాజంలో చక్కటి ఆదర్శాలున్నాయి. ఉమ్మడి వ్యవస్థలు, గ్రామ సభల సహకార జీవన విధానం, సహపంక్తి భోజనాలు, కలిసికట్టుగా వ్యవసాయం ౧ ఇవన్నీ ప్రాచీన భారత సహకార మౌలిక భావనలే. ఆధునిక సహకార ఉద్యమం మాత్రం 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో జన్మించింది. 1844లో రోచ్డేల్ పట్టణంలో పలువురు కార్మికులు కలిసి ఏర్పాటు చేసిన "రోచ్డేల్ సొసైటీ ఆఫ్ ఈక్విటబుల్ పైనీర్స్" ఆధునిక సహకార ఉద్యమానికి పునాది వేసింది. వారు ప్రవేశ పెట్టిన ప్రజాస్వామిక నియంత్రణ, స్వచ్ఛంద సభ్యత్వం, లాభాల సమాన పంపిణీ, శిక్షణ, విద్య వంటి సూత్రాలు నేటి సహకార విధానాలకు మార్గదర్శక మయ్యాయి. ప్రపంచ స్థాయిలో సహకారాల సమన్వయానికి ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయన్స్ (%×జూ%) అనే సంస్థ 1895లో ఏర్పడింది. ఇది ప్రస్తుతం 110 కంటే ఎక్కువ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రపంచ సహకార వేదిక. %×జూ%, ఐక్యరాజ్య సమితి సంయుక్తంగా 1995లో ప్రారంభించిన అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై మొదటి శనివారానికి కేటాయించింది. వాస్తవానికి ప్రపంచం లోని విపత్తుల సమయంలో, సహకార సంస్థలు తమ సభ్యులకు ఆర్థిక, మానసిక, వృత్తి పరంగా అండగా నిలిచిన ఉదాహరణలు అనేకం. భారత దేశంలో సహకార భావన వ్యవస్థీకృతంగా 1904లో బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన సహకార క్రెడిట్ సంఘాల చట్టంతో ప్రారంభమైంది. తర్వాత 1912, 1969, 2002లో అనేక చట్టాలు రూపు దిద్దు కున్నాయి. స్వాతంత్ర్యానంతరం సహకార ఉద్యమానికి కొత్త ఊపొచ్చింది. గ్రామీణ వ్యవసాయ అభివృద్ధికి, ప్రజల ఆర్థిక స్వావలంబనకు ఇది కేంద్ర బిందువుగా నిలిచింది. 1954లో భారత ప్రభుత్వం సహకారాలను అభివృద్ధికి కీలక పునాది చేసుకోవాలని నినాదించింది. 1991 తర్వాత ఉదారీకరణ వల్ల కొన్ని సహకార సంస్థలు వెనకబడ్డా%ౌ% నేటికీ ఈ వ్యవస్థ ఎంతో మంది చిన్న రైతులకు, కార్మికులకు, మహిళలకు, గృహనిర్మాణ సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. సహకార ఉద్యమానికి శాశ్వత గుర్తింపు నిచ్చిన మహానుభావుడు డాక్టర్ వర్గీస్ కురియన్. ఆయనే భారత పాల విప్లవానికి శిల్పి. అమూల్ అనే గుజరాత్ పాల సహకారాన్ని స్థాపించి దేశ వ్యాప్తంగా లక్షలాది గోరక్షక రైతులను ఆర్థికంగా నిలబెట్టాడు. భారత్‌ను ప్రపంచ అగ్ర పాల ఉత్పత్తి దేశంగా తీర్చిదిద్దాడు. ఆయన చూపించిన సహకార నమూనా వ్యవసాయం, డెయిరీ రంగాల లోనే కాదు, గ్రామీణ అభివృద్ధి లోనూ ఆదర్శంగా నిలిచింది. లాభం కోసం కాదు, సభ్యుల సంక్షేమం కోసం సాగే కార్యకలాపాలే అసలైన సహకార లక్ష్యంగా ఆయన విశ్వసించాడు. ఇక ప్రాంతీయ స్థాయిలోనూ సహకార విజయాల కోసము ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. మహారాష్ట్రలోని షుగర్ కోఆపరేటివ్‌లు గ్రామీణ ఆదాయాన్ని పెంచే వనరులుగా మారాయి. గుజరాత్‌లో అమూల్, బనాస్కాంతా, మేహసానా డెయిరీలు ప్రపంచ స్థాయిలో నిలిచాయి. కేరళలో "కుడుంబశ్రీ" సహకార వేదికలుగా మహిళా సాధికారతకు మార్గం చూపుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విజయ డెయిరీ, తిరుమల డెయిరీ సహకార డెయిరీలు రైతుల పక్షంగా నిలుస్తున్నాయి. అలాగే గ్రామీణ బ్యాంకింగ్, పాడి పరిశ్రమ, గృహ నిర్మాణ సహకారాలు వేలాది కుటుంబాలకు జీవనాధారం అయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా 3 మిలియన్లకు పైగా సహకార సంస్థలు ఉన్నాయంటేనే వాటి ప్రభావాన్ని అంచనా వేసుకోవచ్చు. ఇవి 12 కోట్ల మందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయి. భారత్‌లో 8 లక్షలకు పైగా సహకార సంస్థలు, 30 కోట్లకు పైగా సభ్యులతో ఈ రంగం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా సహకార బ్యాంకులు, గృహనిర్మాణ సంఘాలు, మార్కెటింగ్ సహకార సంస్థలు – ఇవన్నీ సామూహిక శక్తిని ఎలా ప్రదర్శించగలవో చూపిస్తున్నాయి. 2021లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహకార మంత్రిత్వ శాఖ ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోంది. దీని ద్వారా సహకార సంఘాల మధ్య సమన్వయం, పారదర్శకత, నూతన పునరాగమనం సాధ్యమవుతోంది. సహకార రంగంలో డిజిటల్ పరిష్కారాలు, నూతన ప్రణాళికలు అమలవుతున్నాయి. ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను మల్టీ-సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయడం, ఉత్పత్తి-వితరణలో వాటి పాత్ర పెంపు వంటి కార్యక్రమాలు సాగుతున్నాయి. వ్యక్తిగత ప్రయోజనం కన్నా సమిష్టి ప్రయోజనం గొప్పదని ఈ దినోత్సవం మనకు గుర్తుచేస్తుంది. సహకార సంస్థలు మనకు నేర్పిన పాఠం %-% నమ్మకం, సమానత్వం, పరస్పర సాయంతో ముందుకు సాగటం. ఈ విలువలను మన జీవితాల్లో పాటించి, సహకార ఉద్యమాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన అవసరం నేడు మరింత ఎక్కువగా ఉంది. సహకారం అనేది కేవలం సంస్థ వ్యవస్థ మాత్రమే కాదు %-% అది జీవన పద్ధతి. మనం జీవన విధానాన్ని మార్చుకుంటేనే సమాజంలో స్థిరత్వం, సమానత్వం, సాధికారత సాధ్యం అవుతుంది. జూలై 5న జరుపుకునే అంతర్జాతీయ సహకార దినోత్సవం మనకు ఓ మార్గదర్శకం. ఇది మనకు సామూహిక శక్తిని గుర్తు చేస్తుంది. సమాన హక్కులు, నైతిక విలువలు, ప్రజా పాలన, ఆత్మనిర్భరత అనే లక్ష్యాలవైపు మన ప్రయాణాన్ని మళ్లిస్తుంది. సహకారం అనేది సమాజాన్ని అంధకారం నుంచి వెలుగులోకి తీసుకెళ్లే శక్తివంతమైన సాధనం. ఈ దినోత్సవం సందేశం ౧ "ఒక్కడే కాదు పలువురు కలిసినప్పుడు మార్పు సాధ్యం%ౌ% సహకారమే శాశ్వత అభివృద్ధికి మార్గం". **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు, కాలమిస్టు... 9440595494**

# బీబీసీ టెలివిజన్ వార్తల ఆవిర్భావం - సమాచార విప్లవానికి ప్రారంభ ఘట్టం

## - 1954, జూలై 5...బిబిసి తొలి సారిగా టెలివిజన్ వార్తా ప్రసారాన్ని ప్రారంభించిన దినం


ప్రపంచ ప్రసార చరిత్రలో 1954 సంవత్సరం ఓ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. అదే ఏడాది జూలై 5న బ్రిటన్‌కు చెందిన బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ మొట్ట మొదటి సారిగా టెలివిజన్ వార్తా ప్రసారాన్ని ప్రారంభించి, సమాచార వ్యాప్తి మార్గాల్లో విప్లవాత్మక మార్పుకు నాంది పలికింది. అప్పటి వరకు పత్రికల ద్వారా చదివే వార్తలు, రేడియో ద్వారా వినిపించే వార్తలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండగా %-% టెలివిజన్ ద్వారా ప్రత్యక్ష దృశ్యాలతో వార్తలు చూసే అవకాశాన్ని కల్పించిన ఈ పథకం, నూతన దిక్సూచి అయింది. ఇది మీడియా రంగంలో జర్నలిజానికి ఓ దృఢమైన చిహ్నంగా నిలిచింది. బీబీసీకి 1922లో బ్రిటన్‌లో రేడియో ప్రసార సంస్థగా ఆవిర్భవించిన చరిత్ర ఉంది. అత్యంత నిష్పక్షపాత, నైతిక విలువలతో కూడిన ప్రసార సంస్థగా అప్పటి నుంచే పేరు తెచ్చుకుంది. 1936లోనే బీ బీ సీ టెలివిజన్ ప్రసారాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించినప్పటికీ, రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో 1939లో టెలివిజన్ సేవలను నిలిపి వేయాల్సి వచ్చింది. యుద్ధం ముగిసిన అనంతరం 1946లో తిరిగి టెలివిజన్ ప్రసారాలను పునరుద్ధరించి, పదుల సంవత్సరాల్లోనే ప్రజల దైనందిన జీవితంలో భాగంగా మార్చగలిగింది. 1950ల నాటికి టెలివిజన్ ప్రజల ఇళ్ల లోకి ప్రవేశించడం ప్రారంభమైంది. ఎలక్ట్రానిక్ మీడియా కొత్త ఒరవడికి తెరలేపుతున్న వేళ, బీ బీ సీ ప్రతిష్ఠాత్మకంగా వార్తల కోసం ప్రత్యేకంగా టెలివిజన్ వేదికను సిద్ధం చేసింది. దానితొ పాటు ప్రత్యేక బృందాలను, సాంకేతిక వనరులను, జర్నలిజం విలువలను సమన్వయంతో ఉపయోగించి, 1954 జూలై 5న తొలి టెలివిజన్ వార్తా బులెటిన్ ప్రసారం చేసింది. ఈ వార్తా కార్యక్రమానికి రిచర్డ్ బేకర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆ రోజుల్లో టెక్నాలజీ పరిమితుల కారణంగా, మరియు ఉద్యోగ సంఘాల నియమాల ప్రకారం వ్యాఖ్యాతలు స్క్రీన్ మీద కనిపించ కూడదన్న నిబంధనల కారణంగా, బులెటిన్‌ను పూర్తి దృశ్యాలతో కూడిన న్యూస్ రీల్ రూపంలో ప్రసారం చేశారు. న్యూస్ చిత్రాలపై వాయిస్ ఓవర్ రూపంలో రిచర్డ్ బేకర్ వివరణ ఇచ్చారు. ఈ శైలి రెండు సంవత్సరాలు కొనసాగింది. 1955లో ఈ నిబంధనలు




సడలడంతో, వ్యాఖ్యాతలు ప్రత్యక్షంగా స్టూడియోలో కూర్చుని వార్తలను చదివే పద్ధతికి మార్పు జరిగింది. ఈ టెలివిజన్ వార్తా ప్రసారంతో ప్రజలకు సమాచారాన్ని కేవలం వినిపించడమే కాకుండా, చూపించడమనే కొత్త అనుభూతిని కలిగించింది. ప్రజలు ప్రపంచంలో జరిగే ప్రధాన సంఘటనలను నేరుగా చూసే అవకాశం కలిగింది. వార్తలపై అవగాహన పెరిగింది. ప్రభుత్వ విధానాలపై స్పందన వేగవంతమైంది. పౌరునిగా తమ హక్కులు, బాధ్యతలు, సామాజిక సమస్యలపై అవగాహన పెరిగింది. బీబీసీ ఈ వార్తా వేదికను ప్రజాస్వామ్య వికాసానికి, చైతన్యానికి సేవ చేసే సాధనంగా మలిచింది. 1955లో ITV అనే ప్రైవేట్ టెలివిజన్ ఛానెల్ ప్రారంభం కావడంతో, బీబీసీకి వార్తా ప్రసారాల్లో పోటీ పెరిగింది. అయినా బీబీసీ తన నాణ్యత, విశ్వసనీయత, సంప్రదాయ విలువలను నిలబెట్టుకొని అనేక సంవత్సరాల పాటు బ్రిటన్ ప్రజల మన్ననలు పొందింది. అనంతరం 1964లో BBC 2 ప్రారంభమైంది. రంగురంగుల ప్రసారాలకు మార్పు, వార్తల రూపకల్పనలో ఆధునికీకరణ, మల్టీ కెమెరా కవరేజ్, ప్రత్యక్ష ప్రసారాలు, వేదికలపైకి జర్నలిస్టుల ప్రత్యక్ష హాజరు – ఇలా ఒక కొత్త దశ ప్రారంభమైంది. బీబీసీ టెలివిజన్ వార్తల ప్రసారంతో అనేక చారిత్రక సంఘటనలు ప్రత్యక్షంగా ప్రజలకు చేరాయి. 1963లో జాన్ ఎఫ్. కెన్నెడీ హత్య, 1969లో చంద్రునిపై తొలి అడుగు, 1989లో బెర్లిన్ గోడ కూలడం, 2001లో 9/11 ఉగ్రదాడులు – ఇవన్నీ BBC టెలివిజన్ ద్వారా ప్రత్యక్షంగా ప్రపంచం ముందుకు వచ్చాయి. ఈ వార్తల కవచం కేవలం సంఘటనలను తెలిపే విధానంలో కాకుండా, నేపథ్యం, విశ్లేషణ, ప్రజాభిప్రాయం, అంతర్జాతీయ ప్రభావం వంటి అంశాలను కలిగి ఉండటం ద్వారా ప్రేక్షకులను చైతన్య వంతులుగా మలిచింది. బీబీసీ ప్రారంభించిన ఈ మార్గాన్ని అనుసరించి, అమెరికాలో %జదీూ, చీదీజ,ాదీజ% లాంటి సంస్థలు టెలివిజన్ వార్తలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశాయి. భారత దేశంలో 1965లో టెలివిజన్ వార్తల ప్రసారం ప్రారంభమైంది. మొదటిగా రేడియో ఆధారిత వార్తలే ప్రసారమయ్యాయి. అనంతరం దృశ్య ప్రచారంతో కూడిన న్యూస్ బులెటిన్ రూపంలో అభివృద్ధి చెందాయి. 1980ల నాటికి దూరదర్శన్ తెలుగు, హిందీ, ఇతర భాషల్లో వార్తలు ప్రసారం చేస్తూ ప్రజలకు మరింత చేరువైంది. బీబీసీ టెలివిజన్ వార్తల ఆవిర్భావం, టెలివిజన్ జర్నలిజం విలువలకి పునాది వేసింది. విశ్వసనీయత, నిష్పక్షపాత ధోరణి, సమాచార స్వేచ్ఛ, ప్రజల ప్రయోజనాన్ని కాపాడే విలువలు – ఇవన్నీ బీబీసీ మాదిరిగా ఉన్నత ప్రమాణాలను ఏర్పరచాయి. బీబీసీ ఈ టెక్నాలజీని ప్రజల కోసం వినియోగించి, మీడియా రంగాన్ని ప్రజాస్వామ్య హక్కుల సాధనంగా మలచింది. ఈ ప్రారంభ ఘట్టం ఆధునిక సమాచార శకం గుండెకు స్పందన వలె నిలిచింది. నేటి టెలివిజన్ వార్తా ప్రపంచం కూడా ఈ మార్గాన్ని కొనసాగిస్తూ, కొత్త సాంకేతికత, డిజిటల్ మీడియా సహాయంతో ముందడుగులు వేస్తోంది. అయితే, బీబీసీ వేసిన విలువల మార్గం ఇప్పటికీ మారని పటిష్ట ప్రాతిపదికగా ఉంది. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా, దాన్ని నడిపించే విలువలే దాని ప్రయోజనాన్ని నిర్ధారిస్తాయి. బీబీసీ టెలివిజన్ వార్తల ప్రారంభం – ఆ విలువల ప్రయాణానికి ఆది మూలంగా నిలిచింది. అది కేవలం చారిత్రక ఘట్టం కాదు – ప్రజల సమాచార చైతన్యానికి, పౌర హక్కుల స్ఫూర్తికి, సమాచార స్వేచ్ఛకు నిలువెత్తు చిహ్నంగా నిలిచింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు, కాలమిస్టు... 9440595494**

# అక్కినేనిని సినీ బాట పట్టించిన బలరామయ్య - జూలై 5...ఘంటసాల బలరామయ్య జయంతి

ఒక వ్యక్తిని చూడగానే మంచి నటునిగా ఎదిగగల లక్షణాలు ఉన్నాయని నిర్ణయించడంలో సిద్ధహస్తులు ఘంటసాల బలరామయ్య. అలా ఆయన తీసుకున్న నిర్ణయంతో తెలుగు సినిమా ప్రపంచం ఒక గొప్ప మహా నటుడిని పొంద గలిగిన నేపథ్యం మరువ లేనిది. ఆయనే నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. 1947లో బలరామయ్య ఒక రైల్వే ప్లాటిఫారం మీద కనిపించిన వ్యక్తిని చూసి చూడగానే ఆయనకు చిత్రసీమలో బంగారు భవిష్యత్తు ఉందని ఊహించి, అందించిన ప్రోత్సాహం అక్కినేని జీవితాన్ని మలుపు తిప్పిన క్రమం అది. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించి చిరస్మరణీయ సంఘటనగా నిలిచి పోయింది. అలా అక్కినేని నాగేశ్వరరావు వంటి మహా నటుడి, నట జీవితానికి పునాది వేసిన వ్యక్తి ఘంటసాల బలరామయ్య. అక్కినేని నాగేశ్వరరావు కు " సీతారామ జననం " (1944), ద్వారా తెరయోగం కలిగించడమే కాకుండా, ఎ.యన్.ఆర్ .కు వెంటనే రెండవ చిత్రం రావాలని పని గట్టుకొని వేరొక దర్శకుని చుట్టూ తిరిగిన సహృదయులు ఆయన. పౌరాణిక చిత్రాలతో మొదలుపెట్టి, జానపద, సాంఘిక చిత్రాలను, చారిత్రక చిత్రాలను, ఎంతో వ్యయ ప్రయాసలతో నిర్మించి, విజయవంతమైన చిత్రాల నిర్మాతగా, దర్శకునిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ప్రత్యేకత సాధించిన ఘంటసాల బలరామయ్య. ఘంటసాల బలరామయ్య (జూలై 5, 1906 – అక్టోబరు 29, 1953) తెలుగు సినిమా నిర్మాత, దర్శకులు. 1906, జూలై 5న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరు జిల్లా పొట్టెపాలెం గ్రామంలో జన్మించారు. నాటక రంగంలో ప్రసిద్ధులైన బలరామయ్య సోదరులు రాధాకృష్ణయ్య ప్రోత్సాహంతో వీరికి రంగస్థల అనుభవం కలిగింది. అన్నదమ్ములిద్దరూ 1933లో కలకత్తా వెళ్ళి చిత్రరంగంలో అడుగు పెట్టారు. శ్రీరామా ఫిల్మ్స్, కుబేరా పిక్చర్స్ అనే కంపెనీలు పెట్టి 1936లో సతీ తులసి, 1938లో మార్కండేయ, 1940లో మైరావణ చిత్రాల్ని నిర్మించారు. 1940లో ప్రతిభా పిక్చర్స్ సంస్థను నెలకొల్పి పార్వతీ కళ్యాణం సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. తరువాతి కాలంలో చిత్ర నిర్మాణం, దర్శకత్వం రెండు నిర్వహిస్తూ గరుడ గర్వభంగం (1943), సీతారామ జననం (1944), ముగ్గురు మరాఠీలు (1946), బాలరాజు (1948), శ్రీ లక్ష్మమ్మ కథ, స్వప్న సుందరి, చిన్న కోడలు (1952) మొదలైనవి తయారు చేశారు. 1944లో నిర్మించిన సీతారామ జననం చిత్రం ద్వారా అక్కినేని నాగేశ్వరరావు, తర్వాత అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు లను తెలుగు చిత్రసీమకు పరిచయం చేశారు. 1948లో నిర్మించిన బాలరాజు సినిమా సాటిలేని విజయాన్ని అందించింది. ప్రతిభా పిక్చర్స్ అధినేత ఘంటసాల బలరామయ్య ఎ.ఎన్. ఆర్. తో నిర్మించిన జానపద చిత్రం ముగ్గురు మరాఠీలు విజయవంతం కావడంతో తదుపరి ప్రయత్నంగా 1948 లో అక్కినేని, ఎస్.వరలక్ష్మి, అంజలీదేవి ప్రధాన భూమికలుగా నిర్మించిన చిత్రం బాలరాజు. అంతవరకు తన పాత్రలకు తనే పాడిన నాగేశ్వరరావు ఈ చిత్రం నుండీ ఘంటసాలనే తనకు నేపథ్య గాయకునిగా పాడమనటం జరిగింది. ఘంటసాల ఆయనకు పాడిన తొలిపాట "చెలియా కనరావా". తొలినాట ఎస్.వరలక్ష్మి నటిగానే కాక, నేపథ్యగాయనిగా ఉండేవారు. ఈ చిత్రంలో ఎక్కువ భాగం పాటలు ఆమెవే. అయితే, ఆ చిత్రంలో ఒకే ఒక పాట, అది ఘంటసాలతో "నవోదయం నవోదయం" అనే యుగళ గీతం పాడిన మరొక నేపథ్య గాయని వక్కలంక సరళ. తోటివారిలో పోటీపడి శ్రీ లక్ష్మమ్మ కథ



చిత్రాన్ని కేవలం 19 రోజులలో నిర్మించి విడుదల చేశారు. తెలుగు సినీ రంగానికి వెలలేని సేవలందించిన వీరు 1953, అక్టోబరు 29 అర్థరాత్రిన గుండె పోటుతో పరమ పదించారు. ఆ సమయంలో ఆయన రేచుక్క చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆ చిత్రాన్ని పి.పుల్లయ్య పూర్తి చేశారు. ఆయన అందరూ అభివృద్ధి చెందాలని, సుఖంగా జీవించాలని కోరుకొనే వారు. ఎన్నో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. ఆయన మనుమడు ఎస్.ఎస్. తమన్ సంగీత దర్శకుడిగా రాణిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఏఐ బోధనకు ఆటంకాలు!

కొత్తగూడెం : ప్రాథమిక దశలో విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాల పెంపునకు విద్యాశాఖ మూడేళ్ల క్రితం చేపట్టిన 'తొలిమెట్టు' కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సాంకేతికతను వినియోగించుకొని ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలని సర్కారు సంకల్పించింది. కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా 3, 4, 5 తరగతుల విద్యార్థులకు భాష, గణితంలో బోధన ప్రారంభించాలని గతేడాది ప్రణాళిక రూపొందించింది. తొలుత కంప్యూటర్ ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యమిచ్చింది. ఎంపిక చేసిన బడులకు ఐదేసి కంప్యూటర్లను ఈ ఏడాది జూన్‌లో అందిస్తామని పలుమార్లు ప్రకటించింది. ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించింది. అయితే కంప్యూటర్లు పంపిణీ చేయకపోటంతో 'ఏఐ' బోధన అరకొరగా కొనసాగుతోంది.

**50 మందికి పైగా విద్యార్థులు కలిగిన పాఠశాలల ఎంపిక**

ఉభయ జిల్లాల్లో 50 మందికిపైగా విద్యార్థులు కలిగిన ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరం నుంచి 'ఏఐ' ద్వారా విద్యనందించేందుకు ఉన్నతాధికారులు సమాయత్తమయ్యారు. కంప్యూటర్ల సరఫరాతో పాటు ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తామని ప్రకటించారు. గతేడాది ప్రయోగాత్మకంగా ప్రారంభించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఐదేసి పాఠశాలల్లో మాత్రమే ప్రస్తుతం ఏఐ బోధన సాగుతోంది. మిగతా బడులకు ప్రభుత్వం



కంప్యూటర్లు, అంతర్జాల సదుపాయం సమకూర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మరోవైపు భద్రాద్రి జిల్లాలో 15 మంది లోపు విద్యార్థులు కలిగిన 75 పాఠశాలల్లో ట్యాబ్‌ల ద్వారా 'ఏఐ' పాఠాలు బోధిస్తుండటం విశేషం. 'కంప్యూటర్లు ఉన్న పాఠశాలల్లో కృత్రిమ మేధ తరగతులు కొనసాగుతున్నాయి. ఎంపికైన మిగతా బడులకు ప్రభుత్వం కంప్యూటర్లను అందజేయాల్సి ఉంది. కంప్యూటర్లు రాగానే ఆయాచోట్ల ఏఐ పాఠాలు బోధిస్తాం' అని భద్రాద్రి కొత్తగూడెం డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**భద్రాద్రి జిల్లాలో..**

ప్రాథమిక పాఠశాలలు: 95

ప్రాథమికోన్నత 75

# మాలావు దిగుబడి..

కల్లూరు : సాధారణంగా రబీలో వరిలో లావు రకాలే అధికంగా పండిస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ అందిస్తున్న నేపథ్యంలో గతేడాది యాసంగిలోనూ చాలామంది రైతులు సన్నాలే సాగు చేశారు. ఉభయ జిల్లాల్లో వరి ఉత్పత్తులకు పేరెన్నికగన్న కల్లూరు మండలంలో కొందరు ముతకల(లావు) వైపు మొగ్గుచూపారు. వీరిలో కొందరు 'పీఆర్ 126' విత్తన సాగుతో దిగుబడుల పంట పండించారు. వ్యవసాయాధికారులే కొందరు రైతుల సగటు దిగుబడుల తీరు చూసి ఆశ్చర్యపోయారు. రైతు పేరు జ్యేష్ఠ చిన్ననరసయ్య. పెద్దకోరుకొండి గ్రామం. తన 20 ఎకరాల పొలంలోని ఆరు ఎకరాల్లో పీఆర్ 126 సాగు చేశారు. ఎకరాకు సగటున 51 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. మంచి దిగుబడి రావటంతో సంతోషం వ్యక్తం చేశారు.

కనిపిస్తున్న రైతు పేరు పోట్రు సత్యం. ఎర్రబోయినపల్లి గ్రామం. పీఆర్ 126 వరివిత్తనాన్ని 12 ఎకరాల్లో సాగు చేశారు. దిగుబడి ఎకరాకు 53.20 క్వింటాళ్ల చొప్పున సాధించి మంచి లాభాలను పొందారు. ప్రభుత్వం ఈ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించటం ఖర్చుల పరంగా కలిసొచ్చిందని రైతు తెలిపారు.

ఎర్రబోయినపల్లి గ్రామానికే చెందిన మరో రైతు పేరు గద్దె శ్రీనివాసరావు. ఇతనూ పీఆర్ 126 విత్తనాన్ని వాడి 10 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు 52 క్వింటాళ్ల దిగుబడి పొందారు.

**ఎంత రావొచ్చు?**



అన్ని రకాల జాగ్రతలు, వ్యవసాయ నిపుణులు సూచించిన ప్రమాణాలను పాటిస్తే పీఆర్126 వరి విత్తనం సాధారణంగా ఒక్క ఎకరంలో 46 నుంచి గరిష్ఠంగా 49 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కల్లూరు మండలంలో రబీలో 48 క్వింటాళ్ల దిగుబడి దాటిన వారు సుమారు 60మంది వరకు ఉన్నారు. వ్యవసాయ నిపుణుల అంచనాలు మించి నలుగురైదుగురు 50 క్వింటాళ్ల పైచిలుకు ఉత్పత్తి రాబట్టారు.

**రైతులేమంటున్నారు?**

వానాకాలపు పంట కోసిన తరువాత వరిదుబ్బులు కాల్చకుండా గడ్డితో సాలుదుక్కులు దున్నాం. 3, 4 రోజుల వ్యవధిలో రెండోసారి కలియదున్ని గడ్డి మునిగే వరకు నీరుపెట్టాం. గడ్డి కూడా ఎరువుగా మారి బలాన్నిచ్చింది. విత్తనాలను మొలక కట్టి శాతాన్ని చూసుకుంటూ, వెదజల్లే పద్ధతిలో సాగు చేశాం. అందరికన్నా ముందుగా నీటి వసతులు ఉండటంతో డిసెంబరులోనే ఈ ప్రక్రియ ప్రారంభించాం. ఎరువులు కావాల్సిన మోతాదులో వినియోగించాం.

**దిగుబడులకు నాలుగు కారణాలు:**

శ్రీనివాసరెడ్డి, ఏడీఏ, సత్తుపల్లి

1 సాగర్ జలాలను వారబందీ పద్ధతిలో అందించటంతో వేరు వ్యవస్థ బాగా పెరిగి దుబ్బులు , దిగుబడులు ఎక్కువగా వచ్చాయి.

2 వెదజల్లే పద్ధతిలో కాలం కలిసి రావడంతోపాటు గింజ వేరు వ్యవస్థలో ఎక్కువ దుబ్బులు రావటానికి అవకాశం ఉంది.

3 సాగర్ జలాలు ఎక్కువ దూరం పారటంతో నీటి లోని మలినాలు (లవణాలు) శుద్ధి అయ్యే అవకాశం ఎక్కువ. దిగుబడు వృద్ధిలో ఇదీ భాగమే. 4 ఈ ఏడాది తెగుళ్లు కూడా చాలా తక్కువగా రావటంతో అనుకున్న దానికన్నా దిగుబడులు ఎక్కువగా వచ్చాయి.

రకం: పీఆర్ 126

అధిక దిగుబడులు సాధించిన గ్రామాలు: ఎర్రబోయినపల్లి, చెన్నూరు, పెద్దకోరుకొండి, రఘునాథగూడెం, చంద్రుపట్ల, వాచ్యానాయక్ తండా

గరిష్ఠ దిగుబడి: 53.2 క్వింటాళ్లు (వంద కిలోల చొప్పున)

# అమ్మ పేరిట పచ్చదనం.. పెరటిలో హరితవనం



సూర్యాపేట: జిల్లాలో 33 శాతం ఉండాల్సిన అటవీ విస్తీర్ణం(పచ్చదనం) తగ్గుముఖం పడుతోంది. హరిత జిల్లా లక్ష్యంగా ఏటా వనమహోత్సవం కింద విస్తృతంగా మొక్కలు నాటుతున్నారు. కానీ వాటిని సంరక్షించకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. 2021 నుంచి 2023 వరకు జిల్లాలో అటవీ విస్తీర్ణం తగ్గటం ఆందోళన కలిగిస్తుంది. గతేడాది వెల్లడైన 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్టు రిపోర్టు-2023' ప్రకారం మూడేళ్ల వ్యవధిలో 1.05 చ.కి.మీ తగ్గింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సారి నిర్దేశించుకున్న లక్ష్యం వెల్లివిరిసేలా నాటిన ప్రతి మొక్కను రక్షిస్తేనే వనం వృద్ధి చెందుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**గతేడాది వెనుకబాటే**

2024-25లో జిల్లా వ్యాప్తంగా 46.58 లక్షల మొక్కలు నాటాలనేది లక్ష్యం. కానీ నాటింది 38.47 లక్షలని తెలిసింది. అంటే 8.11 లక్షలు నాటలేదు. నాటిన ప్రతి మొక్క ఎదగడం లేదని, అందుకు వెచ్చించిన రూ.లక్షల నిధులు నేలపాలయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి.జిల్లాలోని 475 గ్రామాల్లో నర్సరీల్లో సుమారు 42 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. దాదాపు 2 లక్షల మొక్కలు ఆరు నుంచి ఏడు అడుగల ఎత్తులో ఉన్నాయి. చాలా వరకు అడుగున్నర పైగా ఎత్తులో ఉన్నాయని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి అప్పారావు పేర్కొన్నారు.

**నిర్లక్ష్యం చేయొద్దు..**

వర్షాలు కురుస్తున్నాయి. నాటేందుకు అవసరమైన మొక్కలు గ్రామ పంచాయతీ నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి. అందుకు తగినట్లు యంత్రాంగం 'ఇందిర వన ప్రభ' కార్యక్రమాల నిర్వహణకు సన్నద్ధమవుతోంది. అన్ని ప్రభుత్వశాఖలు కలిసి జిల్లా వ్యాప్తంగా ఈ సారి 54.07 లక్షల మొక్కలను నాటేలా ప్రణాళికలను రూపొందించుకుంటున్నాయి. ఇది భాగానే ఉన్నా నాటిన ప్రతి మొక్క ఎదుగుదలపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పచ్చదనం పెంపు అమల్లో కంటి తుడుపు చర్యలే కనిపిస్తున్నాయి. చాలా చోట్ల పాదులోనే చనిపోతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం కాగితాల్లోనే మొక్కలుంటున్నాయి కానీ నేలపై ఉండడం లేదు. నిధులూ వృథా అవుతున్నాయి. లక్ష్యం మేర పచ్చదనం పదింతలు పెరగాలంటే నిర్లక్ష్యం చేయకుండా రక్షణ చర్యలు చేపట్టాలి.

**ఇలా చేద్దాం..**ప్రతి ఇంటా నీడ, పండ్ల మొక్కల పంపిణీ విరివిగా జరగాలి. విద్యుత్తు తీగలను దృష్టిలో పెట్టుకొని నాటుదాం. పశువుల బారిన పడకుండా రోడ్లకిరువైపులా నాటిన వాటి చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేద్దాం. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీరందిస్తూ సంరక్షణ చేపట్టాలి. బడుల్లో జన్మదినం జరుపుకొనే విద్యార్థులతో నాటిద్దాం. ప్రధాని మోదీ చెప్పినట్లుగా అమ్మపేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి. వీధుల్లోని రోడ్ల వెంట నాటిన వాటి బాధ్యతను కాలనీవాసులు సమష్టిగా తీసుకోవాలి.

# అడ్డుగా..దొడ్డుబియ్యం



హుజూర్‌నగర్ :నిల్వ ఉన్న దొడ్డు బియ్యం వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బియ్యం అమ్మి సొమ్ము చేసుకునే పనిలో పౌరసరఫరాలశాఖ ఉంది. దీనిపై త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు ఇప్పటికే రెండు, మూడు సమావేశాలు నిర్వహించి విధివిధానాలు తయారు చేస్తున్నారని రాష్ట్ర స్థాయి అధికారి ఒకరు తెలిపారు.

రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి హుజూర్‌నగర్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి అన్ని ప్రాంతాలలో ఈ పంపిణీ జరుగుతోంది. సన్నబియ్యం పంపిణీ నాటికి జిల్లాలో అన్ని రేషన్ దుకాణాలు, గోదాముల్లో దొడ్డు బియ్యం మిగిలి ఉన్నాయి. వాటిని ఏం చేయాలనే నిర్ణయం ఇప్పటి వరకు తీసుకోకపోవడం వల్ల అవి ముక్కిపోతున్నాయి. దొడ్డు బియ్యం నిల్వ ఉండటంతో పురుగు పడి సన్న బియ్యానికి కూడా పాకుతుందని, బియ్యం గడ్డ కడుతున్నాయని రేషన్ డీలర్లు అంటున్నారు.

**టెండర్ ద్వారా అమ్మకం..**

రేషన్ దుకాణాలు, గోదాములలో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు అధికారుల అంచనా. వీటి విలువ రూ.420 కోట్ల పైమాటే. మార్చి నెల నుంచి ఇవి అలాగే మగ్గిపోతున్నాయి. సన్న బియ్యం పంపిణీ షురూ చేసే నాటికి మిగిలి ఉన్న దొడ్డు బియ్యం భద్రపర్చాలని అధికారులు రేషన్ డీలర్లను, గోదాం ఇన్‌ఛార్జిలను ఆదేశించారు. వీటిని పౌరసరఫరాలశాఖ దుకాణాల వారీగా ఉన్న నిల్వల ప్రకారం రికవరీ చేసుకుంటామని అధికారులు డీలర్లకు చెప్పారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. గతంలో కందిపప్పు పంపిణీని నిలిపివేసినప్పుడు డీలర్ల వద్ద ఉన్న పప్పును తీసుకుపోవడానికి దాదాపు 15 నెలల సమయం తీసుకున్నారు. దీంతో ఆ పప్పు పూర్తిగా చెడిపోయిందని డీలర్లు తెలిపారు. కొందరు డీలర్లు చెడిపోయి దుర్వాసన వస్తుందని పారబోశారు. తరువాత దాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులు టెండరు ద్వారా అమ్మకాలు చేశారు. తీరా డీలర్ల దగ్గరకు పప్పు కోసం వెళ్లే చాలా మంది వద్ద లేకపోవడంతో అధికారులు వారికి నోటీసులు జారీ చేశారు. డీలర్లు అప్పుడు మార్కెట్‌లో పప్పు కొని ఇవ్వాల్సి వచ్చింది. ఈ అనుభవం ఉన్న డీలర్లు దొడ్డు బియ్యం ముక్కి, పురుగు పడుతున్నా వాటిని అలాగే ఉంచుతున్నారు.

# పోయిన ఉద్యోగాలు.. తిరిగి పొందారు



కొత్తగూడెం : పోయిందనుకున్న ఉద్యోగం తిరిగి లభించనుంది. దీంతో నాలుగేళ్ల ఎదురుచూపులు ఫలించాయి. నాలుగు రోజుల క్రితం సింగరేణి యాజమాన్యంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలకు తిరిగి ఉద్యోగావకాశాన్ని కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించింది. దీంతో ఉద్యోగాలను పోగొట్టుకొని తిరిగి అవకాశం కోసం చూస్తున్న 143 మంది మాజీ జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలు తిరిగి కొలువుల్లో చేరనున్నారు. ఈ అంశంపై యాజమాన్యానికి, గుర్తింపు సంఘానికి మధ్య ఒప్పందం కుదరగా త్వరలో దీనిపై త్రైపాక్షిక సమావేశంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లోని రీజనల్ లేబర్ కమిషనర్ ముందు ఇరు పార్టీలు ఒప్పంద పత్రాలపై అంగీకార సంతకాలు చేసిన తర్వాత ఓ సర్క్యులర్ జారీ కానుంది.మూడు నాలుగు సంవత్సరాలుగా సింగరేణిలో చేరిన జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలు కంపెనీ నిబంధనలను పాటించక పోవటంతో తొలగింపునకు గురయ్యారు. వారు చేస్తున్న ఉద్యోగానికి తగిన పత్రాలను సాధించటంలో కొందరు విఫలమైతే, గైర్హాజరు కారణంగా మరికొంత మంది తొలగింపునకు గురయ్యారు. ఉద్యోగంలో చేరిన సంవత్సరంలోగా అర్హత కోసం గ్యాస్‌టెస్టింగ్, ఓవర్‌మెన్ మొదలైన సాంకేతిక కోర్సులను పూర్తిచేసి ధ్రువీకరణ పత్రాలను పొంది గడువులోగా సమర్పించాలి. కొందరు ఈ కోర్సులను పూర్తి చేసినా కరోనా సమయంలో డీజీఎంఎస్ డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ వారు ధ్రువీకణ పత్రాలు ఇవ్వకపోవటంతో వారు పత్రాలను సమర్పించలేకపోయారు. దీంతో వీరిని యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. సింగరేణిలో జేఎంఈటీలను తిరిగి విధుల్లో తీసుకోవటం విశేషం. తిరిగి ఉద్యోగావకాశాన్ని పొందిన జేఎంఈటీలు నిబద్ధతతో పనిచేయాలని సింగరేణి అధికారులు సూచిస్తున్నారు.

**సంతోషంగా ఉంది: నిశాంత్, మందమర్రి** ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న మాకు మళ్లీ కొలువు ఇప్పించటం సంతోషంగా ఉంది. నిబంధనల ప్రకారం కృషి చేసి ఉద్యోగాలు నిలుపుకొంటాం. ధ్రువపత్రాలు సమర్పించేందుకు గడువు దాటడంతో సమయానికి పత్రాలను సమర్పించలేకపోయాం. దాని వల్ల ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చింది.

**కొత్త జీవితం..: మాదరబోయిన దీక్షిత్, గోదావరిఖని**

మాకు గుర్తింపు సంఘం కొత్తజీవితాన్ని అందించింది. కరోనా సమయం కావటంతో కోర్సు చేసేందుకు అవకాశం లేకపోయింది. అందువల్ల తొలగింపునకు గురయ్యాం. యూనియన్ సహకారంతో తిరిగి నియామకం పొందేందుకు అవకాశం రావడం సంతోషంగా ఉంది.

# ఔరా.. సౌర!

కొత్తగూడెం : విద్యుత్తు.. ఇది విద్య, వైద్యం, కమ్యూనికేషన్లు మొదలు ఇళ్లు, పొలాల దాకా ప్రతిచోటా ఉండాల్సిందే. జిల్లాలో ఏటా సగటుకు మించి విద్యుత్తు గిరాకీ పెరుగుతోంది. 2021-22లో రూ.22,354.12 లక్షల విద్యుత్తును వినియోగించగా 2024-25 నాటికి రూ.31,787.93 లక్షలకు చేరింది. అంటే నాలుగేళ్లలో రూ.9,433.81లక్షలు (42శాతం) పెరిగింది. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి కోసం విచ్చలవిడిగా బొగ్గు తవ్వకాలు చేపట్టడం, థర్మల్ ప్లాంట్ల ఏర్పాటుతో పర్యావరణం కలుషితమవుతోంది. దీనిని అరికట్టేందుకు పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్నాయి.

**మిగులు విద్యుత్తుతో రాబడి..**

సౌర విద్యుదుత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహిళా సంఘాల ద్వారా జిల్లాలో రెండు(ఒక్కోటి 0.50 మెగావాట్) సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. పీఎం కుసుమ్ పథకం కింద 25మెగావాట్ల సౌర ప్లాంట్లు నెలకొల్పేందుకు ఇప్పటికే



ఎల్ఓఏ(లెటర్ ఆఫ్ అవార్డు) జారీ చేసింది. వీటితో పాటు 'సూర్యఘర్' పథకం ద్వారా ఇంటి పైకప్పులపై 3కిలోవాట్ల వ్యవస్థ ఏర్పాటుకు రూ.2.40లక్షలు ఖర్చుకానుండగా.. కేంద్రం రూ.78వేలు రాయితీ ఇస్తోంది. బ్యాంకులు సైతం రుణాలిస్తున్నాయి. జిల్లాలోని ఆరు విద్యుత్తు డివిజన్ల పరిధిలో 743 సోలార్ సర్వీసులు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు 5,41,561యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. ఒక్కో యూనిట్‌కు రూ.5.25 చొప్పున మొత్తంగా రూ.28,46,986 డిస్కంలు చెల్లిస్తున్నాయి. ఇందులో సొంత అవసరాలు పోనూ.. మిగులు విద్యుత్తు ద్వారా నిర్వాహకులు ఆదాయం పొందుతున్నారు.

పట్టణ ప్రాంతాల్లో గృహ, వాణిజ్య అవసరాల కోసం 5-10కిలోవాట్ల సోలార్ ప్యానెళ్లు ఎక్కువగా ఏర్పాటు చేసుకుంటున్నారు. సొంత అవసరాలు తీర్చుకోగా.. మిగిలిన విద్యుత్తును డిస్కంలకు విక్రయిస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం సోలార్ ప్యానళ్ల ఏర్పాటు కోసం వచ్చే దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అజయ్‌కుమార్, జిల్లా మేనేజర్, టీజీ రెడ్కో

# వ్యాయామ విద్య.. సహకారం మిథ్య!

ఖమ్మం : కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో మూడే వ్యాయామ విద్య (బీపీఈడీ) కళాశాలలు ఉన్నాయి. వీటిలో రెండు వరంగల్‌లో కొనసాగుతున్నాయి. మరొకటి ఖమ్మంలోని కేయూ పీజీ కళాశాలలో ఉంది. దీనిని ప్రారంభించి పదకొండేళ్లయినా పూర్తిస్థాయి లో బోధనా సిబ్బంది లేరు. రెండేళ్ల బీపీఈడీ కోర్సులో ప్రథమ సంవత్సరం 100 మంది, ద్వితీయ సంవత్సరం 100 మంది విద్యార్థు లు ఇక్కడ చదువుతున్నారు. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల చెందినవారు ఉన్నారు. ఏటా ఫిజికల్ ఎడ్యుకేషనల్ టెస్టు ద్వారా అర్హత సాధించినవారు బీపీఈడీ కళాశాలల్లో చేరుతారు.

**వేధిస్తున్న బోధనా సిబ్బంది కొరత**

ప్రిన్సిపల్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు పార్ట్‌టైమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు క్రీడా శిక్షకులు, యోగా శిక్షకుడు, డైటీషియన్, పార్ట్‌టైమ్ వైద్యుడు ఉండాలి. ప్రస్తుతం ప్రిన్సిపల్, ముగ్గురు కన్సాలిడేటెడ్ సిబ్బంది కలిపి నలుగురే బోధనా సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండటం గమనార్హం. బోధనేతర సిబ్బందిలో ఫిజియోథెరపిస్ట్, లైబ్రేరియన్, మ్యూజిక్ టీచర్, కంప్యూటర్ ఆపరేటర్, సాంకేతిక సహాయకుడు, అకౌంటెంట్, స్టోర్ కీపర్ ఒక్కొక్కరు, ఇద్దరు గ్రౌండ్‌మన్స్/మార్కర్స్,



మరో ఇద్దరు ఆఫీస్ సబార్డినే టర్లు ఉండాలి. ఒక్కో క్లర్కు, అటెండరు మాత్రమే పనిచేస్తున్నారు. మొత్తమ్మీద ఆరుగురితోనే దశాబ్దకాలంపైగా నెట్టుకొస్తున్నారు.

**ఏటా సీట్లు భర్తీ**

ప్రతి సంవత్సరం కళాశాలలో అన్ని సీట్లు భర్తీ అవుతున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో ఎక్కువ మంది విద్యార్థులు ఈకోర్సును ఇష్టపడుతున్నారు. ఏటా 55 మంది అమ్మాయిలు, 45 మంది అబ్బాయిల చొప్పున చేరుతున్నారు. ఇటీవల పదకొండో బ్యాచ్ విద్యార్థుల కోర్సు పూర్తయ్యింది. చాలామంది క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా బెంగళూరుకు చెందిన ఎడ్యుస్పోర్ట్స్‌లో ఉద్యోగాలు సాధిం చారు. మిగతా వారికీ ప్రభుత్వ, అనుబంధ విద్యాసంస్థల్లో, ప్రైవేటు విద్యాలయాల్లో కొలువులు లభిస్తున్నాయి. 'బోధన, బోధనేతర సిబ్బంది తక్కువ మంది ఉన్నప్పటికీ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. బీపీఈడీ అభ్యసించిన వారి కోసం ఇక్కడ ఎంపీఈడీ కోర్సు ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. వ్యాయామ విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న క్రమంలో కళాశాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రజాప్రతి నిధుల సహకారం తీసుకుంటున్నాం.' అని ప్రిన్సిపల్ చేకూరి రవికుమార్ తెలిపారు.

# 'పైసా'చికం

తలకొండపల్లి : తలకొండపల్లి తహసీల్దార్, అటెండర్ అవినీతి నిరోధక శాఖ (అనిశా) వలకు చిక్కన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వివరాల ప్రకారం.. అంతారం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి పేరుతో ఉన్న 22 గుంటల భూమిని తన కొడుకులకు, మనవళ్లకు రిజిస్ట్రేషన్ చేయడానికి గత నెల 9న స్లాట్ బుక్ చేసి, 10వ తేదీ నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగారు. ఆరు డాక్యుమెంట్లు ఉండగా.. ఒక్కోదానికి రూ.2 వేల చొప్పున రూ.12 వేలు ఇవ్వాలని అటెండర్ యాదగిరి.. రైతులకు చెప్పాడు. దీంతో బాధిత రైతులు.. అనిశాను ఆశ్రయించారు. మా దగ్గర అంత డబ్బు లేదు, రూ.10 వేలు ఇస్తామని తహసీల్దార్ నాగార్జునకు రైతులు తెలిపి, అటెండర్ యాదగిరికి నగదు ఇచ్చారు. వెంటనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ నాగార్జున, యాదగిరిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఆనంద్‌కుమార్ చెప్పారు.

తహసీల్దార్ నాగార్జున అనిశాకు పట్టుబడినట్లు తెలియగానే ఆ కార్యాలయం ఎదుటే కొందరు రైతులు బాణసంచా కాల్చారు. ప్రతి



పనికి డబ్బులు డిమాండ్ చేసే వారని.. ఆయన ఏసీబీకి దొరకడం ఆనందంగా ఉందని పలువురు రైతులు తెలిపారు.

**మ్యుటేషన్‌కు డబ్బులు డిమాండ్**

మూసాపేట సర్కిల్ కార్యాలయం రెవెన్యూ విభాగంలో(ట్యాక్స్ సెక్షన్) సీనియర్ అసిస్టెంట్ ఎం.సునీత రూ.30 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వివరాల ప్రకారం.. మూసాపేట సర్కిల్ పరిధిలో ఓ వ్యక్తి మ్యుటేషన్(ఆస్తి మార్పిడి) కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఆస్తి మార్పిడికి ఆమె రూ.80 వేల లంచం ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. చివరకు రూ.30 వేలకు అంగీకరించారు. బాధితుడు మంగళ వారం డబ్బుతో ఏసీబీ అధికారులను సంప్రదించగా.. వారు పథకం ప్రకారం అతన్ని పంపి ఆమెకు లంచం ఇప్పించారు. డబ్బు తీసుకొని దరఖాస్తుదారుడి ఫైలులో ఉంచి డ్రాలో పెట్టారు. అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని లంచం సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

# నొప్పికి టీకా.. ఆందోళన లేదిక

ఉస్మానియా ఆసుపత్రి: ఉస్మానియా ధర్మాసుపత్రిలో ఇటీవలే నొప్పి నివారణ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఉస్మానియా బోధనాసుపత్రిలో చదివి నేడు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సుమారు రూ.50 లక్షల విలువైన వైద్య పరికరాలు దవాఖానాకు సమకూర్చారు. మరో రూ.50 లక్షల విలువైన పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. ముందెన్నడూ లేని విధంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పాత భవనంలోని హౌస్‌సర్జన్ క్వార్టర్స్‌లోని గదులకు మరమ్మతులు చేపట్టారు. కొన్ని యంత్రాలు ఇప్పటికే అమర్చారు. పనులు కొనసాగుతున్నాయి. క్యాన్సర్ రోగులు, నరాలు, కండరాలు, వెన్ను, స్పాండిలైటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు ఈ క్లినిక్‌లో చికిత్స చేస్తారు. ఆర్థోపెడిక్, న్యూరాలజీ, అనస్థీషియా, ఫిజియోథెరపీ వంటి వివిధ విభాగాలకు చెందిన వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని సూపరింటెండెంట్ డా.రాకేశ్ సహాయ్ వెల్లడించారు.

**వారంలో మూడు రోజులు:** వారంలో మూడు రోజులు ఆయా విభాగాలకు చెందిన వైద్యులు అందుబాటులో ఉంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చికిత్స అందిస్తారు. ఉస్మానియాతో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్, గాంధీ, ఈఎన్‌టీ, నిలోఫర్ ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి రెఫరల్‌గా వచ్చే రోగులకు ఈ కేంద్రంలో చికిత్స చేసి పంపుతారు. రోగికి నొప్పి తీవ్రత ఎక్కడ ఉందనే విషయమై సీ-ఆమ్, అల్ట్రాసౌండ్, ఇతర రోగ నిర్ధారణ పరీక్షల ద్వారా నిర్ధారిస్తామని వివరించారు. ఆ తర్వాతే ఖరీదైన ఇంజక్షన్లు నరాలకు ఇవ్వడం ద్వారా రోగికి ఉపశమనం కలిగిస్తామన్నారు. చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చాలని ఉన్నతాధికారులకు విన్నవించారు.

**వచ్చే ఏడాది నుంచి కోర్సు అమలు**

పెయిన్ మేనేజ్‌మెంట్ కోర్సుకు ఇటీవలే ఉస్మానియాలోని వైద్యాధికారులు తెలంగాణ సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. వచ్చే ఏడాది నుంచి అమలయ్యే అవకాశం ఉందని డా.రాకేశ్ సహాయ్ వెల్లడించారు. ఎంబీబీఎస్, జనరల్ మెడిసిన్ ఎండీ తర్వాత మరో మూడేళ్లు కాలవ్యవధి కలిగిన ఈ కోర్సును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# వన మహోత్సవానికి వేళాయే..!

నల్గొండ : వన మహోత్సవానికి వేళయింది. జిల్లా వ్యాప్తంగా ఏ శాఖ ఎక్కడెక్కడ ఎన్ని మొక్కలు నాటించాలన్న లక్ష్యం ఖరారు చేశారు. జిల్లాలో పదకొండో విడత వనమహోత్సవానికి జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. సామూహిక వనాల పెంపకానికి స్థల సేకరణలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామాల్లో గుంతల తవ్వకాల పనులు కొనసాగుతున్నాయి.

**గ్రామ ప్రణాళికతో..**

గ్రామస్థులకు అవసరమైన రకాలను ఎంపిక చేసి గ్రామ నర్సరీల్లో వాటినే పెంచారు. గృహ అవసరాలకు, రైతులకు ఉపయోగపడేవి, ఇతర ప్రాంతాల్లో నాటే మొక్కలతో పాటు ఇతర లాభదాయకమైన 40 రకాలను సిద్ధం చేశారు. గ్రామంలో నాటేందుకు సరిపడ మొక్కలను ఆయా గ్రామంలోని నర్సరీలోనే అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో నాటే 39.50 లక్షల మొక్కల్లో 19.50 లక్షలు ఇళ్లల్లో, 20 లక్షలు రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో నాటనున్నారు. మొక్కల పంపిణీ సమయానికి ఎంపిక చేసిన రకాలు నర్సరీల్లో ఉంచాలని నిర్ణయించారు. అయితే జిల్లాలో పలు నర్సరీల్లో కొన్ని రకాల విత్తనాలు మొలకెత్తలేదు. వాటి కొరతను తీర్చేందుకు ఇతర ప్రాంతాల నుంచి ఆయా మొక్కల నారును పలు గ్రామాలు వారు తీసుకొచ్చి నర్సరీల్లో పెంచారు.

**సర్కారు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా..**

గ్రామాల్లో, ఖాళీ ప్రదేశాల్లో, రైతుల పొలాల గట్లపైన మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించారు. ఇప్పటి వరకు చెట్లు లేకుండా ఉన్న రోడ్లకు ఇరువైపులా గుంతలు తవ్వుతున్నారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణానికి సేకరించిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ స్థలాలను అక్రమార్కులు వదలడం లేదు. ప్రభుత్వ స్థలాలను రక్షించేందుకు అవసరాల నిమిత్తం సేకరించిన భూముల్లో మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు దస్త్రాల ఆధారంగా క్షేత్ర స్థాయిలో హద్దులు నిర్ణయించి జాబితా సిద్ధం చేశారు.

# నిపుణుల పర్యవేక్షణ లేకే పేలుడు?



హైదరాబాద్: రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రమాదంగా నిలిచిన సిగాచీ ఘటనకు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. యంత్రాల వద్ద, రియాక్టర్, బాయిలర్, డ్రయ్యర్ల వద్ద నిపుణుల పర్యవేక్షణ లేదని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ కోణంలోనే దర్యాప్తు ప్రారంభించినట్టు పరిశ్రమలశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఔషధాలు, ఆహార పరిశ్రమలో వాడే మైక్రోక్రిస్టలైన్ సెల్యూలోజ్ (ఎంసీసీ) ఉత్పత్తి జరుగుతుండగా.. ఇందుకోసం హైడ్రోక్లోరిక్ ఆమ్లం, చెక్కగుజ్జు(వుడ్‌పల్ప్)ను ముడిపదార్థంగా వాడతారు. హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని నియంత్రిత పరిస్థితుల్లో రియాక్టర్‌లో హైడ్రోలైజ్ చేస్తారు. ఈ ప్రక్రియలో సెల్యూలోజ్‌లోని అస్ఫటిక భాగాలు కరిగిపోయి, స్ఫటికాకార భాగాలు మిగిలిపోతాయి. ఈ స్ఫటికాకార భాగాలే మైక్రో క్రిస్టలైన్ సెల్యూలోజ్‌గా ఏర్పడతాయి. హైడ్రోలిసిస్ తర్వాత ఏర్పడిన మిశ్రమాన్ని వడపోత ద్వారా వేరు చేసి మిగిలిన సెల్యూలోజ్‌ను నీటితో శుద్ధి చేస్తారు. శుద్ధి చేసిన సెల్యూలోజ్‌ను స్ప్రే డ్రయింగ్ లేదా ఓవెన్ డ్రయింగ్ వంటి పద్ధతుల్లో ఎండబెట్టి తేమ తొలగిస్తారు. ఇక్కడే డ్రయ్యర్ల వద్ద ఉష్ణోగ్రత 700-800 డిగ్రీల వరకు పెరిగి పేలుడు సంభవించొచ్చని అధికారులు భావిస్తున్నారు.

**భద్రతా లోపాలు..**పాశమైలారం, సదాశివపేట్, పటాన్‌చెరు, ఐడీఏ బొల్లారం ప్రాంతంలో సిగాచీ తరహా పరిశ్రమలు అనేకం ఉండగా ఏటా పేలుడు ఘటనలు సంభవిస్తున్నాయి. ఒకే పరిశ్రమల్లో ఏడాదిలో రెండుసార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. అయినా నిర్వాహకులు కళ్లు తెరవకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**పీసీబీ నివేదిక ప్రకారం**

సీఎఫ్‌వో అనుమతి గడువు: 2027 మార్చి 31
ప్రతినెలా వుడ్ పల్ప్ వినియోగం: 861 టన్నులు
ప్రతినెలా హైడ్రోక్లోరిక్ ఆమ్లం వినియోగం: 74 టన్నులు
రోజూ మైక్రో క్రిస్టలైన్ సెల్యూలోజ్ ఉత్పత్తి: 25,200 కిలోలు
కోల్ ఫైర్డ్ ట్యూబ్ బాయిలర్ సామర్థ్యం: ప్రతి గంటకు 3 టన్నులు
కోల్ ఫైర్డ్ బాయిలర్ (స్టాండ్‌బై):ప్రతి గంటకు 2 టన్నులు

# సామాజిక దురాచారం.. చైతన్యంతోనే దూరం



గోదావరిఖని : ఉమ్మడి జిల్లాలో అదనపు వరకట్నం వేధింపులు పెరిగిపోతున్నాయి. భర్త, అత్తింటివారి వేధింపులకు వివాహితలు బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. కట్నం దురాచారాన్ని ఇంకా రూపుమాపకపోవడంతో వివాహితలు, వారి కుటుంబీకులు మానసిక వేదనకు గురవుతున్నారు. ఏటా సుమారు 850 అదనపు కట్న వేధింపుల కేసులు అవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 378 నమోదయ్యాయి. అందులో 20 మంది వరకు భర్త, అత్తింటి వేధింపులు భరించలేక ఆత్మహత్యలు చేసుకోవడం ఆందోళనకరం.

**డిమాండ్‌కు అంతు లేదు**

సమాజం నుంచి వరకట్నం దురాచారం ఇంకా పోలేదు. ఇది ఒక హోదాగా కుమారులు ఉన్న కుటుంబాలు భావిస్తున్నాయి. కుమారులు పుడితే సంతోష పడే.. కూతురు జన్మిస్తే బాధపడే కుటుంబాలు ఇంకా ఉన్నాయంటే దానికి కారణం వరకట్నమే. కట్నకానుకలు మాట్లాడిన తర్వాతనే పెళ్లికి సంబంధించిన పురోగతి ఉంటుంది. సర్కారు ఉద్యోగాలు చేసే అబ్బాయిలైతే వారి కుటుంబాల డిమాండ్‌కు అంతులేకుండా పోతోంది. అడిగినంత ఇవ్వకుంటే భవిష్యత్తులో ఆ కుటుంబాల్లో వివాదాలు తలెత్తుతున్నాయి. పంచాయితీలు.. పోలీసు ఠాణాల వరకు ఘటనలు వెళ్తున్నాయి.

జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన నవ్యను నాలుగేళ్ల క్రితం శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన బిగుల్ల సందీప్ కట్నకానుకలతోనే ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. అయినా అదనపు కట్నం కోసం మూడునెలల క్రితం నవ్యను సందీప్ ఇంటి నుంచి పంపించాడు. పంచాయితీలు నిర్వహించిన భర్త, అత్తింటివారి వేధింపులు ఆగకపోవటంతో నవ్య గత నెలలో బలవన్మరణానికి పాల్పడింది. దీంతో ఇద్దరు పిల్లలకు తల్లి లేకుండా పోయింది. నెల రోజుల వ్యవధిలోనే ఉమ్మడి జిల్లాలో అదనపు కట్నం వేధింపులతో నవ్యతో సహా నలుగురు బలయ్యారు.

**కఠినంగా శిక్షించాలి**

కట్నం తీసుకోకుండా ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి.
ఇది ఒక నేరమన్న విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి.
అదనపు కట్నం వేధింపులకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలి.
బాధితులకు సఖి కేంద్రాలు ఆశ్రయం కల్పించి ధైర్యం చెప్పాలి.

# ప్రైవేటులో 'ఫీజు'లుం



సిరిసిల్ల : "తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌కు చెందిన ఒక నేత కార్మికుడి కుమారుడిని సిరిసిల్ల పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. 9వ తరగతి ఐఐటీ ఫౌండేషన్‌కు రూ.80 వేలు, పుస్తకాలకు రూ.20 వేలు, పాఠశాల బస్సుకు రూ.25 వేలు కలిపి మొత్తంగా ఒక సంవత్సరానికి రూ.1.25 లక్షలు చెల్లించాలి."

"వేములవాడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి తమ కుమార్తెను ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీలో చేర్పించారు. అకాడమీ ఫీజు రూ.25 వేలు. పుస్తకాలకు రూ.5 వేలు. మొత్తంగా ఏడాదికి రూ.30 వేలు చెల్లించాలి."

జిల్లా విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకే పరిమితమైంది. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ, సొంతంగా పాఠ్యపుస్తకాల విక్రయాలు, బోధనా తీరుపై ఎలాంటి నియంత్రణ లేదు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అనుమతుల్లేకుండా సొంత సిలబస్‌తో కూడిన పాఠ్య, నోటు పుస్తకాలు విక్రయిస్తున్నాయి. దీనిలో బయట మార్కెట్లో లభించేవాటికి ధరల్లోనూ భారీ వ్యత్యాసం ఉంటుంది. జిల్లాలో ఇలా విక్రయించేవారికి పురపాలిక, కమర్షియల్‌టాక్స్ వారి అనుమతుల్లేవు. ఇవేకాదు ఈ ఏడాది బోధనా ఫీజులను ఇష్టారీతిన పెంచేశారు.

**విద్యాశాఖ ఉదాసీనత**

జిల్లాలో 120 ప్రైవేటు పాఠశాలు ఉన్నాయి. వీటిల్లో అనుమతిలేనివి మూడు. ఇంత భారీగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా మరుగుదొడ్లు లేవు. చాలాచోట్ల క్రీడా మైదానాల్లేవు. కొన్ని అగ్నిప్రమాదాల నివారణ నిబంధనలు పాటించడం లేదు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు ఆకాశాన్నంటుతున్నాయి. టెక్నో, ఐఐటీ ఫౌండేషన్ పేరుతో అదనపు పాఠ్యాంశాలు జోడిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వీటి నియంత్రణ లేకపోవడంతో రుసుములు పెంచుకుంటూ పోతున్నారు. తమ పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యతో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆశపడుతున్న వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి.

ఫౌండేషన్ కోర్సుల పేరుతో ప్రత్యేక సిలబస్‌ను అందిస్తున్నారు. దీని స్థానంలో స్టేట్ సిలబస్‌ను పాఠ్యాంశాల పీరియడ్స్ కుదిస్తున్నారు. దీంతో తెలుగు, హిందీ, ఆంగ్లంపై విద్యార్థులు పట్టుకోల్పోతున్నారు. స్టడీమెటీరియల్ పేరుతో గైడ్‌లను అందిస్తున్నారు. విద్యాశాఖ ఉదాసీనంగా వ్యహరిస్తోందనే విమర్శలున్నాయి.

'పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్న తొమ్మిది పాఠశాలలకు నోటీసులు జారీ చేశాం. అనుమతుల్లేని వాటికి నోటీసులిచ్చా'మని డీఈవో వినోద్ పేర్కొన్నారు.

# ఆనంద పరిమళాలే వ్యాపార సూత్రాలు

భద్రాచలం : వీరంతా రెక్కాడితేనే డొక్కాడే నిరుపేద ఆదివాసీ ఆడబిడ్డలు. పరిస్థితి ఇంతటి దయనీయంగా ఉన్నప్పటికీ చెక్కు చెదరని విశ్వాసంతో పది మంది మహిళలు దమ్మక్క స్వయం సహాయక సంఘంగా ఏర్పడి సొంతంగా వ్యాపారం చేయాలనుకున్నారు. సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమల పథకం ద్వారా భద్రాచలం ఐటీడీఏ అందించిన రూ.25 లక్షల ఆర్థిక సాయంతో సబ్బులు-షాంపూల తయారీకి శ్రీకారం చుట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.50 లక్షల లావాదేవీలు సాగించి పారిశ్రామిక రంగంలో రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పరిశీలించి మెచ్చుకున్నారు. **గిరిజన బ్రాండ్లకు ఆదరణ**దమ్మక్క స్వయం సహాయక సంఘంలో తాటి రాజసులోచన, పిట్టల బేబీరాణి, పూనెం విజయలక్ష్మి, జగ్గ కుమారి, ఇర్పా సాయికుమారి, ఎం.కృష్ణవేణి, వి.రాజమ్మ, బి.రమాదేవి, కె.మంగ, కె.భారతి సభ్యులుగా కొనసాగుతున్నారు. సబ్బుల తయారీపై ఐటీడీఏ ఆధ్వర్యంలో వీరికి నిపుణులు శిక్షణ ఇచ్చారు. భద్రాచలంలోని జీసీసీ ప్రాంగణంలో 2019లో యూనిట్‌ను మహిళలు నెలకొల్పారు. జీసీసీకి చెందిన గిరి బ్రాండ్‌తో సబ్బులు, షాంపూలను తయారుచేయటం ఆరంభించారు. వీటిని అదే జీసీసీ ద్వారా గిరిజన విద్యాలయాలకు చేరవేస్తున్నారు. ఈ వ్యాపారంలో పట్టు పెంచుకునే సమయంలో కొవిడ్ మహమ్మారి విజృంభించింది. అయినప్పటికీ ఇందులోనే రాణించాలని గట్టిగా నిశ్చయించుకున్నారు. అప్పటి నుంచి విద్యాలయాలకే కాకుండా బహిరంగ మార్కెట్‌లో ఉత్పత్తులను ప్రవేశపెట్టి డిమాండ్‌కు అనుగుణంగా పంపిణీ చేశారు. జీసీసీకి యథాతథంగా గిరి బ్రాండ్లను అందించారు. అదే క్రమంలో సొంతంగా 'ట్రైబల్ బ్లిస్' అనే కొత్త బ్రాండ్ కనిపెట్టి నూతన ఫార్ములాతో సబ్బులు, షాంపూలను సిద్ధం చేసి అనుమతులు సాధించారు. ఏప్రిల్ 7న శ్రీరామ పట్టాభిషేకానికి భద్రాచలం గిరిజన మ్యూజియానికి వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా నూతన ఉత్పత్తులను వినియోగదారులకు పరిచయం చేశారు. ఈ బ్రాండ్లకు ఆదరణ బాగుంది.

# మూణ్నెళ్లకు సరిపడా..

కరీంనగర్ : సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ముగిసింది. కార్డుదారులు మూడు నెలల కోటాను రేషన్ దుకాణాల్లో తీసుకున్నారు. జూన్ నెల ప్రారంభం నుంచి నిత్యం నాలుగు జిల్లాల్లోని చౌకధరల దుకాణాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో సందడి కనిపించింది. ప్రభుత్వం ఒకేసారి జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్నబియ్యాన్ని అందించడంతో లబ్ధిదారులు వరుస కట్టారు. బారులుగా నిలబడి బియ్యం ఇళ్లకు పట్టుకెళ్లారు. పౌరసరఫరాల శాఖ అధికారులు



ముందు నుంచి పంపిణీపై ప్రచారాన్ని చేపట్టడంతో ఈ నెలలో రికార్డు స్థాయిలో కార్డుదారులు ఆసక్తిని కనబర్చారు. ప్రతి నెలలో 80-85 శాతం మాత్రమే తీసుకునేవారు. కానీ ఈ ఒక్క జూన్ నెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 92.41శాతం మంది బియ్యం తీసుకున్నారు.

**బస్తాలకొద్దీ!** వర్షాకాలం కావడంతో వరదలు, అత్యవసర పరిస్థితులు ఏర్పడుతాయని కేంద్రం మూడు నెలల కోటా జూన్‌లోనే సరఫరా చేయాలని సూచించింది. ఈ క్రమంలో ఒక్కో లబ్ధిదారులకు 18కిలోల బియ్యం అందించారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,47,20,557 కిలోల బియ్యాన్ని ఇచ్చారు. ఇంకా కొన్ని దుకాణాల్లో నిల్వలుండగా పంపిణీని నిలిపి వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మూడు నెలలకు సంబంధించి పంపిణీలో భాగంగా లబ్ధిదారులు పలుమార్లు వేలిముద్ర వేయాల్సి రావడం, సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే అధికారులు ఈ-పోస్ యంత్రాల్లో నూతన సాఫ్ట్‌వేర్ వేసి ఆ ఇబ్బందులు తప్పించారు.

**ప్రత్యేకత ఇలా...!**

ఉమ్మడి జిల్లాలో 10,10,532 మంది కార్డుదారులకుగానూ జూన్ నెలలో 9,33,9266 మంది బియ్యం తీసుకున్నారు.

ఇంకా 76,606 మంది స్థానికంగా రేషన్ పొందలేదు. పెద్దపల్లిలో ఈ సంఖ్య అధికంగా ఉంది.

ఇతర జిల్లాల్లో ఉన్నవారు కొందరు అక్కడ పోర్టబులిటీ విధానంలో బియ్యం పొందారు.

మన జిల్లాల్లోనూ ఇతర జిల్లాల వారు కొంతమంది ఈ విధానంతో ఇక్కడ సరకును తీసుకున్నారు.

చివరి రోజైన 30వ తేదీన కూడా 9,629 మంది దుకాణాల వద్దకు వెళ్లి ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారు.

# ప్రణాళికాలోపం.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

ధర్మపురి : అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వంద రోజుల ప్రణాళికను రూపొందించింది. గత నెల 2న ప్రారంభమైన ఈ కార్యక్రమం సెప్టెంబరు 9 వరకు కొనసాగనుంది. మొత్తం 50 అంశాలు ప్రణాళికలో పొందుపరిచారు. ప్రతీ వార్డులో రోజుకో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ధర్మపురి పట్టణంలోని 15 వార్డుల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించాల్సి ఉండగా తక్కువ వార్డుల్లోనే పుర అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు.

**సమస్యలు ఇలా..**పట్టణంలోని అన్ని వార్డులకు సరిపడా స్వచ్ఛ వాహనాలు కరవయ్యాయి. ఏడు మాత్రమే ఉన్నాయి. దీనికితోడు ఇవన్నీ చాలా చోట్ల లీకేజీలు, మరమ్మతులు కరవై అధ్వాన స్థితికి చేరాయి. సరిగ్గా మరమ్మతులు లేని కారణంగా వాహనంలోని చెత్తాచెదారం కిందపడుతోందని స్థానికులు వాపోతున్నారు.

కమలాపూర్ రహదారి పక్కనే చెత్త పడేస్తున్నా వాటిని తొలగించడం లేదు. గోదావరి నదిలో మురుగునీరు కలిసేచోట కనీసం బోర్డులను ఏర్పాటు చేయడం లేదు.

నదీ తీరంలో మొక్కల పెంపకానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సి ఉన్నా ఆ దిశగా ఆలోచించడం లేదు. నదిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగానే ఉంటోంది.

ధర్మపురికి డంపింగ్‌యార్డే లేదు. సేకరించిన చెత్తను శ్మశానవాటిక పక్కనే వాహనాల్లో తీసుకొచ్చి కుప్పలుగా పడేస్తున్నారు.

పట్టణమంతా ఒక ప్రణాళిక ప్రకారం మొక్కలు నాటాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గతంలో ప్రధాన రహదారి పక్కన నాటిన భారీ వృక్షాలను తొలగించారు. ఆ తర్వాత నూతన మొక్కల అభివృద్ధికి చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వానలు పడుతున్న తరుణంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**'స్వచ్ఛత చర్యలు తీసుకుంటున్నాం**

ఈ విషయమై పుర శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ ధర్మపురిలో స్వచ్ఛత పరిశుభ్రత కోసం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# తాలిపేరు ప్రాజెక్టుకు జలకళ చర్ల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండటంతో జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌తో పాటు, తెలంగాణలో కురుస్తున్న తేలికపాటి వర్షాలకు జలాశయానికి వరద నీరు వచ్చి చేరింది. ఇప్పటికే ప్రాజెక్టు నిర్వహణ పనులను అధికారులు పూర్తి చేశారు. నిర్వహణ పనుల్లో భాగంగా ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లను పూర్తిగా తెరిచి ఉంచారు. దీంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షంతో వరద



నీరు జలాశయానికి భారీగా వస్తోంది. ప్రాజెక్ట్ స్పిల్‌వే నుంచి వరద నీరు జాలువారుతూ దిగువ గోదావరికి పరుగులు తీస్తోంది. మొన్నటి వరకు నీళ్లు లేక వెలవెలబోయిన జలాశయం వరద నీటితో కళకళ లాడుతోంది. త్వరలో ప్రాజెక్ట్ గేట్లను దించివేస్తామని ఏఈఈ సంపత్ తెలిపారు.

చురకలు



# కలుషిత ఆహారం.. సలహాలు ఉచితం

భగత్‌నగర్: నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన భాస్కర్, శ్రీను అల్పాహారం తినడానికి బస్టాండ్ సమీపంలోని ఓ ప్రముఖ హొటల్‌కు వెళ్లారు. వెయిటర్ పూరీ తెచ్చి టేబుల్‌పై పెట్టగానే తినేందుకు సిద్ధమయ్యారు. కూరలో ఈగ కనబడటంతో సిబ్బందికి చెప్పారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో నగరంలోని ఆహారభద్రత బృందం అధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆమె 'పత్రికల్లో వార్త వస్తే చర్య తీసుకుంటామటూ ఉచిత సలహా ఇచ్చారు. కంగుతిన్న బాధితులు నగరపాలిక కార్యాలయానికి వెళ్లగా ఉదయం 11.30 గంటలకూ అధికారులు, సిబ్బంది కనపడకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

**తనిఖీలు రెండు నెలల ముచ్చటే!**

కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలతో దాదాపు మూడు నెలల కిందట నగరంలో ఆహారభద్రత బృందం ఏర్పాటైంది. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, తూనికలు కొలతల శాఖ అధికారి, మెప్మా పీడీ, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య పర్యవేక్షకుడు ఇందులో సభ్యులు. ఈ బృందం రెండు నెలల పాటు వారంలో మూడు రోజులు ఆహార తయారీ కేంద్రాలు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, హొటళ్లు, రెస్టారెంట్లతో పాటు తూనికల యంత్రాలు



విక్రయించే దుకాణాలను తనిఖీ చేసింది. ఆహార భద్రత, పరిసరాల పరిశుభ్రతపై నిర్వాహకులకు అవగాహన కల్పించింది. నెల రోజులుగా తనిఖీలు నిలిచిపోయాయి. మరోవైపు 'ఆహారంలో ఈగ వచ్చింద'ని బృందం సభ్యులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. పైగా ఉచిత సలహా ఇస్తుండటం తనిఖీలు నిజంగా చేశారా? లేక ఆటవిడుపుగా నిర్వహించారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

**అడ్డగోలు వసూళ్లు**

అల్పాహారం తినడానికి వెళ్లిన వినియోగదారుల నుంచి హొటల్ యాజమాన్యం పన్నుల పేరిట అధికంగా వసూలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండు ప్లేట్ల పూరీకి రూ.90 చొప్పున, ప్లేట్ ఉప్మాకు రూ.70 వసూలు చేశారు. దీనికితోడు సీజీఎస్‌టీ 2.5 శాతం కింద రూ.6.25, ఎస్‌జీఎస్‌టీ కింద 2.5 శాతం కింద రూ.6.25 కలిపి మొత్తంగా రూ.12.50 తీసుకున్నారు. సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీల పేరిట భారం మోపడంతో పాటు రౌండ్ ఆఫ్ పేరిట అదనంగా అర్ధ రూపాయి తీసుకోవడం కొసమెరుపు.

# నిరుద్యోగ యువత ఉన్నతికి శ్రీకారం

చొప్పదండి: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురుకుల కళాశాలల్లో చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులను ఇందుకోసం ఎంచుకొని ప్రత్యేక కార్యాచరణ మొదలుపెట్టింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ గురుకుల కళాశాలల్లో విద్యనభ్యసించిన వారికి ఉపాధి కల్పించేలా ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణను ప్రత్యేకంగా అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. నిరుద్యోగ యువత వారి జీవితాలను తీర్చిదిద్దుకొని స్థిరపడడానికి ఇదో సదవకాశం.

**శరవేగంగా కార్యక్రమానికి ఏర్పాట్లు**

జూన్ రెండో వారం చివర్లో శిక్షణ ప్రారంభించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పూర్వ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. అయినా ఇప్పటికీ ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయిలో దరఖాస్తులు వచ్చిన తర్వాత శిక్షణకు సంబంధించిన పూర్తి కార్యాచరణను ప్రకటించనున్నారు.

**ఉచిత భోజన, వసతి సౌకర్యాలు**

ఉమ్మడి జిల్లాలోని ఒక డిగ్రీ, 25 గురుకుల ఇంటర్ కళాశాలల్లో చదివి 18 నుంచి 25 ఏళ్లలోపు ఉన్నవారికి ఈ శిక్షణ అందించనున్నారు. దీని కోసం ఆయా గురుకుల కళాశాలల పూర్వ విద్యార్థుల వివరాల సేకరణ ప్రారంభమైంది. వీరు ప్రస్తుతం



ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారు.. తదితర సమాచారం సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సుమారు 10 వేల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నట్లు గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. శాస్త్ర, సాంకేతిక, డిజిటల్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించే బాధ్యత ఉన్నతి ఫౌండేషన్ తీసుకుంటుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

నిరుద్యోగులుగా ఉన్న గురుకుల కళాశాలల పూర్వ విద్యార్థులను వివిధ రంగాల్లో నిపుణులుగా తీర్చిదిద్ది ఉద్యోగాలు కల్పించడంతోపాటు ఆర్థికంగా స్థిరపరచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆసక్తి కలిగిన పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న కళాశాలలను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలి. ఉన్నతి ఫౌండేషన్ సౌజన్యంతో ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

శ్రీకాళహస్తి, ప్రధానాచార్యులు రుక్మాపూర్ గురుకుల కళాశాల

# హరితం.. నగరానికదే హితం



హైదరాబాద్ : కాంక్రీట్ కీకారణ్యంగా మారిన నగరంలో 'హీట్ ఐలాండ్స్' పుట్టుకొస్తున్నాయి. ఎత్తైన కాంక్రీట్ భవనాలు, బీటీ రోడ్లు, విపరీతంగా ఏసీ, రిఫ్రిజిరేటర్ల వాడకంతో ఆయా ప్రాంతాల్లో భూ ఉపరితలంపై 2-3 మీటర్ల ఎత్తులో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 'హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్' స్వచ్ఛంద సంస్థ చేసిన పరిశోధనలో పటాన్‌చెరు, బండ్లగూడ, గచ్చిబౌలి, మైలార్‌దేవ్‌పల్లి, బీఎన్‌రెడ్డినగర్, మన్సురాబాద్, హయత్‌నగర్ ప్రాంతాలు హీట్ ఐలాండ్లుగా మారినట్టు గుర్తించింది. ముమ్ముందు ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉత్పన్నమవుతాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే అంతటా మొక్కలు నాటడంతో పాటు వాటి పర్యవేక్షణ బాధ్యతను చేపట్టాలని సూచిస్తున్నారు.

**పచ్చదనం 28 శాతమే..** నిబంధనల ప్రకారం నగరంలో 33శాతం పచ్చదనం ఉండాలి. 28 శాతమే ఉందని ట్రీ ప్రొటెక్షన్ కమిటీ ప్రతినిధి ఫరీదా వెల్లడించారు. మొక్కల పెంపకంపై పౌరులకు అవగాహన లేకపోవడం, చుట్టుపక్కల చెట్లను నరికేస్తున్నా అడ్డుకోకపోవడం, మొక్కలు నాటినా పట్టించుకోకపోవడం, పార్కుల్లో నీటి వసతి లేకపోవడం ఇందుకు కారణాలని వెల్లడించారు. అనుమతి లేకుండా చెట్లు నరికివేస్తుంటే 1800-425-5364 నంబరులో ఫిర్యాదు చేయాలన్నారు.

**చెట్లతో బహుళ ప్రయోజనాలు..**

ఆక్సిజన్ ఉత్పత్తికి ప్రాథమిక వనరులు చెట్లు. కార్బన్‌డయాక్సైడ్, ఇతర కాలుష్య కారకాలను గ్రహించి వాయు నాణ్యత మెరుగుపరుస్తాయి. నేల కోతకు గురికాకుండా ఉండేందుకు, వరదల నివారణకు ఉపయోగపడతాయి.

పక్షులకు ఆవాసం కల్పించి జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తాయి. నీడనిచ్చి ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడతాయి.

పెద్ద పార్కులు, పట్టణ అడవులు వేసవిలో ఉష్ణోగ్రతలను 10 డిగ్రీల వరకు తగ్గించగలవు.

గ్రేటర్‌లో పచ్చదనం లెక్కలిలా..

2011లో 33.15 చ.కి.మీ

2021లో 81.81 చ.కి.మీ (పదేళ్లలో 147 శాతం వృద్ధి)

2023లో.. 80.20 చ.కి.మీ (రెండేళ్లలో 1.61 శాతం తగ్గుదల)

నర్సరీలు - 600

కాలనీ పార్కులు - 1032

పచ్చదనం కలిగిన కూడళ్లు, విభాగినిలు - 226

కేటాయింపులేనా.. గ్రేటర్ బడ్జెట్‌లో ఏటా రూ.350 కోట్ల మేర హరిత పద్దుకు కేటాయిస్తున్నారు. చివర్లోచూస్తే.. ఖర్చులు రూ.90 కోట్లకు మించట్లేదు.

**గ్రీన్ వారియర్స్ వీరు!**

మెట్రో.. ప్రయాణికులదీ ఘనత

నగరంలో రోజురోజుకు కాలుష్యం పెరుగుతోంది.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా రవాణా వినియోగం.. అందులోనూ కాలుష్య రహిత ప్రయాణాలతో కాలుష్యానికి అడ్డుకట్ట వేయవచ్చు. ఈ నేపథ్యంలోనే.. పూర్తిగా విద్యుత్తుతో నడిచే హైదరాబాద్ మెట్రోలో నిత్యం సగటున 4.40 లక్షల మంది ప్రయాణిస్తూ తమ వంతుగా పర్యావరణ హితానికి పాల్పడుతున్నారు. గ్రీన్ వారియర్స్‌గా నిలుస్తున్నారు. మెట్రో వ్యవస్థ సైతం బ్రేకుల ద్వారా విద్యుత్తు పునరుత్పత్తి, స్టేషన్లపై సౌర విద్యుత్తు, వాననీటి సంరక్షణ వంటి చర్యలతో గ్రీన్ మెట్రోగా నిలుస్తోంది.

హైదరాబాద్ మెట్రోరైలు మూడు కారిడార్లలో 69.2 కిలోమీటర్ల మేర అందుబాటులో ఉంది. 57 మెట్రోరైలు స్టేషన్లు ఉన్నాయి. తక్కువ విద్యుత్తు వినియోగించుకునేలా స్టేషన్లను డిజైన్ చేయడంతో వీటిని పరిశీలించి ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) సర్టిఫైడ్ చేసింది.

**32 స్టేషన్లపై సౌర పలకలు**

మెట్రోస్టేషన్లకు అవసరమయ్యే విద్యుత్తును సమకూర్చుకునేందుకు 32 స్టేషన్లపై సౌరపలకలు ఏర్పాటుచేశారు. మియాపూర్, ఉప్పల్ డిపోల్లో సోలార్ ప్లాంట్లతో 9.35 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. మెట్రో విద్యుత్తు వినియోగంలో సౌర విద్యుత్తు వాటా 12 శాతం. ఇప్పటివరకు 56,935 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసినట్లు ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో తెలిపింది.

**మిలియన్ లీటర్ల ఇంధనం ఆదా**

పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాల వినియోగంతో కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. విద్యుత్తుతో నడిచే మెట్రో రాకతో ఇప్పటివరకు 184 మిలియన్ లీటర్ల ఇంధనాన్ని ఆదా చేసి తద్వారా పర్యావరణానికి జరిగే నష్టానికి అడ్డుకట్ట వేసింది. 424 మిలియన్ కిలోల కార్బన్ డై యాక్సైడ్ ఉద్గారాలను నిలువరించగలిగింది.

వాననీటి సంరక్షణతో..

మెట్రో స్టేషన్లు, పరిసరాలు, డిపోల్లో కలిపి 150వరకు వాననీటి గుంతలను ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు 3.75 కిలోలీటర్ల నీటిని భూమిలోకి ఇంకేలా చేశారు. తద్వారా సుస్థిర నీటి నిర్వహణకు మద్దతుగా నిలిచారు.

# విత్తనంపై.. మోసగాళ్ల పెత్తనం



వికారాబాద్ : జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని చోట్ల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. నకిలీ విత్తన విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో జిల్లా వ్యవసాయ, పోలీసు శాఖలు సమన్వయంతో అప్రమత్తమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మండలాల్లో ఎరువుల, విత్తన దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైతు వేదికల ద్వారా వీటి కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్నదాతలను అప్రమత్తం చేస్తున్నారు.

**రంగంలోకి టాస్క్‌ఫోర్స్ బృందాలు**

నకిలీ విత్తనాలు మార్కెట్లోకి రాకుండా ఉండేందుకు టాస్క్‌ఫోర్సు బృందాలు రంగంలోకి దిగాయి. అన్ని మండలాల్లోనూ పోలీసుల సహకారంతో తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇదే క్రమంలో సాగు పరిస్థితులకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు ఉన్నాయా లేదా కృత్రిమ కొరతకు ఏదైనా అవకాశం ఉందా అన్న కోణంలోనూ నిశిత పరిశీలన చేపడుతున్నారు. ఎక్కువగా కర్ణాటక నుంచి కొడంగల్ మీదుగా జిల్లాలో విక్రయాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించి నిఘా ఉంచారు. కొడంగల్, పెద్దేముల్, యాలాల, తాండూరు ప్రాంతాల్లో కేసులు నమోదు చేశారు.

**పత్తిపైనే దృష్టి:** నల్లరేగడి నేలలు అధికంగా ఉండడంతో పత్తి సాగు విస్తీర్ణం పెరగనుంది. 2,58,563 ఎకరాల్లో సాగులోకి రానుంది. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు గ్రామాల్లో పర్యటించి అధిక దిగుబడి వస్తుందని చెబుతూ, ఆయా విత్తన కంపెనీల పేరు చెప్పి, రైతులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్యాకెట్లు కాకుండా విడిగా అమ్మితే కొనుగోలు చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. విత్తనాల కొరత లేదని భరోసా ఇస్తున్నారు.

**సరిహద్దు ప్రాంతాలపై నిఘా: నారాయణరెడ్డి, ఎస్పీ**

కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ, చింతామణి నుంచి నకిలీ పత్తి విత్తనాలు వస్తున్నట్లు సమాచారం ఉంది. దీంతో నిఘా మరింత ముమ్మరం చేశాం. ఇప్పటి వరకు నాలుగు కేసులు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేశాం. జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి కట్టడి చేస్తున్నాం.

**కొరత లేదు: మోహన్‌రెడ్డి, డీఏవో**

పత్తి విత్తనాల కొరత లేదు. రైతులకు అందుబాటులో ఉంచాం. తక్కువ ధరలకు ఇస్తామంటూ నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉంది. ఇ మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలి.

మండలాలు: 20

సాగు భూమి: 8,81,730 ఎకరాలు

రైతు వేదికలు: 99

రైతుల సంఖ్య: 3,23,650

వానాకాలం సాధారణ సాగు: 5,51,105 ఎకరాలు

సాగు అంచనా: 5,61,719 ఎకరాలు ప్రధాన పంటలు: 5

# ముస్తాబు చేసి.. మూసి ఉంచి..



తాండూరు : పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు నిర్మించేందుకు ఖరారు చేశారు. నిర్మాణాలు పూర్తై ఏళ్లు గడిచినా అందుబాటులోకి తీసుకురావడం లేదు. కొన్నింటిని ముస్తాబు చేసి తాళం వేయగా, మరికొన్నింటిని అసంపూర్తి పనులతో వదిలేశారు. రూ.1.50 కోట్లకుపైగా వెచ్చించినా ఉపయోగం లేకుండాపోయింది. తాండూరు మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూర్బన్ పథకాన్ని అమలు చేశాయి. పథకం నిధులతో తొమ్మిది గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించాయి. అల్లాపూర్, అంతారం, ఎల్మకన్నెలో భవనాలు నిర్మించారు. ఎల్మకన్నెలో నూతన భవనాన్ని ప్రారంభించి తాళం వేశారు. రెండేళ్లు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాలేదు. అల్లాపూర్, అంతారంలో మూడేళ్లుగా ప్రారంభోత్సవం చేయకుండా రంగులువేసి తాళం వేసి ఉంచారు. బెల్కటూరు, కరణ్‌కోట, జిన్‌గుర్తిలో భవనాలకు గచ్చు నిర్మాణం, తలుపులు, రంగులు వేయించాల్సి ఉండగా అసంపూర్తిగా మిగిల్చారు. రెండేళ్లుగా వాటి ఊసెత్తడం లేదు.**వినియోగంలోకి రాకపోవడంతో..:**

తొమ్మిది గ్రామాల్లో నిర్మాణాలకు రూ.93.60 లక్షలు కేటాయించారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.10.40 లక్షలు చొప్పున ఖర్చు చేశారు. భవనాలు నిర్మించినా అందుబాటులోకి తేనందున ఫలితం లేకుండాపోయింది. అసౌకర్యాల మధ్య వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సొంత భవనం వినియోగంలోకి రాకపోవడంతో ఎల్మకన్నె, అల్లాపూర్, అంతారంలో పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు గదిలో వైద్య సేవలు అందిస్తూ, ఇబ్బందులు పడుతున్నారు. బెల్కటూరు, సంగెంకలాన్, కరణ్‌కోటలో అద్దె గదుల్లో ఆరోగ్య ఉపకేంద్రాలను నెట్టుకొస్తున్నారు. వందలాది మంది అసౌకర్యానికి గురవుతున్నారు.**కొత్తగా నిర్మాణాలు:** రూర్బన్ పథకం కింద నిర్మించిన భవనాలు వినియోగంలోకి తీసుకురాకుండా వైద్య ఆరోగ్య శాఖ నిధులతో కొత్త భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రెండేళ్లుగా తాళం వేసి ఉంచిన భవనాల చెంతనే కొత్తవి నిర్మిస్తున్నారు. బెల్కటూరులోనూ భవనం పక్కనే మరోటి నిర్మించారు. రంగులు వేసి ప్రారంభించాల్సి ఉంది. అంతారంలో స్లాబ్ పనులు పూర్తయ్యాయి. పాతి వినియోగించకుండానే కొత్తవి నిర్మించడం విమర్శలకు తావిస్తోంది. నిధులు వ్యయం చేసినా, వైద్య సేవలకు సొంత భవనాలు సమకూర్చడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# సర్వేలతో సరి.. పరిహారమేదీ!

గంగాధర: కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే మార్గానికి సర్వే పూర్తయి ఏళ్లు గడిచినా పనులు ముందుకు సాగడం లేదు. భూసేకరణ ప్రక్రియ చేపట్టినా భూములు, ఇళ్లకు పరిహారం అందడం లేదు. 13 ఏళ్ల కిందట రైల్వే లైన్ నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కాగా అప్పట్లో పరిహారం ధర నిర్ణయించారు. ప్రస్తుతం ఇల్లు నిర్మించుకోవాలన్నా, మరో చోట వ్యవసాయ భూమి కొనాలన్నా పెరిగిన ధరలతో కొనలేకపోతామని బాధితులు ఆవేదన చెందుతున్నారు. గంగాధర మండలం గర్శకుర్తి, రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం గ్రామాల రైతులు రెండేళ్ల కిందట పరిహారం కోసం రిలే నిరహార దీక్షలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరవైంది.

**తొమ్మిది నెలల కిందట మరోసారి..**

2020లో బహిరంగ ప్రకటన చేసి రైల్వే లైన్‌లో కోల్పోతున్న వ్యవసాయ భూములు, పైపులైన్లు, ఇళ్లు, బావుల వివరాలను అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పరిహారం కోసం తిరిగి 2024 సెప్టెంబరులో భూ సేకరణ కోసం ప్రకటన విడుదల చేశారు. ఆర్డీవో మహేశ్వర్ భూ సేకరణ, రైల్వే అధికారులతో కలిసి పలుమార్లు గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించారు. కొండన్నపల్లి, బోయినపల్లి, ఇతర ప్రాంతాల వారికి పరిహారం రాగా



రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం గ్రామాల ప్రజలకు ఎదురుచూపులే మిగిలాయి. ఇటు పరిహారం అందక, అటు ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం భూములు అమ్మే వీలు లేక పలువురు రైతులు అప్పుల పాలవుతున్నారు.

**13 ఏళ్ల కిందటే భూ సేకరణ**

రైల్వే లైన్ నిర్మాణానికి 2012లో భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. నాలుగేళ్ల కిందట వ్యవసాయ భూములు, బావులు, పైపులైన్లు, ఇళ్లపై సర్వే చేసిన అధికారులు ఏడాది కిందట అవార్డు పూర్తి చేశారు. అప్పట్లోనే నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ కావాల్సి ఉండగా ఇప్పటికీ కాలేదు. రైల్వే మార్గం 70-80 మీటర్ల వెడల్పు ఉండగా స్టేషన్ ఉన్న చోట 150-180 మీటర్ల వరకు ఉంటుంది. గంగాధర మండలం కురిక్యాల, కొండన్నపల్లి, ఉప్పరమల్యాల, రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం, గర్శకుర్తి, రామడుగు మండలం వెదిర, దేశరాజ్‌పల్లి, కొత్తపల్లి శివార్లలోని 219.06 ఎకరాలతో పాటు బోయినపల్లి మండలం బూర్గుపల్లి, కోరెం, బోయినపల్లి, తడగొండ, స్తంభంపల్లి గ్రామాల్లో వ్యవసాయ భూములు సేకరించారు. రంగారావుపల్లిలో 36 నివాసాలు, ప్రభుత్వ పాఠశాల, రక్షిత తాగునీటి బావి కోల్పోతుండగా పరిహారం చెల్లింపుతో పాటు రైల్వేలైన్ పనులు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికే మనోహరాబాద్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా, కరీంనగర్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో నిర్వాసితులకు పరిహారం చెల్లించిన ప్రభుత్వం తమకు మాత్రం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులు లేక మూతబడి

పెద్దపల్లి : పెద్దపల్లి మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల ఆరేళ్లుగా తెరచుకోవడంలేదు. దీంతో స్థానిక విద్యార్థులు 2 కి.మీల దూరంలోని తుర్కలమద్దికుంటకు వెళుతున్నారు.

మంథని మండలం లక్కేపూర్ ప్రాథమిక పాఠశాలలో 22 మంది పిల్లలుండగా ఏటికేడు తగ్గడంతో ఏడేళ్ల క్రితం మూసేశారు. ఇద్దరు ఉపాధ్యాయులుండగా ఒకరు బదిలీ కాగా మరొకరిని సర్దుబాటు చేశారు. పాలకుర్తి మండలం బామ్లానాయక్‌తండా ప్రాథమిక పాఠశాలది ఇదే పరిస్థితి. 5 కి.మీ దూరంలోని కన్నాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారు. ఈ భవనాన్ని గ్రామ పంచాయతీగా వినియోగిస్తున్నారు. ఇదివరకు పిల్లలతో కళకళలాడిన పాఠశాలలు నేడు మూతపడిపో యాయి. వీటిని తెరిపించడంలో విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో విద్యా సంవత్సరం ఆరంభం కానుంది. ప్రజల సహకారంతో బడులను తెరిపించాల్సిన అవసర ముంది.



**పర్యవేక్షణ లోపం**

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిపుణులైన ఉపాధ్యాయులు, ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అమలు చేసినప్పటికి తల్లిదండ్రులను ఆకర్షించడంలేదు. ఒకరిని చూసి మరొకరు ప్రైవేటుకు పంపించడంతో ఏటికేడు పాఠశాలలు మూతపడుతున్నాయి. సకల వసతులు ఉన్నప్పటికి చాలాచోట్ల ఉపాధ్యాయులు భారంగా భావిస్తున్నారే తప్ప బాధ్యత మరచిపోతున్నారనే విమర్శలున్నాయి.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**

కాల్వశ్రీరాంపూర్ మండలం లక్ష్మీపూర్ పంచాయతీ పరిధిలో రాయపేట ప్రాథమిక పాఠశాల ఐదేళ్ల నుంచి తెరచుకోవడంలేదు. ఇక్కడి నుంచి కిలోమీటరున్నర దూరంలోని పందిళ్లకు వెళుతున్నారు.

ఓదెల మండలం కేశవపూర్ ప్రాథమిక పాఠశాల పదేళ్ల కిందట మూతపడింది. తల్లిదండ్రులు తమ పిల్లలను సుల్తానాబాద్‌లోని ప్రైవేటు పాఠశాలకు పంపిస్తున్నారు.

కమాన్‌పూర్ మండలం రేపల్లివాడ ప్రాథమిక పాఠశాలలో మూడేళ్ల క్రితం ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో మరెవరిని నియమించలేదు. దీంతో పాఠశాలను మూసేశారు.

సుల్తానాబాద్‌లోని పది పాఠశాలలు.. రామగిరి మండలం గోకుల్‌నగర్, లంబాడితండా, పెద్దంపేటలోనూ ఇదే పరిస్థితి.

ఇలా చేస్తే పూర్వవైభవంజిల్లాలో ఇప్పటివరకు మొత్తం 29 పాఠశాలలు మూతపడ్డాయి. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించాలి. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలి. ఏకోపాధ్యాయులు ఉన్నచోట ప్రత్యామ్నాయంగా మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలి.

**తెరిచేలా చూస్తున్నాం**బడిబాటలో మూతపడిన వాటిని తెరిచేలా ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులను కలిసి పాఠశాలకు పంపించేలా నమ్మకం కలిగిస్తున్నారు. తల్లిదండ్రులు సైతం ఆలోచించాలి. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని వారికి వివరిస్తున్నాం.మాధవి, జిల్లా విద్యాధికారి

# వీరు గిరిగీసుకుని.. వారు తవ్వేసుకుని

బనగానపల్లి : బనగానపల్లి సమీపంలో 4 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న రవ్వలకొండ అక్రమార్కులకు వరంగా మారింది. కొందరు మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాలు ఇలానే కొనసాగితే కొన్నేళ్లకు రవ్వలకొండ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. రవ్వలకొండలో పోతులూరి బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇంతటి చరిత్ర ఉన్న కొండను పట్టపగలే తవ్వి మట్టిని తరలిస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు వందలాది వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారు.

**అంతా నామమాత్రమే**

రవ్వలకొండ విషయంలో అటవీ, రెవెన్యూ, గనులు, పంచాయతీ అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఎవరికివారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నెలలో ఒకటి రెండుసార్లు పోలీసులు వాహనాలను పట్టుకొని జరిమానా వేసి వదిలేస్తున్నారు. ప్రతిరోజూ 50 టిప్పర్లు, 50 ట్రాక్టర్లలో మట్టి తరలిపోతోంది. వాహనాల యజమానులు టిప్పరుకు రూ.3 వేలకు పైగా, ట్రాక్టరుకు రూ.1,000 వరకు వసూలు చేస్తున్నారు. దూరాన్ని బట్టి ధర పెంచుతున్నారు. ఈ లెక్కన పరిశీలిస్తే ప్రతిరోజు రూ.2 లక్షలకుపైగా విలువైన మట్టిని



అక్రమార్కులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**విలువైన భూములపై కన్ను**

రవ్వలకొండలో మట్టి తవ్వకాలు అటుంచితే భూ ఆక్రమణలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఇక్కడ 20 ఏళ్ల కిందట ఇందిరమ్మ ఇళ్లు నిర్మించారు. సమీపంలో మిగిలిన భూములపై అక్రమార్కులు కన్నేశారు. ఈ ప్రాంతంలో ఇటీవల రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇది రవ్వలకొండ ప్రాంతం మీదుగా వెళుతుంది. ఈ నేపథ్యంలో కొందరు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పక్కనే ఎస్సార్బీసీ కాలువ ఉంది. కాలువకు ఇరువైపులా మిగులు భూములు ఉన్నాయి. వీటిని కొందరు ఆక్రమించుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే కొందరు ఇళ్ల నిర్మాణాలు సైతం చేపట్టడం గమనార్హం.

**అటవీ పరిధిలో ఉంటే చర్యలు**–రామకృష్ణ, రేంజ్ అటవీ అధికారి

అటవీ పరిధిలో అక్రమ తవ్వకాలు ఉంటే చర్యలు చేపడతాం. రవ్వలకొండలో కొంత భాగం రెవెన్యూ, మరికొంత భాగం గనుల శాఖ పరిధిలో ఉంది. అక్రమ తవ్వకాలు చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని మరింత అప్రమత్తం చేస్తాం.

# ప్రభుత్వం వరమిచ్చినా.. కరుణించని నేతలు!



నర్సీపట్నం : వృథాగా పోతున్న నీటికి అడ్డుకట్ట వేస్తేనే సాగు భూములకు సంజీవిని అవుతుంది. వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఆనకట్టల గేట్ల పునరుద్ధరణ, గండ్ల పూడ్చివేతకు కూటమి ప్రభుత్వం నిధులిచ్చి నెల రోజులు అవుతున్నా.. పనులు చేపట్టేందుకు సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా వందల క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులు చెబుతున్నా.. పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఆగస్టు నుంచి వరి నాట్లు ముమ్మరమవుతాయి. ఈలోగా మరమ్మతులు పూర్తి చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

రావణాపల్లి జలాశయం కింద నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లో 2,600 ఎకరాల ఆయకట్టు ఉంది. గబ్బాడ ఆనకట్ట గేట్లు పాడై ఐదేళ్లు కావస్తోంది. జలాశయ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పుడు అదనపు నీరు పొర్లుకట్ల మీదుగా ఈ ఆనకట్టకు చేరుతుంది. ఇక్కడి నుంచి కాలువలకు మళ్లించాలి. గేట్లు సరిగా లేక క్యూసెక్కుల కొద్దీ నీరు ఏటిపాలవుతోంది. ఈ గేట్ల మరమ్మతుకు రూ. 4 లక్షలు మంజూరయ్యాయి. గొలుగొండ మండలం కొత్తూరు కాలువకు పలుచోట్ల గతంలో గండ్లు పడ్డాయి. నీరు పొలాలను ముంచెత్తుతోంది. గట్లను బలోపేతం చేసేందుకు రూ.9.81 లక్షలు కేటాయించారు.

మాకవరపాలెం మండలంలో కోడూరు ఆనకట్ట, మల్లవరం ఆనకట్ట, గొలుగొండ మండలంలో ముంగర్లపాలెం ఆనకట్ట గేట్లు పాడయ్యాయి. వీటిని పునరుద్ధరించేందుకు రూ.3 లక్షలు చొప్పున మంజూరు చేశారు.

అంతా మీ చేతుల్లోనే..: కూటమి ప్రభుత్వం సాగునీటి వినియోగదారుల సంఘాలను పునరుద్ధరించి ఎన్నికలు నిర్వహించింది. ఈ సంఘాలన్నింటికీ ఇప్పుడు అధ్యక్షులు ఉన్నారు. కాలువల మరమ్మతు, అభివృద్ధిలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి దాదాపు రూ.2 కోట్ల వరకు ప్రభుత్వం కేటాయించింది. ఆనకట్టల షట్టర్ల పునరుద్ధరణ, గతంలో గండ్లు పడిన కాలువల గట్లను బలోపేతం చేయాల్సి ఉంది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనులన్నీ మొదలయ్యేలా ఎమ్మెల్యేలు దృష్టిసారించాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

**నియోజకవర్గాల వారీగా కేటాయింపు ఇలా..**

నర్సీపట్నం నియోజకవర్గంలో తాండవ జలాశయ కాలువల్లో 21 చోట్ల మరమ్మతులకు రూ. 1.71 కోట్లు, చిన్నతరహా నీటి వనరుల కింద ఏడు చోట్ల పనులు చేసేందుకు రూ. 29.81 లక్షలు.

పాయకరావుపేట నియోజకవర్గంలోని కోటవురట్ల మండలంలో తాండవ కాలువల కింద 21 చోట్ల మరమ్మతు చేపట్టేందుకు రూ. 1.66 కోట్లు, చిన్నతరహా నీటి వనరుల కింద 15 చోట్ల పనులు చేపట్టేందుకు రూ. 35 లక్షలు.

ఎలమంచిలి నియోజకవర్గంలో చిన్నతరహా నీటివనరుల కింద 12 చోట్ల పనులు చేపట్టేందుకు రూ. 99.7 లక్షలు.

తాండవ ఆయకట్టు పరిధిలోని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో నాలుగుచోట్ల పనులు చేపట్టేందుకు రూ. 22 లక్షలు మంజూరయ్యాయి.

బాధ్యతలు గుర్తించాలిపంటలకు సాగునీరు సజావుగా చేరేలా పనులు చేసేందుకు ప్రభుత్వం నిధులిచ్చింది. గండ్లు పూడ్చడం, గేట్ల మరమ్మతు తదితర పనులు చేపట్టాల్సిన బాధ్యతలను సాగునీటి వినియోగదారుల సంఘాలకు అప్పగించింది. నిధుల కేటాయింపు పూర్తవడంతో తక్షణమే పనులు చేపట్టాలని అందరికీ విజ్ఞప్తి చేశాం. ఎలమంచిలి నియోజకవర్గంలో నాలుగుచోట్ల పనులు చేపట్టారు. మిగతాచోట్లా ముందుకు రావాలి.

వి.బాలసూర్యం, జలవనరుల శాఖ ఈఈ, నర్సీపట్నం

# కూరగాయలు దరిచేరవా..?

పుత్తూరు : ఉద్యోగ, ఉపాధి కోసం పిల్లల చదువుల నిమిత్తం పట్టణాలకు వచ్చి నివసిస్తున్న, స్థిరపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా సరిపడా రైతుబజార్లు అందుబాటులో లేవు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, పలమనేరు, గూడూరులో తప్ప మరెక్కడా ఇవి లేవు. గత ప్రభుత్వ హయాంలో పుత్తూరు, నగరి, పలమనేరు, తిరుచానూరు, చంద్రగిరిలో వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పలమనేరులో పూర్తిచేసి ప్రారంభించారు. తిరుచానూరులో నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించ లేదు. ప్రస్తుతం వాటి ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. చంద్రగిరిలో పునాదుల దశలోనే వదిలేశారు. పుత్తూరులో స్థల పరిశీలన చేశారు. నగరిలో స్థలం కూడా చూపలేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

**ప్రజలకు ఒనగూరే మేలు..**

మార్కెటింగ్ శాఖ నిధులతో నిర్మించే ఈ రైతుబజార్లలో నామమాత్రపు అద్దెలకు రైతులు, స్వయం సహాయక సంఘాలకు దుకాణాలు కేటాయిస్తారు. వీటి నిర్వహణకు ఎస్టేట్ ఆఫీసర్, ఒక అటెండర్ ఉంటారు. జేసీ, డీఎస్వో, మార్కెటింగ్, ఉద్యానశాఖల అధికారులతో కమిటీ ఉంటుంది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే కిలోకి రూ.5 నుంచి రూ.10 తక్కువ ధరకు ఇక్కడ కూరగాయలు లభ్యమవుతాయి.



టమాటా, ఉల్లిపాయలు తదితరాల ధరలు పెరిగినపుడు రాయితీపై ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించే వెసులుబాటు ఉంటుంది.

**నిధుల కొరతతోనే..**

ప్రభుత్వం మార్కెట్ యార్డుల నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. అయితే సీఎంఎఫ్ ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో మంజూరు అయినా నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఈ నేపథ్యంలో వీటి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తేనే ఆయా ప్రాంతాల్లో రైతుబజార్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

ఉమ్మడి జిల్లాలో నగరపాలక సంస్థలు: 2

పురపాలికలు: 10

ప్రస్తుతం ఉన్న రైతుబజార్లు: 4

నిత్యం వినియోగదారులు: 2 వేలకు పైచిలుకు

అవసరమైన ప్రదేశాలు: శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కుప్పం, పుంగనూరు, పుత్తూరు, నగరి

# చేరువలో చిరకాల స్వప్నం



అనకాపల్లి : రైతుల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. జిల్లాలో పోలవరం ఎడమ కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో నత్తనడకన సాగిన పనులు కూటమి ప్రభుత్వం రాకతో జోరందుకున్నాయి. సర్కారు కాలువ నిర్మాణానికి నిధులు పుష్కలంగా మంజూరు చేయడంతోపాటు బిల్లులు కూడా సకాలంలో విడుదల చేస్తోంది. ఈ ఏడాది చివరిలోగా అనకాపల్లి జిల్లా వాసులకు నీరందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో అందుకు అనుగుణంగా గుత్తేదారులు జిల్లా పరిధిలో కొండల తవ్వకం సహా.. చాలాకాలంగా పెండింగ్ ఉన్న పనులు చకచకా పూర్తి చేస్తున్నారు.

రూ. 417 కోట్లతో నిర్మాణాలు: జిల్లాలో పాయకరావుపేట నుంచి కశింకోట మండలం తాళ్లపాలెం వరకు పోలవరం కాలువ ప్రవహిస్తుంది. మొత్తం 55 కి.మీ పొడవున రూ. 417 కోట్లతో నిర్మాణాలు చేస్తున్నారు. ఆరో ప్యాకేజీలో భాగంగా పాయకరావుపేట నుంచి ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడి వరకు 25 కి.మీ. పొడవున పనులు చేపట్టేందుకు రూ. 317 కోట్లు కేటాయించారు. అక్కడి నుంచి తాళ్లపాలెం వరకు పనులు చేసేందుకు రూ.100 కోట్లు కేటాయించారు.

**జోరుగా అనుసంధాన పనులు..**

తుని, పాయకరావుపేట మధ్య తాండవ నదిపై ఆక్విడక్టు నిర్మిస్తున్నారు. ఇప్పటికే నదిపై నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీనిని జిల్లాలోని కాలువకు అనుసంధానించేందుకు ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. దీనికోసం పాయకరావుపేట నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మిగతా ఆక్విడక్ట పనులు చేపడుతున్నారు. పాయకరావుపేటలో దుర్గానగర్, రెల్లికాలనీ కొండ ప్రాంతంలో కాలువ తవ్వకానికి బ్లాస్టింగు చేస్తున్నారు. ఇరువైపులా కాంక్రీట్ గోడ నిర్మిస్తున్నారు. నక్కపల్లి మండలంలోని గొడిచెర్ల, సీతంపాలెం, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, అసంపూర్తిగా వదిలేసిన వంతెనల నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు.

ఇదివరకు తీసిన కాలువలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతోపాటు జారిపడిన మట్టి పేరుకుపోయింది. వీటిని తొలగిస్తున్నారు. తాండవ, వరాహ నదులతోపాటు పోలవరం ఎడమ కాలువ పరిధిలోని పంట కాలువల్లోకి గోదావరి జలాలు పంపించేందుకు అవసరమైన నిర్మాణాలు చేపడుతున్నారు.

ఆగస్టు నాటికి జిల్లాకు జలాలు: పోలవరం ఎడమ కాలువ పనులను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. ఆగస్టు నాటికి గోదావరి నీటిని జిల్లా ప్రజలకు అందించాలన్నది లక్ష్యం. దీనికోసం పనులు శరవేగంగా జరిపిస్తున్నాం. వర్షాలు కారణంగా పనుల్లో స్వల్ప జాప్యం జరుగుతోంది. కాలువ ఆధునికీకరణ సహా మిగతా పనులన్నీ జరుగుతున్నాయి.

రామకోటేశ్వరరావు, ఈఈ

# ఉపాధి.. సంతృప్తి

కర్నూలు : నలుగురు మహిళా సభ్యులను ఒక యూనిట్‌గా ఏర్పాటుచేసి తృప్తి క్యాంటీన్లు అప్పగిస్తారు. దీనిని నడిపేందుకుగాను 20 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో కంటెయినర్‌ను ప్రభుత్వం సమకూరుస్తుంది. వంట, నిర్వహణ అంశాలపై శిక్షణ ఇస్తుంది. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ ఎలక్ట్రిక్ పరికరాలు అందిస్తారు. సౌరశక్తిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం విపణిలో ఆహార పదార్థాలకు మంచి డిమాండు ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజూ రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు ఉపాధి చూపేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో 'తృప్తి' క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఏపీ మెప్మా, ఓ సంస్థ ఉమ్మడి భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు పురపాలక సంఘాలతోపాటు బేతంచెర్ల నగర పంచాయతీలో కలిపి 25,300 స్వయం సహాయక పొదుపు సంఘాలున్నాయి. 2,58,823 మంది మహిళలున్నారు.

**ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున..**

క్యాంటీన్ నిర్వహణకు పెట్టుబడి రూ.16.40 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కో క్యాంటీన్‌కు సంబంధించి నలుగురు స్వయం సహాయక సంఘాల సభ్యులుంటే ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున రూ.12.40 లక్షలు పెట్టుబడి పెట్టాలి. మిగతా పెట్టుబడి మొత్తం.. కంటెయినర్, యంత్ర పరికరాలు, సౌర విద్యుత్తు, ఇతర అవసరాల రూపంలో మెప్మా, ఓ



సంస్థ ప్రతినిధులు చేయూతనిస్తారు. ఒక్కో క్యాంటీన్ నెలవారీ టర్నోవర్ రూ.6.39 లక్షలు ఉండేలా.. ప్రతినెలా లాభం రూ.2.46 లక్షలు వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

**కాలుష్య రహితంగా..**

వంట కోసం వంద శాతం ఎలక్ట్రిక్, పీఎం సూర్యఘర్ కింద సౌర విద్యుత్తు వినియోగిస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన సదుపాయం ఉంటుంది. అనుభవజ్ఞులైన చెఫ్‌లు, ఎప్పటికప్పుడు అధికారుల ఆహార తనిఖీలు నిర్వహించి పలు సూచనలు అందిస్తారు. ఎప్పటికప్పుడు ఖాతాదారుల అభిప్రాయాలు తెలుసుకుని క్యాంటీన్లను సమర్థంగా నడిపిస్తారు. సంతృప్తి చెందేలా ఆహారం అందిస్తారు.

**24 గంటలు పనిచేసేలా..**

ఈ ఏడాది మార్చి 8 నుంచి జూన్ 8వ తేదీలోగా కర్నూలులో 10, ఆదోని 02, ఎమ్మిగనూరు 01 తృప్తి క్యాంటీన్లను స్వయం సహాయక పొదుపు మహిళలతో ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలోనూ పది వరకు ఏర్పాటు చేయనున్నారు. వీటిని నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లోని ముఖ్యమైన ప్రధాన కూడళ్లు, హైవేను ఆనుకుని ఉన్న ప్రదేశాలను ఎంపిక చేయడంతోపాటు 24 గంటలు పనిచేసేలా చూస్తారు.

# రుణాలు ఇక ఆన్‌లైన్‌లో..

డోన్: పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాల మంజూరును ప్రభుత్వం సరళతరం చేస్తూ మెప్మా అధికారులకు బాధ్యతలను ఇచ్చింది. తర్వాత అప్రూవల్‌ను బ్యాంకు అధికారులు ఇస్తారు. రుణాల మంజూరుకు పొదుపు సభ్యులు దరఖాస్తు చేయడంలోనూ నూతన విధానాన్ని తెచ్చారు. పొదుపు మహిళలు మహిళాకాశం యాప్‌లో ఆర్పీకి గానీ, మెప్మా సీవో, సీఎంఎం అధికారులకు గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఇదివరకే సంఘాల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల లాగిన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తారు. మొదటగా ఆర్పీ లాగిన్ నుంచి సీవో, తర్వాత సీఎంఎం లాగిన్‌కు వెళ్తే..దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి రూ. 5 లక్షల వరకు బ్యాంకుల్లో రుణాలు పొందే అవకాశాన్ని కల్పించారు. ఆపైగా రుణం తీసుకోవాలంటే మెప్మా పీడీ లాగిన్‌కు వెళ్తుంది.



**మెప్మా అధికారులకు ప్రతిపాదిస్తేనే..**

మెప్మాకు సంబంధించి ఆర్పీ లాగిన్‌లో 25 గ్రూపులు కన్పిస్తాయి. ఆర్పీ లాగిన్‌లో రుణం మంజూరు చేయాలని ప్రతిపాదన పంపించాలి. తర్వాత సీవో లాగిన్‌కు వస్తుంది. సీవో వాటిని పరిశీలించి అన్నీసరిగా ఉన్నాయని ధ్రువీకరిస్తే...తర్వాత సీఎంఎం లాగిన్‌కు వస్తుంది. సీఎంఎం రూ.5 లక్షల వరకు బ్యాంకు రుణం ఇప్పించేందుకు వీలుంటుంది. రూ.5 లక్షలకు పైగా రుణం తీసుకోవాలంటే పీడీ లాగిన్‌కు వెళ్తుంది. పీడీ లాగిన్ నుంచి ఎంఎల్‌సీసీ యాప్ ద్వారా బ్యాంకర్స్ లాగిన్‌కు వెళ్తుంది. బ్యాంకు అధికారులు లాగిన్‌లో పూర్తిగా పరిశీలించిన తర్వాత సూక్ష్మ రుణ ప్రణాళికను (ఎంసీపీ) ఆధారం చేసుకుని రుణాన్ని గ్రూపు సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు చేరుస్తారు. గ్రూపు లీడర్ల చరవాణులకు మెసేజ్ ద్వారా రుణం మంజూరైందా, తిరస్కరించారా అనేది తెలియజేస్తారు. మహిళలు బ్యాంకుకు కేవలం నగదు తీసుకునేందుకు వెళ్తే సరి. ఈ ప్రక్రియలో రూ.5 లక్షల వరకు అంటే మెప్మా ఆర్పీ, సీవో, సీఎంఎం లాగిన్‌కు (మహిళాకాశం యాప్ ద్వారా), రూ.5 లక్షలకు పైగా రుణం అయితే మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) లాగిన్ (ఎంఎల్ఎల్‌సీ యాప్)లు కీలకం కానున్నాయి. రుణం కావాలని దరఖాస్తు నమోదు నుంచి సమాచార సేకరణ, రుణం మంజూరు వరకు అన్నీ ఈ యాప్ ద్వారానే జరగనున్నాయి.**ఎంతో ఉపయోగం**

రుణం మంజూరు విషయంలో పారదర్శకత పెరిగేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుంది. ఒకటికి మించి సంఘాల్లో ఉండి రుణాలు పొందుతూ కొందరు బురిడీ కొట్టిస్తుంటారు. ఇటువంటి వారికి ఈ కొత్త విధానం ద్వారా అడ్డుకట్ట వేసేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. ఒక గ్రూపు ఒక బ్యాంకులోనే రుణం తీసుకునేందుకు వీలుంటుంది. కానీ మరో బ్యాంకులో రుణం తీసుకునేందుకు వీలుండదు. కొందరు గ్రూపు సభ్యులకు తెలియకుండా రుణాలు పొంది తర్వాత ఇబ్బందులు పెట్టిన సంఘటనలు ఉన్నాయంటే అతిశయోక్తి లేదు. రుణం మంజూరైందా, లేదా అని తెలుసుకునేందుకు మెప్మా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. కర్నూలు జిల్లాలో మొత్తం 16 వేల స్వయం సహాయక సంఘాలు ఉండగా, నంద్యాల జిల్లాలో 11 వేల సంఘాలు ఉన్నాయి. బ్యాంకుల్లో రుణాల మంజూరుకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరంలో కర్నూలు జిల్లాలో 4,500ల ఎస్‌హెచ్‌జీలకు రూ.450 కోట్ల రుణాలు, నంద్యాల జిల్లాలో 2,700ల ఎస్‌హెచ్‌జీలకు రూ.270 కోట్ల రుణాలు ఇవ్వాలన్న లక్ష్యంతో అధికారులు రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల నాన్‌ఫెర్ఫార్మెన్స్ అకౌంట్స్ (ఎన్‌పీఏ) రుణాలు చెల్లించని గ్రూపులు తగ్గే అవకాశం ఉంటుంది.

# ప్రభుత్వమే ఆ'ధర'వు చూపాలి



తిరుపతి : మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా అదనపు రాయితీ ఇస్తానని ప్రకటించింది. తోతాపురి కాయలు విక్రయిస్తే కిలోకు రూ.4 ప్రభుత్వం అదనంగా ఇచ్చేలా రూ.200 కోట్ల వరకు భారాన్ని భరిస్తానని వెల్లడించింది. అయితే గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల నిర్వాహకులు ఆశించిన ధర ఇవ్వకపోవడంతో అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సొంత నియోజకవర్గం కుప్పంలో బుధవారం పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మామిడి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశ్రమ వర్గాలు, అధికారులతో సమీక్షించి ఓ పరిష్కారాన్ని చూపితే ప్రయోజనం ఉంటుంది. ఈ ఏడాది ఆశించిన దాని కన్నా అధికంగా తోతాపురి దిగుబడులు వచ్చాయి. గతంతో పోలిస్తే సరాసరి లక్ష– 1.20 లక్షల టన్నులు ఎక్కువగా ఉంది. పొరుగునే ఉన్న క్రిష్ణగిరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి తలెత్తడంతో అక్కడి నుంచే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మామిడి వస్తోంది. సీజన్ ప్రారంభంలోనే కిలోకు రూ.8 చెల్లించాలని వ్యాపారులకు.. చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్ సూచించినా సిండికేట్ కారణంగా ఆ ధర రావడం లేదు. ప్రభుత్వం అదనంగా ఇస్తామన్న ధరలో ఏమాత్రం కోత విధించలేదు. చివరి కాయ వరకూ కిలోకు రూ.4 ఇస్తామని కలెక్టర్లు పదేపదే చెబుతున్నారు. ప్రస్తుతం అత్యధిక పరిశ్రమలు కిలోకు రూ.5 మాత్రమే ఇవ్వడం, టోకెన్లు దొరక్కపోవడంతో అన్నదాతలు ఆగ్రహంగా ఉన్నారు.

**కొన్ని స్థానిక పరిశ్రమలతో తలనొప్పి..**

గంగాధరనెల్లూరు మండలంలోని జైన్ పరిశ్రమ.. మిగతావాటితో పోలిస్తే ధర ఎక్కువ ఇస్తోంది. అదేవిధంగా తూకంలోనూ మోసం చేయడం లేదు. దాంతో ఈ కర్మాగారానికి అన్నదాతలు బారులు తీరుతున్నారు. కొన్ని స్థానిక పరిశ్రమలు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. ర్యాంపులు కిలోకు రూ.2–3 మాత్రమే ఇస్తున్నాయని.. తాము రూ.4 మాత్రమే చెల్లిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఇటువంటి వాటిపై ఉక్కుపాదం మోపేలా అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వాలి. తద్వారా సిండికేట్‌కు చెక్ పెట్టినట్లవుతుంది. స్థానిక కంపెనీలు తక్కువ ధర ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తేనే దారిలోకి వస్తాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు తమకున్న పలుకుబడితో ఇష్టారాజ్యంగా టోకెన్లు తీసుకుని మిగతా రైతులకు అన్యాయం చేయకూడదని స్పష్టమైన ఆదేశాలివ్వాలి.

**అన్నదానంలో వినియోగిస్తేనే..**

అంతర్జాతీయ మార్కెట్‌లో మామిడి గుజ్జుకు డిమాండ్ లేదని గుజ్జు పరిశ్రమల ప్రతినిధులు అంటున్నారు. పశ్చిమ ఆసియా, ఐరోపా దేశాలకు ఎగుమతి ఖర్చులూ గణనీయంగా పెరిగాయని వాపోతున్నారు. ఆయా దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన తరుణంలో బీమా కూడా అధికంగానే ఉందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశీయంగా మార్కెట్ పెరిగితేనే మామిడి రైతులకు కష్టాలు తప్పుతాయి. ఎప్పటి నుంచో పారిశ్రామికవర్గాలు కోరుతున్న విధంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలైన తిరుమల, శ్రీశైలం, విజయవాడ దుర్గమ్మ, శ్రీకాళహస్తి, కాణిపాకంలో నిర్వహించే అన్నదానంలో మామిడి రసాన్ని అందిస్తే ప్రస్తుతానికి ఉపశమనం లభిస్తుంది. గతంలోనే ఈ ప్రతిపాదన ముఖ్యమంత్రి ముందుకు వచ్చినా ఆ దిశగా అడుగులు వేయలేదు.

**రూ.5 ఇప్పిస్తే ఉపశమనం**మరోవైపు గుజ్జు పరిశ్రమలు కిలోకు రూ.5–6 మాత్రమే ఇస్తున్నాయి. ర్యాంపుల నిర్వాహకులు రూ.2–3 చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన కిలోకు రూ.4కు అదనంగా మరో రూపాయి ఇస్తే ఎంతోకొంత కష్టాల నుంచి గట్టెక్కుతారు.

# తొలగని శిథిలాలు.. చెరగని ప్రమాద గుర్తులు

సింహాచలం : సింహాచలం క్షేత్రంలో ఏప్రిల్ 30 చందనోత్సవం రోజున భక్తులపై గోడ కూలిన ఘటన జరిగి రెండు నెలలైంది. ఆ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. బాధ్యులైన దేవస్థానం, పర్యాటక శాఖకు చెందిన ఇంజినీరింగ్ అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయితే ఇప్పటికీ ప్రమాదస్థలిలో సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. మరో పక్క ప్రసాద్ పథకం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. శిథిలాలతో భక్తుల అవస్థలు: ప్రమాదంపై ప్రభుత్వం స్పందించి త్రిసభ్య కమిటీ విచారణకు ఆదేశించింది. మే 1న కమిటీ సింహగిరిపై పర్యటించి లోపాలను గుర్తించింది. పనుల్లో భాగస్వాములైన ఇంజినీరింగ్ అధికారులతో పాటు గుత్తేదారుపై చర్యలకు సిఫార్సు చేసింది. ఈవో సుబ్బారావు, రెండు శాఖల అధికారులను సస్పెండ్ చేశారు. బాధ్యులపై పోలీసు కేసులు నమోదు చేసి ఆధారాలను సేకరించారు. కానీ, ఇప్పటికీ గోడ శిథిలాలను తొలగించ లేదు. ఆ ప్రాంతంలోకి



ఎవరూ వెళ్లకుండా ఇనుప కంచె ఏర్పాటు చేసి వదిలేశారు. శిథిలాల తొలగింపునకు దేవస్థానం అధికారులు అనుమతి కోరగా.. అధికారికంగా పోలీసుల నుంచి అనుమతులు రాలేదని సమాచారం. శిథిలాల కారణంగా భక్తులు బస్టాండు నుంచి ఆలయానికి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**60 శాతం పనులే పూర్తి..**

సింహగిరిపై రూ.54కోట్లతో చేపట్టిన ప్రసాద్ పథకం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వాస్తవానికి 2024 డిసెంబరు నెలాఖరుకు పూర్తి కావాల్సి ఉన్నా 60 శాతం పనులే జరిగాయి. పర్యాటకశాఖ అధికారుల కోరిక మేరకు 2025 మార్చి నెలాఖరు వరకు గడువు పొడిగించారు. అప్పటికీ కొలిక్కి రాకపోవడంతో మరో రెండు నెలల గడువు కోరారు. ఇంతలోనే గోడ కూలడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా పర్యాటకశాఖ మంత్రి, ఉన్నతాధికారులు ప్రసాద్ పథకం పనులపై దృష్టి సారించి వీలైనంత వేగంగా పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

# అసలే అష్టవంకర్లు.. ఆపై ఆక్రమణలు

అనకాపల్లి : పట్టణంలో పెరుగుబజారు రహదారి విస్తరణలో కొన్నిచోట్ల ఆక్రమణలు జరిగినట్లు విచారణలో తేలింది. దాదాపు ఎనిమిది నుంచి పది చోట్ల ఆక్రమణలు చోటు చేసుకున్నట్లు, రెండుచోట్ల రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసినట్లు ఉన్నతాధికారుల సర్వేలో నిగ్గుతేలినట్లు సమాచారం. ఆక్రమణలను గుర్తించకుండా అధికారులు ఇరువైపులా కాలువల నిర్మాణం పూర్తి చేశారు.

పెరుగుబజారు రహదారిని అష్టవంకర్లతో నిర్మిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపైలో ప్రచురించిన కథనాలకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించారు. అక్రమాలపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టరు విజయకృష్ణన్ విచారణకు ఆదేశించారు. ఈమేరకు ప్రణాళికా విభాగం జిల్లా అధికారి గోపాలరాజు ఆధ్వర్యంలో విస్తరణకు సంబంధించిన కొలతలు తీశారు. ఆక్రమణలు చోటు చేసుకున్నట్లు గుర్తించినట్లు తెలిసింది.

ఈ రహదారిని 50 అడుగులకు విస్తరిస్తున్నారు. విస్తరణ పనులు గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు మామూళ్లు ఇచ్చిన వారికి అడుగు నుంచి మూడడుగుల వరకు ముందుకు వచ్చి నిర్మించుకునేందుకు అంగీకరించినట్లు తెలిసింది. కొన్ని భవనాలకు దిగువన 50 అడుగుల మేరకే స్థలం విడిచిపెట్టినా పై అంతస్తులను రెండు నుంచి నాలుగడుగులు ముందుకు నిర్మించుకున్నారు. ఇలాంటిచోట విద్యుత్తు స్తంభాలను రహదారి మధ్యలో వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల పదవీ విరమణ చేసిన ప్రణాళిక విభాగం అధికారి దీనికి సూత్రధారిగా తెలుస్తోంది. దీనిపై జోనల్ కమిషనర్ బి.వి.రమణను వివరణ కోరగా కొన్ని చోట్ల ఆక్రమణలు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు.

# నాడు కన్నేశారు.. నేడు దున్నేశారు

ఏర్పేడు : 'నాడు- నేడు' అంటూ వైకాపా హయాంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు మాత్రం అరకొర చేసిన ఆ పార్టీ నేతలు.. కబ్జాల పర్వాన్ని మాత్రం కొనసాగించారు. ఆ పార్టీ హయాంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు ప్రణాళిక వేసుకున్న సదరు నేతలు ఇప్పుడు ఆ భూములను చదును చేసి వ్యవసాయ పనులు చేస్తున్నారు. శ్రీకాళహస్తి మండలం భీమవరం గ్రామానికి సమీపంలోని అక్కన్నచెరు



వు ఆనుకుని ప్రభుత్వ స్థలంలో ఎస్టీలు పూరిళ్లు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం పక్కా ఇళ్లు అందుబాటులోకి రావడంతో ఈ స్థలాన్ని వదలిపెట్టారు. వైకాపా హయాంలో కొందరు రాజకీయ అండతో ఈ స్థలాన్ని ఆక్రమించాలని చూశారు. ఎన్నికలు రావడంతో అప్పట్లో ఆగిపోయిందని గ్రామస్థులు చెబుతున్నారు.

**దశల వారీగా కబ్జా..** ఇక్కడున్న స్థలాన్ని చుట్టూ పొలాలు కలిగిన భూస్వామి, రైతులు రాత్రి వేళల్లో జేసీబీ సాయంతో చదును చేసి తమ పొలాల్లోకి కలిపేసుకుం టున్నారు. ఏళ్ల క్రితం తమ కోసం ఇచ్చిన స్థలాలను ప్రస్తుతం అక్కడి వారు కబ్జా చేయడంపై ఎస్టీలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వారి ప్రయత్నాలు అడ్డుకోవాలని కోరుతున్నారు.పరిశీలించి చర్యలు జనార్దన్‌రాజు, తహసీల్దార్, శ్రీకాళహస్తికబ్జా విషయం మా దృష్టికి రాలేదు. సంబంధిత గ్రామ విస్తరణాధికా రులతో మాట్లాడతాం. కబ్జాలకు అవకాశం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

# భద్రతా లోపాలు.. కార్మికులే సమిధలు!



అనంతపురం : పరిశ్రమల్లో భద్రతా లోపాలు కార్మికుల ప్రాణాలను బలిగొంటున్నాయి. కొన్ని యాజమాన్యాలు కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనికితోడు అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా అన్నది అధికారులకు పట్టడం లేదు. ఉమ్మడి అనంత జిల్లాలోని సిమెంటు, స్టీల్, రసాయన పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తనిఖీల్లో లోపాలను గుర్తించినా సంబంధిత యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నైపుణ్యం కొరవడి..**

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా తాడిపత్రి, హిందూపురం, రాయదుర్గం ప్రాంతాల్లో సిమెంట్, స్టీలు, పాలిమర్స్, క్యాస్ట్ ఐరన్, పెయింట్.. తదితర పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఆయా చోట్ల రియాక్టర్లు, బాయిలర్లు, బ్లాస్ట్ ఫర్నేస్‌ల వంటి కీలక విభాగాల వద్ద సాంకేతిక అంశాలపై అవగాహన, నైపుణ్యం ఉన్నవారితోనే పనిచేయించాలి. అర్హతలున్న వారినే విధుల్లో నియమించాలంటే ఆ మేరకు ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈక్రమంలో కొన్ని యాజమాన్యాలు నైపుణ్యం, విద్యార్హత లేని వారిని నియమించుకుంటున్నాయి. నామమాత్రపు శిక్షణ ఇచ్చి కీలక ప్రదేశాల్లో పనిచేయిస్తున్నారు. దాదాపు అన్ని పరిశ్రమల్లో బిహార్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి ఇక్కడ కార్మికులుగా చేర్చుకుంటున్నారు.

**పర్యవేక్షణ ఏదీ?**

చాలా పరిశ్రమల్లో పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టడం లేదు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు పర్యవేక్షించాలి. ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ప్రమాదాలు జరగకుండా ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారనే అంశాలను పరిశీలించాలి. ఒకవేళ ఉల్లంఘనలు ఉంటే అక్కడికక్కడే సరిచేయించడమో.. చర్యలు తీసుకోవడమో చేయాలి. అధికారులు ఇవేమి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

**కొన్ని ఉదంతాలు..**

ఈ ఏడాది జూన్‌లో హిందూపురంలోని తూముకుంట పారిశ్రామికవాడలో ఉన్న స్టీల్ పరిశ్రమలో కడ్డీ గుచ్చుకుని బిహార్ కార్మికుడు మృత్యువాతపడ్డాడు.

గతేడాది నవంబరులో శింగనమల మండలం లోలూరులోని కర్పూరం ఫ్యాక్టరీలో రియాక్టర్ నుంచి గ్యాస్ లీకై ఏడుగురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

అదే ఏడాది డిసెంబరులో యాడికి మండల పరిధిలోని సిమెంట్ పరిశ్రమ కోల్‌మిల్లులో ప్రమాదం సంభవించడంతో ఓ కార్మికుడు మరణించాడు. ఐదుగురు గాయపడ్డారు.

2023, మార్చిలో తూముకుంటలోని స్టీల్ పరిశ్రమలో కర్ణాటకకు చెందిన కార్మికుడు వెల్డింగ్ చేస్తుండగా అక్కడికక్కడే చనిపోయాడు.

2021లో ఫార్మా పరిశ్రమలో కార్మికుడిపై రియాక్టర్ పడటంతో మృత్యువాతపడ్డాడు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులిస్తున్నాం**

రాధాకృష్ణ, పరిశ్రమల సేఫ్టీ అధికారి

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు గ్లౌజ్, మాస్కు, హెల్మెట్ తప్పనిసరి. దీంతోపాటు సేఫ్టీ అధికారిని నియమించుకోవాలి. ప్రతి ఫ్యాక్టరీలో 24 గంటల పాటు అంబులెన్స్ అందుబాటులో ఉంచుకోవాలి. నిబంధనలు పాటించని పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు తనిఖీ చేసి నోటీసులు ఇస్తున్నాం. తగిన చర్యలు తీసుకుంటున్నాం.

# మామూలోడు కాదు.. 'మార్కుల' మాయలోడు




ఏయూ ప్రాంగణం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ కేంద్రం అక్రమాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది. పూర్వ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నియమించిన ఓ అధికారి రీవాల్యుయేషన్‌లో అవకతవకలకు పాల్పడుతూ రూ.కోట్లు కొల్లగొడుతున్నాడు. గత ఆరేళ్లుగా అతని హవా నిరాటంకంగా కొనసాగుతుండటం గమనార్హం. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఆ అరాచక అధికారికి అడ్డుకట్ట పడకపోవడంపై వర్సిటీ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

**ఒక్కో సబ్జెక్టుకు రూ.15వేల వరకు వసూలు:** ఆంధ్ర విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో చదివే విద్యార్థుల మార్కుల జాబితాలను ఏయూ కంప్యూటర్ కేంద్రంలో తయారు చేస్తుంటారు. పరీక్ష ఫెయిలైన లేదా మార్కులు తక్కువ వచ్చాయని భావించిన పలువురు విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేస్తుంటారు. ఈ విధంగా నెలకు వర్సిటీకి సమారు 5వేల నుంచి 6వేల వరకు దరఖాస్తులు వస్తుంటాయి. ఇందులో 150 నుంచి 200 మంది విద్యార్థులు అక్రమ పద్ధతిలో ఉత్తీర్ణులు కావడానికి కంప్యూటర్ కేంద్రంలోని అధికారిని ఆశ్రయిస్తున్నారు. ఒక్కో సబ్జెక్టులో ఉత్తీర్ణులు చేయడానికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఆ అధికారి వసూలు చేస్తున్నాడు. ఈ విధంగా ఒక్క నెలలో రూ.15లక్షల వరకు కొల్లగొడుతున్నాడు. ఏడాదికి అక్రమ వసూళ్ల మొత్తం రూ.2కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**ఎలా అక్రమాలకు పాల్పడుతున్నారంటే..**

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థి జవాబు పత్రాన్ని సంబంధిత అధ్యాపకుడి చేత మూల్యాంకనం చేయిస్తారు. ఆ జవాబు పత్రం(ఆన్సర్ షీట్) కంప్యూటర్ కేంద్రానికి చేరుతుంది. అక్కడ జవాబు పత్రాన్ని స్కానింగ్ చేసి మార్కుల జాబితా తయారు చేస్తారు. ఇక్కడే డబ్బులిచ్చిన విద్యార్థికి పాస్ మార్కులు వచ్చేలా మాయ చేస్తున్నారు. జవాబుపత్రంపై చిన్న పెన్ను గీత పడినా దాన్ని కంప్యూటర్ ఆమోదించదు. అప్పుడు కంప్యూటర్‌లో మాన్యువల్‌గా మార్కులు నమోదు చేయాల్సి ఉంటుంది. అక్రమార్కులు జవాబుపత్రాలపై గీతలు పెట్టి మాన్యువల్‌గా విద్యార్థులకు పాస్‌మార్కులు వేసి మార్కుల జాబితా తయారు చేస్తున్నారు. దొడ్డిదారిలో ఉత్తీర్ణులవ్వాలనుకునే విద్యార్థులను ఆకర్షించేందుకు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణ, ఏయూ అవుట్ గేట్ వద్ద, ఏయూ పరిపాలనా భవనం పరిసరాల్లో పలువురు వ్యక్తులను ఆ అధికారి నియమించుకున్నారు.

**వెల్లడికాని 400మంది మార్కులు:** రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్న 400 మంది విద్యార్థుల మార్కుల జాబితా విడుదల చేయలేదు. జనవరి నెలలో వీటిని రీవాల్యుయేషన్ చేసినట్లు చెబుతున్నారు. మార్కుల జాబితా విద్యార్థులకు పంపించకపోవడానికి కారణాలను అధికారులు బయట పెట్టకపోవడం గమనార్హం. ఓ విద్యార్థి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా అతని జవాబుపత్రం లభించలేదని చెబుతున్నారు. ఆయా అక్రమాలపై లోతైన దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని వర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

కంప్యూటర్ కేంద్రం బాధ్యుడిగా ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగ ఆచార్యులను నియమించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి ఆరేళ్ల క్రితం అప్పటి ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి తూట్లు పొడిచి మరో విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకుడిని నియమించారు. అతను వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో పనిచేసిన ఉన్నతాధికారికి బంధువు కావడం గమనార్హం. ప్రస్తుత వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ కంప్యూటర్ కేంద్రంపై దృష్టి సారించి ప్రక్షాళన చేయాలని వర్సిటీ వర్గాలు కోరుతున్నాయి.

# కొడికొండ- శిర మధ్య నాలుగు వరుసల రహదారి



హిందూపురం : జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా కొడికొండ- శిర 544ఈ జాతీయ రహదారి నాలుగు వరుసలు రూపుదిద్దుకోనుంది. దీనికోసం ప్రతిపాదనలు (డీపీఆర్) సిద్ధం చేసి పంపాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. భవిష్యత్తులో ఈ రహదారుల్లో వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారుల నిబంధనల మేరకు 24 మీటర్ల మేర రహదారి విస్తరించి ఉండాలి. దీనిలో 4 మీటర్లు డివైడర్ ఏర్పాటు చేయగా మిగిలిన 20 మీటర్లలో రహదారి ఉండాలి. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న జాతీయ రహదారులను నాలుగు వరుసలుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వాహనాల రాకపోకలు పెరిగి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

**ఎన్‌హెచ్ 44, 48కు అనుంధానంగా..**

కశ్మీర్ నుంచి కన్యాకుమారి ఎన్‌హెచ్ 44, బెంగళూరు నుంచి పుణె జాతీయ రహదారి 48తో అనుసంధానం చేస్తూ 2016-17లో కొడికొండ- శిర జాతీయ రహదారి 544ఈ 99 కిలోమీటర్లు రూ.వెయ్యి కోట్లతో ఏర్పాటు చేశారు. ఈ రహదారి అందుబాటులోకి రావటంతో అనంతపురం, తాడిపత్రి నుంచి మంగళూరు పోర్టు, పుణె, ముంబయి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు సులువుగా చేరుతున్నాయి.

**విస్తరణకు అందుబాటులో అవసరమైన భూమి**

కొడికొండ నుంచి మడకశిర వరకు నాలుగు వరుసల రహదారి ఏర్పాటు చేసేందుకు అనువైన భూమి అందుబాటులో ఉంది. రెండు వరసల జాతీయ రహదారి ఏర్పాటు చేసే సమయంలోనే అధికారులు ముందస్తుగా అదనంగా భూసేకరణ చేశారు. మడకశిర నుంచి శిర వరకు రెండు వరసల రహదారికి మాత్రమే భూసేకణ చేసినందున ఇక్కడ అదనంగా సేకరించాల్సి ఉంది.

# కోరినంత.. ఇసుక

తిరుపతి : జిల్లాలో ఇసుక కొరత రాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా నిల్వలు పెంచుకోవాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రానున్న రోజుల్లో రోజుకు ఎంత ఇసుక ఎంత అవసరం ఉంటుందన్న అంచనాలతో ఈ కేంద్రాల్లో నిల్వలు పెంచుకొనేలా ఏర్పాట్లు చేశారు. వర్షాల నేపథ్యంలో నదుల్లో ఇసుక లభ్యత ఉండని కారణంగా రెగ్యులర్ డీసిల్టింగ్ కేంద్రాలతోపాటు ఇతర ప్రాంతాల్లోని నదుల్లోనూ సేకరించేందుకు మైనింగ్ శాఖ అధికారులు వెసులుబాటు కల్పించారు. రాజంపేటతోపాటు జిల్లాలో స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలోని పెళ్లకూరు, కోట మండలం గూడలి నుంచే కాకుండా చంద్రగిరి మండలం భీమవరం, రంగంపేట నుంచి తీసుకొనేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నాలుగు టన్నుల సామర్థ్యంతో ట్రాక్టర్ ఇసుకను రూ.2800కు విక్రయిస్తున్నారు.

**కేంద్రాల్లోనే కొనుగోలు చేయాలి**

నదులు, కాలువ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు ఉచిత ఇసుక



పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని, వారి ముసుగులో అక్రమార్కులు చేస్తున్న దందాకు ఎవరూ మద్దతు పలకవద్దని అధికారులు కోరుతున్నారు. నాణ్యమైన ఇసుక లభ్యత ఉన్న విక్రయ కేంద్రాలను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

**మాఫియాతో ఖజానాకు తూట్లు**

జిల్లాలో గడిచిన ఐదు నెలలుగా ఇసుక మాఫియా అక్రమ తవ్వకాలతో ప్రభుత్వ ఖజానాకూ తూట్లు పడ్డాయి. ఇసుక అక్రమ తరలింపులు పెద్దఎత్తున జరిగిన నేపథ్యంలో పట్టణ, నగర వాసుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక విక్రయ కేంద్రాలు వెలవెలబోయాయి. నామమాత్రపు ధరకు ప్రభుత్వం ఇసుక విక్రయించినా కొనేవారు లేకుండాపోయారు. చివరకు భవన నిర్మాణ సంస్థలు, డెవలపర్లు సైతం అడ్డదారులను ఆశ్రయించే పరిస్థితులు ఉండటంతో జిల్లా యంత్రాంగం సమస్యలపై దృష్టిసారించింది. జిల్లాలో ఇసుక నిల్వ కేంద్రాలు: 3 (తిమ్మినాయుడుపాలెం (కాటన్‌మిల్లు), అవిలాల, గాజులమండ్యం)

రోజుకు అవసరం: 5 వేల టన్నులు (అంచనా)

ప్రస్తుతం ఉన్న నిల్వ: 20 వేల టన్నులు

టన్ను ఇసుక ధర: రూ.700

# నాణ్యత లేకున్నా కొని.. తితిదే ఖజానాకు గండికొట్టి!

తిరుపతి : ఐదేళ్ల వైకాపా పాలనలో పాలకమండలిలోని పెద్దలు, కొందరు అధికారులు తితిదేను భ్రష్టు పట్టించారు. చివరికి చంద్రగిరి మండలం నర్సింగాపురంలోని శ్రీశ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీకి అవసరమైన యంత్ర పరికరాల్లోనూ నాణ్యత లేనివి కొనుగోలు చేశారనే విమర్శలున్నాయి. రూ.3.90 కోట్లతో కొన్న యంత్రాలు.. ఔషధాల తయారీకి వినియోగించలేని దుస్థితిలో ఉన్నాయంటే నాటి పాలకులు ఎలా వ్యవహరించారో అర్థమవుతోంది. 2022 ఫిబ్రవరి 17న ఇలాంటి యంత్రాన్ని సరఫరా చేసేందుకు తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అసలు మందులు తయారు చేసే యంత్రాలు ఒకటి కూడా సరిగా పనిచేయడం లేదని ప్రయోగాత్మకంగా పరీక్షించిన రోజే వాటి డొల్లతనం బయటపడిందని



ప్రస్తుత తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. యంత్ర పరికరాలు సరఫరా చేసే సంస్థకు అసలు అంత సామర్థ్యం ఉందా? లేదా? అని ముందుగానే పరిశీలించాలి. ఇలాంటివి జరగకుండా ఆఘమేఘాలపై హైదరాబాద్‌కు చెందిన సంస్థకు కట్టబెట్టడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటనలపై స్పందించి ఇప్పటికైనా చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు జరగవు. **విజిలెన్స్ నివేదిక బహిర్గతమైతేనే..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాటి వైకాపా అక్రమాలు, అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఐదేళ్లలో తీసుకున్న నిర్ణయాలు, జరిగిన అవినీతిని విజిలెన్స్ అధికారులు నిగ్గు తేల్చి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. వీటిని తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపి చర్యలకు సిఫార్సు చేయాల్సిన బాధ్యత సర్కార్‌పై ఉంది. నాటి తితిదే ఛైర్మన్లు, ఉన్నతాధికారుల పాత్ర ఏంటో బహిర్గతం కానుంది.

# ఇంతెందుకు.. తగ్గిద్దాం!

తిరుపతి : తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల నిర్మాణాలకు వైకాపా హయాంలో ఏకకాలంలో రూ.600 కోట్లకు టెండర్లు ఖరారు చేయడాన్ని విజిలెన్స్ విభాగం గతేడాది ఇచ్చిన నివేదికలో తప్పు పట్టింది. ఎక్కువ కొటేషన్ల టెండర్లు ఆమోదించారని పేర్కొంది. తితిదే గణాంక అధికారి, ఇంజినీరింగ్ విభాగం ఏకకాలంలో రూ.300 కోట్లు అచ్యుతం, రూ.300 కోట్లు శ్రీపాదం వసతి భవనాలకు అనుమతులు ఇవ్వడంలో గత పాలకుల అవినీతి మరకలు ఉన్నాయంటూ నివేదిక సమర్పించింది. ఈ విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈ రెండు సముదాయాల పనులు 2024 మార్చి 15 నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు వసతి కేంద్రాలకు సంబంధించి రూ.300 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు వసతి గృహాలకు సంబంధించి నిర్మాణ వ్యయం తగ్గించే అవకాశాలు ఉన్నాయంటూ ఇటీవల జరిగిన తితిదే పాలక మండలి సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో కొన్ని అంశాల్లో వ్యయం తగ్గించేందుకు ఇంజినీరింగ్ విభాగం నివేదికలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. **సదుపాయాలు ఇలా..** శ్రీపాదం, అచ్యుతం తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు ఉంటాయి. ఒకటో అంతస్తులో పార్కింగ్, 2వ అంతస్తులో రిసెప్షన్, అన్నదాన కేంద్రం ఉంటాయి. 3, 4 అంతస్తుల్లో 48 డార్మెటరీలు, 5 నుంచి 9 అంతస్తుల్లో 532 గదులు నిర్మిస్తున్నారు.

# నోరెండుతోంది.. నీరందలేదు!

విశాఖపట్నం: వేసవిలోనే కాదు.. జోరున వానలు కురిసే సమయంలో తాగునీరు లేక ఇబ్బందిపడే గ్రామాలు.. ఉదయం నిద్ర లేస్తూనే నెత్తిన బిందె పెట్టుకుని నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితులు ఈనాటికీ ఉన్నాయి. ఈ ఇబ్బందులు తీర్చేలా ఇంటింటికీ రక్షిత తాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు పడుతూ.. లేస్తూ సాగుతున్నాయి. జల్‌జీవన్ నిధులతో పనులు పూర్తి చేయకుండానే.. చేసినట్లు నివేదికలిచ్చేస్తున్నారు.
కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కింద జల్‌జీవన్ మిషన్‌కు భారీగా నిధులు మంజూరు చేసింది. ఈ పథకం ద్వారా జిల్లాలో 24 మండలాల పరిధిలో సమృద్ధిగా తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా రెండు విడతల్లో రూ. 567 కోట్లతో 1658 పనులు చేపట్టారు. వైకాపా పాలనలో ఈ పనులు నత్తను తలపించాయి. చాలాచోట్ల అసంపూర్తిగా ఉండిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ పనులకు ప్రాధాన్యమిచ్చి త్వరిగతిన చేపట్టాలని ఆదేశాలిచ్చింది. పనులు వేగవంతం చేసి కొన్ని గ్రామాల్లో ఈ పథకం ద్వారా పూర్తిస్థాయిలో నీరిచ్చేస్తున్నామంటూ గ్రామీణ నీటిసరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు నివేదికల్లో చూపిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.
నక్కపల్లి మండలం వేంపాడులో 1050 నివాసాలు ఉండగా, సుమారు 200 ఇళ్లకు కుళాయిలు వేయాలి. ఇక్కడికి నెల్లిపూడి నుంచి నీరు వస్తుంది. ఇది తాగేందుకు అంతగా బాగోదు. మెగా ప్రాజెక్టు నీరు రావడానికి ఇంకా సమయం పట్టనుంది. ఇటీవలే పైపులైను నిర్మాణం చేపట్టారు. ఉద్దండపురంలోనూ పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం చేయాల్సిన పనులకు నిధులు రావాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఇక్కడి సర్పంచితో పాటు, కూటమి నాయకుడు మంత్రి అనిత దృష్టికి



తీసుకెళ్లారు. ఇందులో సుమారు వెయ్యిచోట్ల పనులు పూర్తి చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నా, కొన్ని చోట్ల పైపులు పూర్తిస్థాయిలో వేయలేదు. కుళాయిలు ఏర్పాటు కాలేదు. అన్నీ చేసినా నీరందడంలేదు. అయినా నివేదిల్లో మాత్రం శతశాతం చేసినట్లు చూపించారు. తాగునీటి ఇక్కట్లు తీర్చాలంటూ జిల్లా, మండల కేంద్రాల్లో అధికారులకు అందుతున్న వినతుల్లో జల్‌జీవన్ పనులు శతశాతం పూర్తయినట్లు పేర్కొంటున్న గ్రామాలు సైతం ఉండటం గమనార్హం. కోటవురట్ల మండలం కొడవటిపూడిలో పనులు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నా, నీటి సరఫరా జరగడంలేదు. రామచంద్రపాలెంలో పనులు పూర్తికాకున్నా, పూర్తయినట్లు పేర్కొన్నారు.

జిల్లా సమాచారం
మండలాలు: 24
జనాభా: 15.33 లక్షలు
మంజూరైన పనులు: 1658
శతశాతం పూర్తయినవి: 989
జరుగుతున్నవి: 669

**ఆగస్టులోగా పూర్తి:** సుమారు వెయ్యి పనుల వరకు శతశాతం పూర్తి చేశారు. అక్కడక్కడ కొద్దిపాటి పనులు మిగిలున్నా వాటిని పూర్తి చేసే ఉద్దేశంతో శతశాతం నివేదికలు ఇస్తుంటారు. మిగిలిన పనులకు నిధులు వస్తే ఆగస్టులోగా పూర్తవుతాయి. మూడో విడతకు మరో 500 పనులకు ప్రతిపాదనలు తయారు చేశాం. వీటికి అనుమతులు రావాలి. ఏఎస్‌ఏ రామస్వామి, ఎస్‌ఈ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం

# కుంకీల గస్తీకి మరింత సమయం

పలమనేరు : అటవీ ఏనుగులు విధ్వంసం సృష్టిస్తున్నాయి.. పంటలపై దాడులు చేస్తూ అపార నష్టాన్ని కలిగిస్తాయి. కొన్ని సార్లు రైతులు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు. వీటి నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ చూపారు. కర్ణాటకలో విజయవంతమైన కుంకీ ఏనుగులతో జిల్లాలో విచ్చలవిడిగా తిరుగుతున్న అటవీ ఏనుగులను నియంత్రించాలని తలచారు. అక్కడి పాలకులతో మాట్లాడి నాలుగు కుంకీలను రప్పించారు. అవి పూర్తిస్థాయిలో రంగంలోకి దిగకముందే ఏనుగుల దాడిలో మరో రైతు ప్రాణం వదిలారు. ఈ నేపథ్యంలో కుంకీలు ఎప్పుడు పనిలోకి వస్తాయనే అంశంపై చర్చ నడుస్తోంది.
కుంకీలకు పలమనేరు సమీపంలోని ముసలిమడుగు శిబిరంలో వసతి కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అటవీ, నైసర్గిక స్వరూపం, స్థానిక పరిస్థితులు అలవాటయ్యేలా వాటికి 30 రోజుల శిక్షణ అందిస్తున్నారు. దీని కోసం రామకుప్పం మండలం ననియాలలోని రెండు కుంకీలను ఇక్కడకు తెచ్చారు. ఈ నెల 20 వరకు శిక్షణ కొనసాగుతుందని డీఎఫ్‌వో భరణి తెలిపారు. కొత్తగా వచ్చిన వాటిల్లో మూడు కుంకీలు శిక్షణ పూర్తి చేసుకున్నాయని, మరొక దానికి కార్యక్రమం నడుస్తుందన్నారు.

**జీపీఎస్‌తో..**

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఏనుగులు వేర్వేరు గుంపులుగా సంచరిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. అవి ఎన్ని ఉన్నాయి? ఎక్కడి నుంచి వస్తున్నాయి? మకాం ఎక్కడ? అనే వివరాలు తెలుసుకునేందుకు జీపీఎస్ వినియోగించనున్నారు. డ్రోన్ల తో గుర్తించి వాటిని అటవీ నుంచి బయటకు రాకుండా కుంకీల కాపలా ఉంచేలా ప్రణాళికలు రచిస్తున్నారు.
ఆ తర్వాత ఒంటరి ఏనుగుల కదలికలు తెలుసుకుని వాటి నియంత్రణపై దృష్టి సారిస్తారు. కొత్తగా వచ్చిన నాలుగు కుంకీలకు శిక్షణ పూర్తి చేసిన తర్వాత ననియాల నుంచి వచ్చిన వాటిని అక్కడికే తరలిస్తారు.

**దాడులు జరిగే ప్రాంతాల గుర్తింపు**

ఏనుగులు నిత్యం మకాం మారుస్తూ అటవీ సమీపంలోని గ్రామాలు, పొలాలపై దాడులకు పాల్పడతాయి. ఓ చోట జరిగిన వెంటనే అక్కడికి కుంకీలను పంపలేరు. ఇవి అక్కడికి వెళ్లే లోపే అటవీ ఏనుగులు వాటి మకాం మరోచోటకు మార్చేస్తాయి. అందువల్ల ఓ నిర్దిష్టమైన విధానం రూపొందించనున్నారు. ఏడాది కాలంలో అధికంగా దాడులు జరిగిన ప్రాంతాలు, నష్టం విలువ, ప్రాణనష్టం తదితరాలు పరిశీలించి హాట్‌స్పాట్లు గుర్తిస్తారు. అనంతరం ఆయా ప్రాంతాలకు కుంకీలను అలవాటు చేస్తారు. ఇందు కోసం అటవీ అధికారులు, శిక్షకులతో ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేయనున్నారు.

# రెవెన్యూలో అవినీతి లీలలు



గుత్తి : గుత్తి రెవెన్యూ కార్యాలయంలో దళారులతోనే కొన్ని ముఖ్యమైన పనులు కార్యాలయంలో సాగుతున్నాయి. పట్టాదారు పాసుపుస్తకాలు, వాల్టా ధ్రువీకరణపత్రం, నాన్‌రీమ్యారేజీ, నిరుద్యోగం ధ్రువీకరణ పత్రాలతోపాటు ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణపత్రాల మంజూరుకు దళారులు మధ్యవర్తిత్వం వహిస్తూ ప్రజల సొమ్మును దండుకుంటున్నారు. దళారులు కార్యాలయానికి వస్తే సకల మర్యాదలు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఇదంతా పనివేళలు ముగిశాక తాపీగా పనులు చేయించుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో రాత్రి 9 గంట వరకు కార్యాలయంలోనే ఉంటూ పనులు చేయిస్తున్నారు. ప్రధానంగా స్థిరాస్తి వ్యాపారులు భూమార్పిడులకు ఎక్కువగా వస్తుంటారని సమాచారం.


**కొన్ని ఉదాహరణలివిగో?**

గుత్తి ఆర్.ఎస్.కు చెందిన రైతు పట్టాదారు పాసుపుస్తకం కోసం ఓ వీఆర్వోను ఆశ్రయించగా రూ. 30 వేలు ఖర్చు అవుతుందని చెప్పారు. సదరు రైతు ఈనెల 4న గుత్తిలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సంయుక్త కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.
కొత్తపేటలో ఓ మహిళకు ఆమె తాత సుమారు 5ఎకరాల భూమి ఇచ్చారు. ఆ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు చేయించుకోలేదు. దీంతో రెవెన్యూ అధికారులు మిగులు భూమికింద దస్త్రాలో నమోదు చేశారు. ఆ భూమికి ఇప్పుడు పట్టాదారు పాసుపుస్తకం పొందాలని కార్యాలయానికి వెళ్లగా ఓ ఉద్యోగి రూ. 18 వేలు అధికారుల పేరు చెప్పి తీసుకోవడం గమనార్హం. తనకు సొమ్ము ముట్టలేదని ఓ అధికారి మిగులు భూమి నుంచి విడదీసేందుకు దస్త్రంపై సంతకం చేసేందుకు ఇబ్బంది పెట్టాడు. ఊబిచర్లలో ఓ వ్యక్తికి నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని ఇచ్చేందుకు దళారీ ద్వారా రూ. 3 లక్షలు తీసుకున్నారు. ఎలాంటి దస్త్రాలు లేకుండానే వన్-బీ, అడంగల్ వచ్చేలా చేశారు.
గుత్తికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు తమ వాటా భూములకు పాసు పుస్తకాల కోసం వెళ్లగా ఓ చిరుద్యోగి రూ. 3లక్షలు అడిగాడు. దళారీ రూ. 70వేలకు నిర్ణయించాడు. రైతులు తమ పొలాల్లో బోర్లు తవ్వించుకుని వాల్టా ధ్రువీరకరణ పత్రాన్ని రెవెన్యూ అధికారులతో సర్టిఫికెట్ తీసుకుని విద్యుత్తు కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ధ్రువీకరణ పత్రానికి కూడా ముడుపులు తీసుకుంటున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

దళారీల వ్యవహారంపై విచారిస్తాం. తమ కార్యాలయంలో ఎవరూ ప్రజల నుంచి ముడుపులు తీసుకోవడం లేదు. ఎవరైనా సొమ్ము అడిగితే మా దృష్టికి తేవాలి. దళారీలు తమ కార్యాలయంలో లేరు. తమపేర్లు చెప్పి ఎవరైనా సొమ్ము అడిగితే ఎవరూ ఇవ్వకూడదు. ఓబిలేసు, తహసీల్దారు, గుత్తి

# అంతటా ప్లాస్టిక్ భూతం హవా



విశాఖ : విశాఖలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ ఆధ్వర్యంలో కొన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నా... పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు. వాయు, నీటి కాలుష్యంతో నేటికీ నగర ప్రజలు సతమతమవుతున్నారు. ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోవడం, మొక్కల పెంపకం తగ్గిపోవడం విఘాతంగా మారింది. దీనికితోడు పర్యావరణం పేరిట జీవీఎంసీలో కొందరు అధికారులు చేపడుతున్న చర్యలతో ఎలాంటి ఉపయోగం లేకపోగా, ఏటా రూ. లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది.

**పేరుకే నిషేధం..!:** నగరంలో రోజూ 1100 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో 200 మెట్రిక్ టన్నుల మేర ప్లాస్టిక్, థర్మాకోల్ వ్యర్థాలు ఉంటున్నాయి. జీవీఎంసీ కార్మికులు నిత్యం 180 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్నా, 20 టన్నుల వరకు కాలువలు, గెడ్డల్లోనే ఉండిపోతుంది. నగరంలో సింగిల్ యూజ్డ్ (ఒకసారి మాత్రమే వినియోంచే) ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నా.. క్షేత్రస్థాయి పరిస్థితి అందుకు భిన్నంగా దర్శనమి స్తుండడం గమనార్హం. స్వచ్ఛ సర్వేక్షణ్ సందర్భంగా అధికారులు నాలుగైదు రోజులు హడావుడి చేసి, ఆ తర్వాత చూసీచూడనట్టు వదిలేస్తుండడంతో ప్లాస్టిక్ వినియోగం తగ్గడం లేదు.

**నిబంధనలు.. నామమాత్రం**

'జీవీఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ-2016' నిబంధనలు నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కాని చాలా మంది నివాసితులు ఇళ్లల్లో పోగయ్యే వ్యర్థాలను నేరుగా రహదారులపై, కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నా... వారిపై ఎలాంటి చర్యలు ఉండడం లేదు.
నగరంలో యూజీడీ (భూగర్భ మురుగునీటి వ్యవస్థ) ద్వారా మురుగునీరు ఎస్టీపీకి(మురుగునీటి శుద్ధి కేంద్రాలు) చేరుతుంటుంది. కానీ, చాలాచోట్ల సరైన నిర్వహణ లేకపోవడంతో యూజీడీ వ్యవస్థ దారుణంగా తయారై... మురుగంతా రోడ్డెక్కి ఆయా పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. బీ విశాఖ నగరం వాటర్ ప్లస్ ప్లస్ (బహిరంగ విసర్జన రహిత) నగరంగా గుర్తింపు పొందింది. అయితే జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు, ఇంజినీరింగ్ అధికారుల అలసత్వంతో కొన్నిచోట్ల బహిరంగ మల,మూత్ర విసర్జన కొనసాగుతూనే ఉంది.

**కాలుష్యం కమ్మేస్తోంది..**

పరిశ్రమలతో పాటు, లెక్కకు మించి వాహనాలు రోడ్డెక్కడంతో కాలుష్య తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. కాని ఆ స్థాయిలో ఎక్కడా పచ్చదనం పెంపు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నౌకాదళం, పోర్టుతో పాటు, ఇతర సంస్థల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో కొండలపై విత్తన బంతులు విసురుతున్నా... ఎక్కువ సంఖ్యలో మొక్కలు బతకడం లేదని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఏటా నగరంలో కనీసం లక్ష మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు, ఉద్యానవనాలను, మడ అడవుల్ని సంరక్షించే కార్యక్రమాలు అమలు చేస్తేనే... విశాఖ పర్యావరణ నగరిగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు.

# కాసుల వేటలో ప్రజారోగ్యమే బలి!!



విశాఖపట్నం : మాంసం దుకాణాల వద్ద మిగిలిన వ్యర్థాల తరలింపున కు తీవ్ర పోటీ నెలకొంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులున్నా.. రాజకీయ జోక్యంతో కొందరు అనధికారికంగా వాహనాలు పెట్టి వ్యర్థాలను సేకరిస్తున్నారు. వీటిని కొన్ని జిల్లాల్లోని చేపల చెరువులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటం అని తెలిసినా కాసులవేట ఆపడం లేదు. మరో వైపు.. జీవీఎంసీ నిర్దేశించిన డంపింగ్ యార్డుకు కోళ్ల మాంసపు వ్యర్థాలను తరలించడంలో విఫలమయ్యారంటూ ఇటీవల బాధ్యతలిచ్చిన గుత్తేదారుల గుత్తకాలం రద్దు చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది. 'బాణం' ఎక్కుపెట్టింది వైకాపానే: కోళ్ల మాంస వ్యర్థాలను కొన్ని రకాల చేపలు పెంచే చెరువులకు నగరం నుంచి అనధికారికంగా తరలించడం వైకాపా హయాంలో మొదలైంది. ఓ కీలక వైకాపా నాయకుడు కనుసన్నల్లో నలుగురు ఈ మాంసం వ్యర్థాల తరలింపు చేసేవారు. పాలకవర్గం ఏర్పడిన తరువాత కోళ్ల వ్యర్థాలలో వస్తున్న లాభాలను చూసిన కొందరు కార్పొరేటర్లు బినామీలను రంగంలోకి దింపారు. వైకాపా హయాంలో కార్పొరేటర్ల కనుసన్నల్లో నడిచిన వ్యవహారం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యుల స్థాయికి వెళ్లింది. నియోజకవర్గ స్థాయి నేతలను ప్రసన్నం చేసుకోవడానికి టెండర్ల సమయంలో రూ. లక్షలు సమర్పించిన వారికే గుత్తలు అప్పటి కమిషనర్ ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. 8 జోన్ల పరిధిలో సుమారు ఆరుగురు గుత్తేదారులకు ప్రతి రోజూ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే బాధ్యతలిచ్చారు. వాహనాలకు జీపీఎస్ పెట్టాలని సూచించినా పట్టించుకోవడం లేదు. దీంతో డంపింగ్ యార్డుకు తక్కువ తరలించి, ఎక్కువ వాహనాలను రాత్రి వేళల్లో ఇతర జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇప్పటికీ అదే సాగుతోంది.

**ఎందుకంత పోటీ అంటే..:** వ్యర్థాల తరలింపునకు టన్నుకు రూ. 690 ఒక్కో దుకాణ నిర్వాహకుడి నుంచి వసూలు చేస్తారు. అందులో జీవీఎంసీకి రూ. 400 చెల్లించి, మరో రూ. 290 గుత్తేదారు తీసుకోవాలి. అయితే బహిరంగ మార్కెటలో కోళ్ల వ్యర్థాలకు చేపల చెరువుల నుంచి గిరాకీ ఉంది. నగరంలో సుమారు 3వేల దుకాణాల నుంచి 10వేల కిలోలపైగా వ్యర్థాలు వస్తాయి. వీటిని కిలో రూ. 20కిపైగా చేపల చెరువులకు అమ్ముతూ ఏటా రూ. కోట్లల్లో ఆదాయం పొందుతున్నారు. ఎవరూ అడ్డు పడకుండా సొమ్ములు పంచేస్తున్నారు.

**కుమ్ములాట:** ప్రస్తుత గుత్తేదారుల కంటే ఎక్కువ నిధులిస్తామంటూ కొంత మంది నాయకులను కలిసి టెండర్లు రద్దు చేయాలని పట్టుబట్టారు. కొందరు నేతల అనుచరగణమే ప్రత్యేకంగా వాహనాలు పెట్టుకుని కోళ్ల మాంసం వ్యర్థాలను కొన్ని వార్డుల్లో సేకరించి చేపల చెరువులకు తరలిస్తున్నారు. సేకరించిన వ్యర్థాల నిల్వలు కొన్ని రహస్య ప్రదేశాల్లో పెట్టి రాత్రి వేళల్లో దర్జాగా రవాణా చేస్తున్నారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులకు, అనధికారికంగా రెండు జోన్ల పరిధిలో తరలిస్తున్న కొందరికి మధ్య ఇటీవల గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో తమవారే కోళ్ల వ్యర్థాలు తరలిస్తారంటూ పోలీసు స్టేషన్‌కు ఓ జిల్లా నాయకుడు వెళ్లి అక్కడ హడావుడి చేయడం చర్చనీయాంశమైంది.

# 'ఆవ'ను చూస్తే.. అవని పులకించే!!

విశాఖపట్నం: 'కొండకర్ల ఆవ'... ఈ పేరు వింటే చాలు ప్రకృతి ప్రేమికుల మనసు వెంటనే అక్కడికి వెళ్లిపోతుంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం-మునగపాక మండలాల నడుమ ఉన్న ఈ మంచినీటి వనరు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పర్యాటకులకు సుపరిచితమే. కార్తిక మాసం, వారాంతాల్లో ఇక్కడ సందడిగా ఉంటుంది. పలు సినిమాలు కూడా చిత్రీకరించారు. తాజాగా...పర్యావరణ 'రక్షిత ప్రదేశం'గా ప్రభుత్వం గుర్తించడంతో ఈ ప్రాంత పరిరక్షణపై నమ్మకం పెరిగింది. సమీప ప్రాంతాల పర్యావరణ పరిరక్షణలో, నీటి అవసరాలు తీర్చడంలో కీలకంగా మారిన ఈ ఆవ దాదాపు రెండు వేల ఎకరాల్లో విస్తరించింది. ఎన్నో రకాల జీవ జాతులను, పక్షులను ఇక్కడ చూడొచ్చు. అనకాపల్లి రైల్వేస్టేషన్ నుంచి 14 కిలోమీటర్ల దూరంలో, విశాఖ విమానాశ్రయానికి దాదాపు 40 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ నీటిపై తేలియాడే వంతెన, ఫైబర్ బోట్లు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. పచ్చని కొండలను తిలకిస్తూ... తామర పువ్వుల సోయగాలను



వీక్షిస్తూ... 'ఆవ' జలాల్లో చేసే విహారం మరపురానిదే. ఏటా పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలు నిర్వహించే సందర్భాల్లో ఆవ లాంటి జల వనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

# అవునన్నారా.. కాదన్నారా..?

చిత్తూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు టన్ను తోతాపురికి రూ. 12 వేలు చెల్లించాలని ప్రకటించారు. గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంపుల నిర్వాహకులు, మండీ వ్యాపారులతో సుదీర్ఘంగా సమీక్షించి ఈ నిర్ణయం తీసుకున్నారు. రోజురోజుకు మామిడి ధరలు పతనమవుతున్న తరుణంలో ఇది రైతులకు మేలు చేసే నిర్ణయమైనప్పటికీ.. అమలుకు గుజ్జు పరిశ్రమల యజమానులు జాప్యం చేస్తున్నారు. అసలు కలెక్టర్ల ప్రకటించిన ధరకు వారు అవునన్నారా..? కాదన్నారో తెలియడం లేదు. ఆ మేరకు ఎప్పటి నుంచి కొనుగోలు చేస్తారో స్పష్టత కరవైంది.




కొందరేమో ఈ నెల 10 నుంచి కొనుగోలు చేస్తారని.. మరికొందరు స్పష్టత లేదంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. యంత్రాంగం మరింతగా ప్రత్యేక దృష్టి సారిస్తేనే తమకు న్యాయం జరుగుతుందని మామిడి రైతులు అంటున్నారు.

**జోరందుకున్న బేనీషా వ్యాపారం**

చిత్తూరు మార్కెట్ యార్డులో మామిడి సీజన్ జోరందుకుంది. రోజుకు 200-25 టన్నుల కాయలు ఇక్కడి యార్డుకు వస్తున్నాయి. సీజన్ మొదట్లో బేనీషా తదితర టేబుల్ రకాల ధరలు ఆశాజనకంగా ఉండగా.. వారం తర్వాత తగ్గించేశారు. ప్రస్తుతం టేబుల్ రకాల ధరలు నిలకడగా ఉన్నాయని మండీ యజమానులు పేర్కొన్నారు. పెద్దమొత్తంలో బేనీషా కాయలు యార్డుకు వస్తున్నాయి. వీటిని రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలకు ఎగుమతిదారులు కొనుగోలు చేస్తున్నారు. పక్వానికి వచ్చిన కాయలు యార్డుకు తెస్తే మంచి ధర లభిస్తుందని మండీల యజమానులు పేర్కొంటున్నారు.

# రుయా.. గుండె భద్రం

తిరుపతి : రుయా ఆస్పత్రి పునరుజ్జీవం దిశగా అడుగులు పడుతున్నాయి. గతంలో సూపరింటెండెంట్ గుండెపోటుకు గురికాగా క్యాథ్‌ల్యాబ్ అందుబాటులో లేక హుటాహుటిన నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి ఆయన్ను తరలించాల్సి వచ్చింది. ఆపాటి భరోసా ఓ శ్రీవారి భక్తుడి గుండెపోటు మరణంతో పురుడుపోసుకున్న రుయా ఇవ్వలేకపోయింది. రోజూ వెయ్యిమంది వరకు రోగులు వచ్చే రుయాకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. యంత్రాలు, పరికరాలకు నిధులు మంజూరు చేసింది. రూ. 70 కోట్లతో నిర్మాణంలో ఉన్న అత్యవసర విభాగంలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుచేసే అవకాశం ఉంది. అంతకంటే ముందు ఏర్పాటు చేయాల్సివస్తే అత్యవసర విభాగం లేదా ఏపీఎంఎస్ఐడీసీ నిర్మించిన నూతన భవనంలో ఏర్పాటు చేసే వీలుంది. క్యాథ్‌ల్యాబ్ అందుబాటులోకి వస్తే పేదరోగులకు ఉచితంగా



యాంజియోగ్రామ్, స్టంట్ల అమరిక వీలవుతుంది.

**ప్రస్తుత సేవలు ఇలా..** స్విమ్స్ నెలకొల్పాక ఇక్కడి వైద్యులు అక్కడికి వెళ్లిపోవడం.. ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో గుండె విభాగం మూతపడింది. రోగులకు మెడిసిన్ విభాగమే దిక్కవుతోంది. ఇటీవల స్విమ్స్‌తో ఒప్పందం చేసుకుని అక్కడి క్యాథ్‌ల్యాబ్‌లో అతికొద్దిమందికి సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రుయాకు క్యాథ్‌ల్యాబ్ మంజూరు చేసింది.

**ఒక్కరే వైద్యుడు..** రుయా గుండెవైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వారంలో మూడురోజుల ఓపీలు, నాలుగు జిల్లాల స్టెమీ ప్రోగ్రామ్ నిర్వహణకే ఆయన సమయం సరిపోతోంది. క్యాథ్‌ల్యాబ్ అందుబాటులోకి వస్తే విభాగాధిపతి, ఐదారుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు అవసరం. టెక్నీషియన్లు, సిబ్బంది నియామకంతోపాటు ఐసీయూ విభాగం.. ఎకో, ఈసీజీ పరికరాలు మరిన్ని సమకూర్చాల్సి ఉంటుంది.

# కళ్లెదుటే భవంతులు.. లేరట అనర్హులు!

శ్రీకాళహస్తి : పట్టణం రాజీవ్‌నగర్‌లో వైకాపా హయాంలో భారీగా అనర్హులకు ఇళ్ల పట్టాలు కట్టబెట్టారు. కొందరు ఎటువంటి దస్త్రాలు లేకుండానే గృహాలు నిర్మించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే ఈ అంశాన్ని అసెంబ్లీలోనూ ప్రస్తావించారు. ఎలాంటి అర్హత లేకుండానే వెయ్యి మందికిపైగా పట్టాలు పొందారు. అధికారుల సర్వేలో పదో వంతు కూడా అక్రమాలు తేలలేదు.
చిత్తూరు నగరంలోని తేనెబండ, మురకంబట్టులో పట్టాకు రూ.50వేలు- రూ.లక్ష తీసుకుని సుమారు 600 స్థలాలను వైకాపా కార్యకర్తలు అమ్మేసుకున్నారు. కొందరు వైకాపా నేతలు అందులో భవంతులు కూడా నిర్మించుకున్నారు. రెవెన్యూ యంత్రాంగం సర్వేలో నగరంలో 63 మంది అనర్హులకే పట్టాలు ఇచ్చారని నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఉచితంగా ఇంటి పట్టా పొందడానికి పేదరికమే ప్రామాణికం. అంతకుముందు ఎప్పుడూ స్థలం తీసుకోకూడదన్నది మరో నిబంధన. వైకాపా హయాంలో వీటికి పాతరేశారు. అనర్హులకూ భారీగానే పట్టాలు పంపిణీ చేశారు. డబ్బులు తీసుకుని కొన్నిచోట్ల ఇవ్వగా వైకాపా మద్దతుదారులన్న ఏకైక కారణంతో మరికొందరికి స్థలాలు ఇచ్చారు. దాంతో అర్హులైన పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు పట్టా ఇవ్వాలంటూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమాలను నిగ్గు తేల్చడానికి సర్వే చేసినా తూతూమంత్రంగా ముగించడం విమర్శలకు తావిస్తోంది. వైకాపా హయాంలో 2020 డిసెంబరులో మహిళల పేరిట ఇంటి పట్టాలిచ్చారు. ఆ తర్వాత కూడా కొందరికి స్థలాలు పంపిణీ చేశారు. 2024 ఎన్నికలకు ముందు వరకు ఈ క్రతువు కొనసాగింది. చిత్తూరు జిల్లాలో గ్రామాలు, పట్టణాల్లో కలిపి 1.54 లక్షలు, తిరుపతి జిల్లాలో 1.70 లక్షల మందికి పట్టాలు ఇచ్చారు. తిరుపతి జిల్లాలో ప్రధానంగా శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాల్లో చిత్తూరు జిల్లాలో పలమనేరు, చిత్తూరు, నగరి నియోజకవర్గాల్లో



పట్టాల పంపిణీలో అవకతవకలు జరిగాయి.

**నిబంధనలు అనుసరించకుండా 20 శాతం మందికి..**
రెండు జిల్లాల్లో ఇచ్చిన పట్టాల్లో దాదాపు 20 శాతం మంది అనర్హులపరమైనట్టు వైకాపా హయాంలోనే ఆరోపణలు వచ్చాయి. కార్యకర్తలు కొందరు రెండు- మూడు పట్టాలు కూడా తీసుకున్నారు. మరికొందరు పేదల నుంచి కారుచౌకగా కొని భవంతులు కట్టుకున్నారు. ఇలాంటి అక్రమాలను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం సర్వేకు శ్రీకారం చుట్టింది. 15 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), సర్వేయర్, వీఆర్వోలతో బృందాలు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు వివరాలను యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.

**చిత్తూరులో 446.. తిరుపతిలో 960..**
ప్రస్తుతం ఈ సర్వే తుది దశకు చేరింది. చిత్తూరు జిల్లాలో 446, తిరుపతి జిల్లాలో 960 మంది మాత్రమే అనర్హులున్నట్టు రెవెన్యూ యంత్రాంగం తేల్చింది. లే ఔట్లలో కళ్ల ముందే భవంతులు కనిపిస్తున్నా.. అతి తక్కువ మందే అర్హత లేని వ్యక్తులున్నారని నిర్ధారించడం అనుమానాలకు తావిస్తోంది. తూతూమంత్రంగా క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేశారని స్పష్టంగా అర్థమవుతోంది.

# విశ్వంతో ప్రయాణం.. ప్రకృతికి ప్రణామం

శ్రీకాళహస్తి : అందమైన పర్యావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది భావితరాలకు పదిలంగా అందించేందుకు శ్రీకారం చుట్టారా యువత. రోజురోజుకు జనాభా పెరుగుతుండటంతో అంతరించి పోతున్న చెట్లు, జీవరాశులను కాపాడేందుకు నిత్యం పరితపిస్తున్నారు. కొందరు యువకులు స్వచ్ఛందగా మొక్కలు పెంచేం దుకు శ్రమిస్తుండగా మనతో పాటు జీవరాశులు మనగడ సాగించేలా నిపుణులు పరిశోధనలతో వెలుగులోకి తీసుకొస్తుండటం గమనార్హం.

**ఊరూరా ఉద్యానంలా మార్చాలని**
కేశవులు, సేవ్ ఆక్సిజన్ సంస్థ వ్యవస్థాపకులు
వేగంగా జనాభా పెరుగుతుండటంతో నివాసాలు, రోడ్లు వంటి అభివృద్ధి పేరిట చెట్లు, అటవీ ప్రాంతాలు అంతరించి పోతున్నాయి. దీన్ని దృష్ట్యా



యువకులంతా కలిసి 2021లో సేవ్ ఆక్సిజన్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాం. నాలుగేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో 10వేలు మొక్కలు పంపిణీ చేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటి పెంచేంత వరకు బాధ్యతలు చేపడుతున్నాం. నూతనంగా ఊరూరా వాలంటీర్లను ఏర్పాటు చేసుకుని మొక్కల పెంపకం నిరంత ప్రక్రియగా కొనసాగించేలా చర్యలు చేపట్టాం.

**పక్షుల పరిరక్షణకు పరిశోధనలు**
ఏఎస్.హరీషా, ఐసర్ పక్షుల పరిశోధన విభాగం, సిటిజన్ సైన్స్ సమన్వయకర్తకాలుష్యం అధికమై గతంలో భూమిపై సందడి చేసే పక్షులు అంతరించే స్థితికి చేరాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతి ఐసర్‌లోని పక్షుల పరిశోధన విభాగం ఆధ్వర్యంలో పక్షులను రక్షించేందుకు చర్యలు చేపట్టా. ఇప్పటి వరకు 250 రకాల పక్షులు, వాటి జీవన విధానం, సంతతి పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశోధనలు జరుపుతున్నాం. గతంలో నేలపై సంచరించి ప్రస్తుతం కనుమరుగైన పక్షుల ఆనవాళ్లు కోసం అన్వేషిస్తున్నాం.

**పాములను కాపాడేందుకు పరిశోధన**
ప్రొఫెసర్ డా.నందిని, ఐసర్ వాతావరణంలో మార్పులు, జనాభా పెరుగుదల వంటి కారణాలతో పాములు అంతరించి పోతున్నాయి. వాటిని కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశోధనలు జరుపుతున్నాం. ఈ నేపథ్యంలో తిరుపతి ఐసర్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటి వరకు 35 రకాల పాములు గుర్తించాం. వాటి జీవన విధానం, కాపాడుకునేందుకు జాగ్రత్తలపై భావితరాలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాం.

# పర్యావరణ హితులు.. భవితకు వారధులు



అనంతపురం : ప్రకృతిని విధ్వంసం చేస్తే.. మానవాళిపై కన్నెర్ర చేస్తుంది. ఎప్పటికైనా మనుగడకు ముప్పే.. ఎంత సంరక్షించుకుంటామో.. అంత మేలు చేస్తుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా భవితకు భరోసా ఇస్తుంది. అక్రమార్కులు జలవనరులను దోచుకుంటూ కనుమరుగు చేస్తున్నారు. మరోవైపు స్వార్థపరులు పచ్చదనంపై గొడ్డలి వేటు వేస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. ఈనేపథ్యంలో కొందరు ప్రకృతి ప్రేమికులు పచ్చదనం పెంపునకు, పర్యావరణ పరిరక్షణకు శ్రమిస్తున్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్ఫూర్తిదాయక కథనాలు కొన్ని ఇలా..

**ప్రతి నెలా రూ.25 వేలు వ్యయం**
గుంతకల్లుకు చెందిన నగర ఉత్సవ సమితి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.25 వేలు వ్యయం చేస్తోంది. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో 2015లో వివేకానందస్వామి పేరుతో ఉద్యానం ఏర్పాటు చేశారు. అందులో 70 రకాల మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెరిగి ఆహ్లాద వాతావరణం పంచుతున్నాయి. వ్యాయమంలో భాగంగా ఉదయం, సాయంత్రం స్థానికులు ఇక్కడ నడవడానికి వస్తున్నారు మరికొందరు హాయిగా సేదదీరుతున్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం బాధ్యతగా భావించామని నగర ఉత్సవ సమితి నాయకుడు ఇల్లూరు లక్ష్మీనారాయణ చెబుతున్నారు. ఇప్పటి వరకు ఉద్యానానికి రూ.60 లక్షలకుపైగా ఖర్చు చేసినట్లు చెప్పారు.

**పురపాలికకు పచ్చని తోరణం**
తాడిపత్రి పురపాలికలో పర్యావరణాన్ని కాపాడాలని పదేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రతి ఇల్లు, దుకాణం ముందు మొక్క నాటి పెంచాలని నిబంధన పెట్టారు. ఈమేరకు పెద్దఎత్తున మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సీబీరోడ్డు, యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డులో పచ్చదనం హాయినిస్తుంది. ఆయా కాలనీల్లోనూ ఆహ్లాదం పంచుతున్నాయి.

**పరిరక్షణకు 'నిస్వార్థ' సేవ..**
ఉరవకొండకు చెందిన నిస్వార్థ ఫౌండేషన్ పర్యావరణ పరిరక్షణ నినాదంతో ముందుకు సాగుతోంది. గ్రామాల్లో ఇప్పటి వరకు 10వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. వివిధ ప్రవేశ పరీక్షలకు ఏటా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు కచ్చితంగా మొక్కలు నాటి సంరక్షించాలన్న నిబంధన పెట్టారు. మొక్కను ఏడాది పాటు సంరక్షిస్తే రూ.500, ప్రశంసా పత్రం, రెండో ఏడాది సంరక్షిస్తే రూ.1000తో పాటు ప్రశంసా పత్రం, మూడో ఏడాది సంరక్షిస్తే రూ.1,500తో పాటు కలెక్టరుతో విద్యార్థులకు పర్యావరణ మిత్ర అవార్డులు ఇప్పిస్తున్నారు. ప్రజలను చైతన్యపరిచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయడమే ప్రధాన ఉద్దేశమని నిస్వార్థ ఫౌండేషన్ సమన్వయకర్త వెంకట పేర్కొన్నారు.

**ఇంటింటా చెట్టు.. ఊరంతా వనం**
హిందూపురం వాసి భాస్కర్‌రెడ్డి ఇంటింటా చెట్టు.. ఊరంతా వనం నినాదంతో ముందుకెళుతున్నారు. సొంత డబ్బు వెచ్చించి నియోజకవర్గవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రైవేట్రు స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. తన ఇంటిని నందనవనంగా మార్చారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**వేలాది ఎకరాల్లో సంరక్షణ**
చెన్నేకొత్తపల్లి, రొద్దం, రామగిరి మండలాల్లోని కొండల్లో పచ్చదనం పెంపునకు టింబక్టు కలెక్టివ్ సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. అడవుల సంరక్షణతోపాటు కొండలు, బంజరు భూముల్లో మొక్కల పెంపకానికి వన సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేసింది. తర్వాత కమిటీలను కల్పవల్లి అటవీ సంరక్షణ సొసైటీలుగా మార్పు చేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులతో విత్తన బంతులు తయారు చేయించి... వర్షాలు ప్రారంభంకాగానే కొండవాలు ప్రాంతాలలో వేస్తుంటారు. మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. వేలాది ఎకరాల్లో పచ్చదనం పెంపొందడమేగాక ఎన్నో రకాల పక్షులు, జీవాలు ఆవాసం ఉంటున్నాయి.

**అధికారి.. హరిత నేస్తం**
కదిరి పట్టణం కుటాగుళ్లకు చెందిన రాయసం హరిప్రసాద్ అటవీశాఖలో బీట్ అధికారిగా పని చేస్తున్నారు. హరితనేస్తం పేరుతో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. కుమార్తె మేఘన పుట్టినరోజున చెట్లు, ట్రీగార్డులు ఉచితంగా అందించటాన్ని ప్రారంభించారు. అదే రోజు జన్మదినం జరుపుకొనే వారెవరైనా పేర్లు నమోదు చేసుకుంటే కోరిన మొక్కలు అందిస్తున్నారు. పాఠశాలలు, వీధుల్లో మొక్కలు పెంచేలా ప్రోత్సహిస్తున్నారు. పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్న వారికి హరితనేస్తం జ్ఞాపికలతో సత్కరించి ప్రోత్సహిస్తున్నారు.

**హరిత ఉద్యమంలో 'సమాజ క్రాంతి'**
కుందుర్పి మండలంలో సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు విలువల బడులు ప్రారంభించి విద్యార్థులతో హరిత ఉద్యమానికి నాంది పలికింది. ట్రస్టు అధ్యక్షుడు, గాయకుడు లెనిన్‌బాబు కుందుర్పిని హరిత మండలంగా మార్చే లక్ష్యంతో 'సదాస్మరామి- మొక్కల పండుగ' నిర్వహిస్తూ ఏడాదికి 10 వేల మొక్కలను నాటించి, సంరక్షిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 30వేల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. మూడు లక్షల విత్తన బంతులు తయారుచేసి వర్షాకాలంలో అటవీ ప్రాంతాలు, కొండలు, గుట్టలు, రోడ్ల పక్కన వెదజల్లుతున్నారు. మొలకెత్తి మొక్కలుగా ఎదుగుతున్నాయి.

# హెచ్చెల్సీ మరమ్మతులపై నీలినీడలు



అనంతపురం : తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ(టీబీ హెచ్చెల్సీ) ఆధునికీకరణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రస్తుత సంవత్సర నీటి సీజన్ మొదలైంది. రానున్న రెండు మాసాల్లో నీరు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈలోపు నిర్దేశిత మరమ్మతు, ఆధునికీకరణ పనులు పూర్తి కావడం అసాధ్యంగా మారింది. ఇంజినీర్లు పనులను వేగంగా చేపట్టడానికి తంటాలు పడుతున్నా ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. కనీసం 20 శాతం ప్రగతి కూడా లేదు. శిథిలావస్థలో ఉన్న ప్రధాన కాలువ మరమ్మతు, నిర్వహణకు గత వైకాపా ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. దీంతో కాలువలో నీటి ప్రవాహం దినదినగండంలా కొనసాగింది. కూటమి ప్రభుత్వ ఏర్పడిన నెల రోజుల్లోనే హెచ్చెల్సీని పటిష్ఠం చేసేందుకు నిధులు మంజూరు చేసింది. టెండర్ల ఖరారు విషయంలోనూ వేగంగా నిర్ణయం తీసుకుంది. కాకపోతే.. గుత్తేదారులు పనులను ప్రారంభించడంలో జాప్యం చేశారు. ఈ ప్రభావం పనుల పురోగతిపై పడింది. జులై ఆఖరు నాటికి తుంగభద్ర జలాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఈలోపు కనీసం 50 శాతం పనులైనా పూర్తి అవుతాయో లేదో అనుమానమే.

**11 పనులు.. రూ.33.89 కోట్లు**
ప్రధాన కాలువపై సత్వరమే చేయాల్సిన పదకొండు పనులను గుర్తించారు. అంచనాలు తయారు చేసి కూటమి ప్రభుత్వానికి నివేదించారు. ఆగమేఘాలపై రూ.33.89 కోట్లను విడుదల చేస్తూ ఈ ఏడాది మార్చి 18న ఉత్తర్వు వెలువడింది. ఈలోపు టెండర్లను ఆహ్వానించి ఇద్దరు గుత్తేదారులకు అప్పగించారు. కణేకల్లు చెరువు అవుట్ పాల్ రెగ్యులేటరీ, లైనింగ్ పనులు, అండర్ టన్నెల్ (యూటీ), పీఏబీఆర్, ఎమ్పీఆర్ ఓటీ రెగ్యులేటర్లు, ఐదు డబుల్ లైన్ రోడ్డు బ్రిడ్జి (డీఎల్ఆర్‌బీ) ఉన్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో పనులన్నీ మొదలయ్యాయి. పనుల్లో వేగం పెరిగినా ఆశించిన మేర పురోగతి లేదు.

**రెండింటిపై దృష్టి సారిస్తే..**
ప్రధాన కాలువపై 137.702 కి.మీ. వద్ద పాత యూటీ స్థానంలో కొత్తది నిర్మిస్తున్నారు. జులై మూడో వారం తర్వాత నీటి విడుదల చేసే నాటికి యూటీని పూర్తి చేయాలి. కనీసం కాలువ లోపల పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. ఇదే క్రమంలో కణేకల్లు చెరువు ఆఫ్‌టెక్ స్లూయిస్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. ప్రధాన కాలువ నుంచి నీరు ఈ చెరవులోకి వెళ్లి... మళ్లీ కాలువకు ప్రవాహం కొనసాగుతుంది. ఈ రెండు పనులు పూర్తి చేస్తే ప్రవాహానికి ఆటంకం ఉండదు. వంతెనలకు సంబంధించి ఫిల్లర్లు వరకు నిర్మిస్తే.. పైకప్పు, ఇతరత్రా పనులు నీటి ప్రవాహం కొనసాగే సమయంలోనూ పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. మరోవైపు.. కీలకమైన ఎస్ఈ, ఈఈల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేస్తే పనుల పురోగతిపై దృష్టి సారించేందుకు వీలుంటుంది.

# అప్పన్న ఆలయంలో.. వరుస ఉత్సవాలు

సింహాచలం : శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి దేవాలయ ంలో వరుస ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు స్వామివారి దర్శన వేళలు, ఆర్జిత సేవల్లో మార్పులు చేసినట్లు ఈవో వేంద్ర త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలిలా.. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నమ్మాళ్వార్ తిరు నక్షత్రం పూజలు జరగనున్న నేపథ్యంలో రాత్రి 7గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవు. రాత్రి ఆరాధన టికెట్లు కూడా రద్దు చేశారు. 10వ తేదీన నృసింహ జయంతి సందర్భంగా ఉదయం 8గంటల నుంచి విశేష పూజలు, నృసింహ హోమం జరుగుతాయి. సాయంత్రం 4గంటల నుంచి కృష్ణాపురం గోశాలలో నృసింహ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేపడతారు. ఈ కారణంగా ఆరోజు సాయంత్రం 5గంటల తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం లభించదు. 11వ తేదీన జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా సింహాద్రినాథుడికి మూడో విడత చందన సమర్పణ జరుగుతుంది. ఈ సందర్భంగా విశేష పూజలు, ఆరాధనలు నిర్వహించాల్సి ఉన్నందున ఆ రోజు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు ఈవో తెలియజేశారు.



# పరీక్షల పేరిట పైసాచికత్వం

కర్నూలు : ఆదోనికి చెందిన ఓ మహిళ నగరంలోని క్యాన్సర్ ఆసుపత్రిలో చేశారు. పరీక్షల పేరిట రూ.10 వేలు తీసుకున్నారని ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ఫిర్యాదు చేశారు. ఆడిటింగ్‌లో ఈ విషయం వెలుగులోకి రావడంతో డబ్బులు వెనక్కి ఇచ్చారు.కిడ్నీలో రాళ్లు ఉన్నాయని బి.తాండ్రపాడుకు చెందిన ఓ వ్యక్తి నగరంలో పేరున్న ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారు. వైద్య ఖర్చుల పేరిట అదనంగా రూ.18 వేలు తీసుకున్నారని ఆయన ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ఫిర్యాదు చేశారు. కల్లూరులోని నెట్‌వర్క్ ఆసుపత్రిలో విశ్రాంత ఉద్యోగి మోకాలికి శస్త్రచికిత్స చేయించుకొంటే అదనంగా రూ.40 వేలు తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ధనదాహానికి పేదలు సమిధలు అవుతున్నారు. పరీక్షల పేరిట పీక్కుతింటున్నారు. బాధితులెవరైనా ఆందోళన చేస్తే ప్రాణాలకు ఖరీదు కడుతున్నారు. నెట్‌వర్క్ హాస్పిటళ్ల తీరుపై ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కఠిన చర్యలు తీసుకోవాలని కర్నూలు కలెక్టర్ సమీక్షలో ఆదేశాలు జారీ చేశారు.
ఆరోగ్యశ్రీ సేవలు అందించే ఆసుపత్రులు కర్నూలు జిల్లాలో 58, నంద్యాలలో 38 వరకు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో ఏటా 1.20 లక్షల మంది వైద్యసేవలు పొందుతున్నారు. బిల్లుల రూపంలో ప్రభుత్వం రూ.137 కోట్ల వరకు వెచ్చిస్తోంది. ఉచితంగా సేవలు అందుతాయన్న ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు ఆయా ఆసుపత్రుల్లో చేరుతున్నారు. బాధితులు ఆసుపత్రికొచ్చిన వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. ఒక్కో బాధితుడి నుంచి రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు పెట్టిస్తున్నారు.
అత్యవసరం పేరిట భయపెట్టి..స్టంట్ అయితే రూ.50 వేల నుంచి రూ.లక్ష, కాళ్లు, చేతులు విరిగితే నాణ్యమైన కంపెనీ రాడ్ల పేరిట రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకుంటున్నారు. తర్వాత ఆరోగ్యశ్రీ నుంచి నిధులు లాగేస్తున్నారు.

**వీటిని అడగొద్దు**
ఏ రోగానికి ఎంత బిల్లు వేస్తున్నారో తెలియడం లేదు. నిబంధనల ప్రకారం వైద్య పరీక్షల ధరలు బోర్డులపై రాసి ప్రదర్శించాలి. ఎక్కడా కనిపించడం లేదు.
రోగి డిశ్చార్జి అయినప్పుడు వారికి ఛార్జీలు, ఫాలోప్ మందులు ఇవ్వాలి. కొందరికి వారు చేయించుకునే వైద్యాన్ని బట్టి మూడు, ఆరు నెలల పాటు ఫాలోప్ మందులు ఇవ్వాలి. ఆసుపత్రిలో చేరిన వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టాలి. కానీ ఇవేవీ సక్రమంగా జరగడం లేదు.

**పేరుకే వైద్యమిత్రలు**
వైద్యమిత్రలు ఉదయం 9 గంటలకు ఆసుపత్రికి రావాలి. 11 గంటలు దాటినా హాజరుకావడం లేదు. సాయంత్రం ఐదు గంటలకే వెళున్నారు. రాత్రివేళ అందుబాటులో ఉండటం లేదు. ఫోన్ చేస్తే సరిగ్గా స్పందించడం లేదు.వైద్యమిత్రలు కచ్చితంగా ప్రతి వార్డు తిరగాలి. డిశ్చార్జి అయినప్పుడు కచ్చితంగా అడగాలి. ఏదైనా బిల్లులు అదనంగా తీసుకుంటే వారి దృష్టికి తీసుకెళ్తే రోగులకు ఆ అదనపు మొత్తాలను ఇప్పించాలి.
అక్కడ వైద్య సేవలు అందుబాటులో లేకుంటే రోగులకు మంత్రణం చేసి రికార్డు చేయాలి. సర్వజన వైద్యశాలకు పంపించాలి.

**ఫిర్యాదు చేస్తే చర్యలు**
నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలకు సంబంధించి సహాయకేంద్రం (హెల్ప్‌డెస్క్) ఉంటుంది. అదనంగా ఎవరైనా డబ్బులు ఇవ్వాలని డిమాండు చేస్తే అక్కడే ఉన్న వైద్యమిత్రకు ఫిర్యాదు చేయాలి. లేదంటే జిల్లా సమన్వయకర్త దృష్టికి తీసుకెళ్లొచ్చు. లేదంటే 104 నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయొచ్చు. కలెక్టర్ ఆదేశాల మేరకు పలు ఆసుపత్రులపై విచారించి నివేదికను డీఎంహెచ్‌వోకు అందిస్తాం. డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త.

# మొక్కోటి ప్రతిన.. పుడమికి ఆలన

కర్నూలు : పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పాత్ర కీలకం..ఒక వృక్షం తన 50 ఏళ్ల జీవిత కాలంలో రూ.15.70 లక్షల విలువైన ప్రయోజనాలు చేకూరుస్తుంది.. రూ.5 లక్షల విలువైన వ్యర్థాలు గ్రహిస్తుంది.. రూ.20 వేల విలువైన ప్రొటీన్లను ఇస్తుంది. గాలిలో తేమ, మట్టి సంరక్షణలో రూ.3 లక్షల విలువైన పని చేస్తుంది.

**అటవీ శాఖ అధికారుల అంచనా.!!**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. అటవీ, సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఉపాధి హామీకి అనుసంధానం చేశారు. ఒక్కో నర్సరీలో 65 వేల మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో మొక్కను పెంచేందుకు రూ.14-19 వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. తరువులు తగ్గాయి.. కరవులు దరి చేరాయి. ఏ ప్రాంతమైనా సుభిక్షంగా ఉండాలంటే ఆ ప్రాంతం మొత్తం భూ భాగంలో 33 శాతం అడవులు ఉండాలి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 19.9 శాతమే ఉన్నాయి.. 18 మండలాల్లో వనం ఆనవాళ్లే లేవు. అటవీ విస్తీర్ణ శాతం 2009లో 12.07 శాతం ఉండగా 2011 నాటికి 11.94 శాతానికి తగ్గింది. 2011-13 మధ్య స్థిరంగా ఉంది. 2015లో 11.67 శాతానికి చేరగా 0.27 శాతం తగ్గింది. 2015-17 మధ్య రాష్ట్రంలో చేపట్టిన అడవులు, మొక్కల పెంపక కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడంతో కొంత వృద్ధి చెందింది. పచ్చదనం పెంపొందించాలి లేదంటే కర్నూలు జిల్లా ఎడారి కావడం ఖాయమని ఐదేళ్ల కిందట ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా హెచ్చరికలు జారీ చేసింది. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ఇవేవీ పట్టించుకోలేదు. **ఐదేళ్లలో రూ.26.68 కోట్లు మెక్కేశారు**
గత ఐదేళ్లలో రహదారులకు ఇరువైపులా కానుగ, వేప, నీలగిరి తదితర మొక్కలు నాటినట్లు దస్త్రాల్లో చూపారు. ఏటా ప్రతి రహదారి పక్కన 2 కి.మీ. పొడవునా మొక్కలు నాటుతున్నట్లు కుడివైపు 100, ఎడమ వైపు 100 చొప్పున కి.మీ.కు 200 మొక్కలు నాటుతున్నట్లు లెక్కలు రాసుకొన్నారు. వాటికి ఉపాధి హామీ కూలీలతో నీళ్లు పోయించి సంరక్షణ చర్యలు తీసుకున్నట్లు డ్వామా అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు గత ఐదేళ్లలో రూ.26.68 కోట్లు వెచ్చించారు. ఆ మొక్కలన్నీ పెరిగి పెద్దవై ఉంటే ఉమ్మడి జిల్లాలో పచ్చదనం వెల్లివిరిసేది.
**18 మండలాల్లో అడవే లేదు**నంద్యాల జిల్లాలో 29 మండలాల పరిధిలో 9,68,057 హెక్టార్ల విస్తీర్ణం ఉండగా.. అందులో 3,08,607 హెక్టార్లలో (32 శాతం) అడవులు ఉన్నాయి. 10 మండలాల్లో అటవీ విస్తీర్ణం సున్నాగా ఉంది. నంద్యాల, ఉయ్యాలవాడ, గోస్పాడు, శిరివెళ్ల, దొర్నిపాడు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్లలో అడవులు కానరావడం లేదు. కర్నూలు జిల్లా విస్తీర్ణం 7,97,740 హెక్టార్లు ఉండగా 25 మండలాల పరిధిలో కేవలం 32,032 హెక్టార్లలో (4 శాతం) అడవులు ఉండటం గమనార్హం. సి.బెళగల్, గూడూరు, కోడుమూరు, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, చిప్పగిరి, మద్దికెర మండలాల్లో అటవీ విస్తీర్ణమే లేకపోవడం గమనార్హం.




## శ్రీలీల మరోసారి సై అంటుందా?

కన్నడ ఇండస్ట్రీలో కెరీర్ ను స్టార్ట్ చేసిన శ్రీలీల, దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన పెళ్లి సందడి సినిమాతో టాలీవుడ్ కు పరిచయమయ్యారు. మొదటి సినిమాతోనే యాక్టింగ్, తన డ్యాన్సులతో ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేసిన శ్రీలీల ఆ తర్వాత రవితేజకు జోడీగా ధమాకా సినిమాలో నటించి బ్లాక్ బస్టర్ ను తన ఖాతాలో వేసుకున్నారు. ధమాకా తర్వాత శ్రీలీల వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఎన్నో సినిమాల్లో నటించి తక్కువ టైమ్ లోనే స్టార్ హీరోయిన్ గా క్రేజ్ సంపాదించుకున్నారు. ప్రస్తుతం శ్రీలీల కేవలం టాలీవుడ్ లోనే కాకుండా బాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తున్నారు. స్టార్ హీరో



కార్తీక్ ఆర్యన్ తో కలిసి బాలీవుడ్ ఎంట్రీకి రెడీ అయిన శ్రీలీల క్రేజ్ ఇప్పుడు ఓ రేంజ్ లో ఉంది. ఇవన్నీ ఒకెత్తయితే ఓ వైపు హీరోయిన్ గా బిజీగా ఉంటూనే పుష్ప2 సినిమాలో అల్లు అర్జున్ సరసన కిస్సిక్ సాంగ్ చేసి నేషనల్ వైడ్ పాపులైరయ్యారు శ్రీలీల. ఇంకా చెప్పాలంటే కిస్సిక్ సాంగ్ చేశాక శ్రీలీల క్రేజ్, మార్కెట్ మరింత పెరిగాయని చెప్పొచ్చు. ఆల్రెడీ పుష్ప2 లో చేసిన స్పెషల్ సాంగ్ తనకు మంచి గుర్తింపును ఇవ్వడంతో ఇప్పుడు శ్రీలీల మరో స్పెషల్ సాంగ్ చేయడానికి రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. యువ సామ్రాట్ అక్కినేని నాగ చైతన్య, విరూపాక్ష ఫేమ్ కార్తీక్ దండు కలయికలో ఓ మిస్టిక్ థ్రిల్లర్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందని, ఆ సాంగ్ ను టాలీవుడ్ హ్యాపెనింగ్ హీరోయిన్ శ్రీలీలతో చేయించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ నిజంగా శ్రీలీల ఈ సాంగ్ చేస్తే సినిమాకు ఈ సాంగ్ చాలా ప్లస్సయ్యే ఛాన్సుంది. మరి ఈ వార్తల్లో నిజమెంతన్నది తెలియాల్సి ఉంది.

## తమన్నా లక్... రెండు దశాబ్దాలైనా రచ్చే

మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతుంది. 2005 సంవత్సరంలో హిందీ మూవీ చాంద్ సా రోషన్ చెహ్రా, తెలుగు సినిమా 'శ్రీ' తో సినీ కెరీర్‌ను ప్రారంభించింది. మొదటి ఏడాదిలో లక్ కలిసి రాలేదు. సినిమాలు పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేదు. ఆ తర్వాత ఏడాది కూడా కలిసి రాలేదు. 2007లో నటించిన హ్యాపీ డేస్ సినిమా తర్వాత మిల్కీ బ్యూటీ తమన్నాకు వెనక్కి తిరిగి చూసుకునే అవసరం రాలేదు. తెలుగులో ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేస్తూ వచ్చింది. టాలీవుడ్ స్టార్ హీరోల అందరితోనూ సినిమాలు చేసిన ఘనత ఈ అమ్మడికి దక్కింది. యంగ్ స్టార్ హీరోలతోనే కాకుండా చిరంజీవి, వెంకటేష్ వంటి సీనియర్ స్టార్స్‌తోనూ ఈ అమ్మడు నటించింది. సాధారణంగా హీరోయిన్స్ దశాబ్ద కాలం పాటు బిజీగా కొనసాగితే గొప్ప విషయం. కానీ ఈ అమ్మడు రెండు దశాబ్దాలు అయినా కెరీర్ ఏ మాత్రం జోరు తగ్గలేదు. టాలీవుడ్‌లో ఈ అమ్మడి జోరు తగ్గింది. కానీ నార్త్ ఇండియాలో ఈమె జోరు కంటిన్యూ అవుతోంది. సినిమాలనే కాకుండా వెబ్ సిరీస్‌లు, మ్యూజిక్ వీడియోలు, ఐటెం సాంగ్స్ ఇలా చాలా




విధాలుగా ప్రేక్షకులకు చేరువ అవుతూ వస్తోంది. మిల్కీ బ్యూటీ తమన్నా ప్రస్తుతం బాలీవుడ్‌లో ఏకంగా అయిదు సినిమాలు చేస్తోంది. అందులో రెండు పెద్ద సినిమాలు కావడం విశేషం. బాలీవుడ్ యంగ్ స్టార్ హీరో సిద్దార్థ్ మల్హోత్ర హీరోగా నటిస్తున్న వ్యన్ సినిమాలో హీరోయిన్‌గా తమన్నా నటిస్తున్న విషయం తెల్సిందే. దీపక్ మిశ్రా దర్శకత్వంలో భారీ అంచనాల నడుమ రూపొందుతున్న 'వ్యన్' సినిమాపై తమన్నా చాలా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఈ అమ్మడి సినిమాలు బాలీవుడ్‌లో చాలా విడుదల అయ్యాయి. కానీ అక్కడ ఆశించిన స్థాయిలో సక్సెస్‌లు దక్కించుకోలేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో సక్సెస్‌ను దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే ఈ అమ్మడు రైడ్ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమాలో మిల్కీ బ్యూటీ తమన్నా పాత్ర గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొత్తానికి రెండు దశాబ్దాలు అయినా కూడా కెరీర్‌లో ఏమాత్రం తగ్గకుండా ఓ రేంజ్‌లో దూసుకు పోతున్న మిల్కీ బ్యూటీ ఎంతో మందికి ఆదర్శం. ఒక్క భాషపై నమ్మకం పెట్టుకోకుండా, ఒకే ఇండస్ట్రీలో సినిమాలు చేస్తూ ఉండకుండా అన్ని భాషల్లో సినిమాలు చేయడం ద్వారా ఒకచోట కాకున్నా మరో చోట అయినా ఆఫర్లు ఎప్పుడూ ఉంటాయి అనేది తమన్నాను చూస్తే అర్థం అవుతుందని ఇండస్ట్రీ వర్గాల వారు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ తమన్నాకు ఉన్న క్రేజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ క్రేజ్‌కు తగ్గట్లుగానే మిల్కీ బ్యూటీ తమన్నా రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆ అందమైన ఫోటోల కారణంగా కూడా తమన్నాకు బాలీవుడ్ నుంచి ఆఫర్లు వస్తూ ఉంటాయి. మరో దశాబ్ద కాలం పాటు మిల్కీ బ్యూటీ తమన్నా బిజీ బిజీగా సినిమాలు చేసే అవకాశం ఉంది. అదృష్టం అంటే తమన్నాదే అంటూ ఆమె ఫ్యాన్స్ కామెంట్ చేస్తూ ఉంటారు.

## రికార్డ్ బ్రేక్... వీరమల్లు వేట మొదలు




పవన్ కళ్యాణ్ అభిమానులు మాత్రమే కాకుండా రెగ్యులర్ సినీ ప్రేమికులు 'హరి హర వీరమల్లు' సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పవన్ కళ్యాణ్ గతంలో ఎప్పుడూ పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో సినిమాలు చేసిన దాఖలాలు లేవు. అలాంటి పవన్ కళ్యాణ్‌తో పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో ఈ సినిమాను రూపొందించడంతో మొదటి నుంచి అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా దర్శకుడు క్రిష్ ఈ సినిమాను మొదలు పెట్టి సగానికి పైగా పూర్తి చేశాడు. కొన్ని కారణాల వల్ల ఆయన సినిమా నుంచి తప్పుకోవడంతో నిర్మాత ఏఎం రత్నం తనయుడు జ్యోతి కృష్ణ ఈ సినిమాను పూర్తి చేసిన విషయం తెల్సిందే. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. ఈనెల 24న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న హరిహర వీరమల్లు సినిమా ట్రైలర్ నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. గత నెల నుంచి అదుగో ఇదుగో అంటూ ఊరిస్తూ వచ్చిన మేకర్స్ ఎట్టకేలకు ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌కి మంచి స్పందన దక్కింది. జ్యోతి కృష్ణ పై కొందరు అనుమానాలు వ్యక్తం చేశారు. క్రిష్ మధ్యలో వదిలి పెట్టి పోయాడు కనుక, మిగిలిన షూటింగ్‌ను మమా అనిపించేసి ఉంటారు, సినిమా అంతగా బాగుండదేమో అని కొందరు అనుకున్నారు. కానీ జ్యోతికృష్ణ ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఈ సినిమా ట్రైలర్‌ను అంచనాలు పెంచే విధంగా కట్ చేయడంలో సఫలీకృతం అయ్యాడని చెప్పాలి. హరిహర వీరమల్లు సినిమా ట్రైలర్‌కి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో పాటు రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ నమోదు అయ్యాయి. ఈ సినిమా ట్రైలర్ తెలుగు వర్షన్‌కి మొదటి 24 గంటల్లో ఏకంగా 48 మిలియన్‌ల వ్యూస్ నమోదు అయ్యాయి. ఇప్పటి వరకు ఏ తెలుగు సినిమా ట్రైలర్‌కు ఈ స్థాయి వ్యూస్ నమోదు కాలేదు. ఇంకా భారీ ఎత్తున వ్యూస్ నమోదు అవుతూనే ఉన్నాయి. అతి త్వరలోనే ఈ ట్రైలర్ 100 మిలియన్‌ల వ్యూస్‌ను క్రాస్ చేసినా ఆశ్చర్యం లేదని సినీ వర్గాల వారు, సోషల్ మీడియా జనాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇతర అన్ని భాషల వర్షన్‌ల ట్రైలర్‌ల వ్యూస్ కలుపుకుంటే మొదటి 24 గంటల్లో 61.7మిలియన్‌ల వ్యూస్‌గా నమోదు అయ్యాయని చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల కారణంగా, ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కారణంగా గత రెండేళ్ల కాలంగా సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాలేదు. ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ నుంచి రాబోతున్న మొదటి సినిమా ఇదే కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. అందుకే ట్రైలర్‌కి ఆ రేంజ్‌లో రెస్పాన్స్ దక్కిందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సినిమాకు సైతం పాజిటివ్ రెస్పాన్స్ దక్కితే కచ్చితంగా రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లు నమోదు కావడం ఖాయం అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో హరిహర వీరమల్లు గురించి ప్రస్తుతానికి పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. కనుక భారీ ఓపెనింగ్స్ నమోదు కావడం ఖాయం. ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించగా కీరవాణి సంగీతాన్ని అందించాడు. బాబీ డియోల్ విలన్‌గా కనిపించబోతున్నాడు.

## నా ఎత్తుతో సమస్య... చాలా బాధ వేసేది : మీనాక్షి చౌదరి





గత ఏడాది 'లక్కీ భాస్కర్', ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాల్లో నటించి సూపర్ హిట్‌ను సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో ఒడిదుడుకులు ఎదుర్కొంది. తెలుగులో మొదటి సినిమా 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' నిరాశపరచడంతో ముందు ముందు ఆఫర్లు వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ లక్కీగా ఈ అమ్మడికి ఆ సినిమా కారణంగా ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాల్లో నటించే అవకాశం దక్కింది. గత ఏడాదిలో చాలా సినిమాలు చేసిన ఈ అమ్మడు లక్కీ భాస్కర్‌తో మాత్రమే హిట్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు నవీన్ పొలిశెట్టితో కలిసి అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఇటీవల ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభం గురించి, తన బాల్యం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

మీనాక్షి చౌదరి మాట్లాడుతూ... చిన్నతనంలో ఇతరులతో మాట్లాడేందుకు చాలా ఇబ్బంది పడేదాన్ని. కాలేజ్ రోజుల్లోనే నా ఎత్తు 6.2 ఉండేది. దాంతో చాలా మంది అమ్మాయిలతో పోల్చితే నేను చాలా ఎత్తుగా ఉండేదాన్ని. దాంతో అంతా నాకు దూరంగా ఉండేవారు, నా ఎత్తు నాకు పెద్ద సమస్యగా అనిపించింది. ఆ సమయంలో చాలా బాధ వేసింది. ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్నకు ఆ విషయం గురించి చెప్తే నీ సమస్యను నువ్వే పరిష్కరించుకోవాలని సూచించాడు. దాంతో నేను బుక్స్‌ను స్నేహితులుగా చూడటం చేశాను. ఎక్కువ బుక్స్ చదవడంతో పాటు, అందాల పోటీల్లో పాల్గొనేందుకు, ఆటలపై ఆసక్తి కలిగింది. సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో నిరాశే మిగిలింది. అయితే వచ్చిన ప్రతి ఆఫర్ కూడా నేను సాధ్యం అయినంత వరకు కష్టపడి సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించాను. ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమా కారణంగానే నాకు ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్కింది. కనుక ఇండస్ట్రీలో ప్రతి చిన్న ఆఫర్ కూడా కచ్చితంగా ముందు ముందు కెరీర్ నిలదొక్కుకునేందుకు సహాయపడుతుందని భావిస్తున్నాను. సీనియర్ హీరోలతో నటించడం ఏంటి అంటూ చాలా మంది నన్ను ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి హీరోతో అయినా నటించేందుకు నాకు ఇబ్బంది లేదు. సీనియర్ హీరోలతో నటించడం అనేది ఒక జోనర్ సినిమాగా భావిస్తాను.

వెంకటేష్ గారితో సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో నటించడం అనేది చాలా కంఫర్ట్‌బుల్‌గా అనిపించింది. ఆయనతో వర్క్ చేయడంను ఎంజాయ్ చేశాను. ఇప్పుడు చిరంజీవి గారి సినిమా విశ్వంభరలోనూ నటిస్తున్నాను. ఆ సినిమాలో నటించే అవకాశం రావడం అదృష్టంగా, గొప్ప విషయంగా భావిస్తున్నాను. ఇండస్ట్రీలో ఎక్కువ కాలం నిలదొక్కుకోవాలంటే వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలి. కథల ఎంపిక విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి తప్ప అతి విశ్వాసం, అతి నమ్మకంతో సినిమాలను వదులుకోవద్దని మీనాక్షి సూచించింది. పుకార్లు అనేవి చాలా కామన్‌గా వస్తూ ఉంటాయి. అయినా కూడా రూమర్స్ చూసినప్పుడు కోపం వస్తుంది. నేను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటాను. కనుక నన్ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించి క్లారిటీ తీసుకోవాలని మీనాక్షి కోరింది. నా గురించి ఏ విషయం అయినా సోషల్ మీడియా ద్వారా నేను చెప్తాను. కనుక పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.

## ప్రియాంక ఎగ్జైట్ అవుతుంది ఆ సినిమా గురించేనా?

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో సినిమా తెరకెక్కుతుండగా, ఈ సినిమాలో ప్రియాంక చోప్రా ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. అయితే రీసెంట్ గా ప్రియాంక ఓ ఇంగ్లీష్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను ప్రస్తుతం ఓ ఇండియన్ మూవీలో నటిస్తున్నట్టు చెప్పి ఆ సినిమా కోసం ఎంతో వెయిట్ చేస్తున్నట్టు తెలిపారు. ప్రియాంక చోప్రా నిక్ జోనాస్ ను పెళ్లి చేసుకున్న తర్వాత అమెరికా వెళ్లి హాలీవుడ్ లో సెటిలైన విషయం తెలిసిందే. అమెరికాలో సెటిలయ్యాక ప్రియాంక ఇండియాను, బాలీవుడ్ సినిమాలను మిస్ అవుతున్నానని, ఈ ఇయర్ ఓ ఇండియన్ సినిమాలో నటిస్తున్నానని, ఆ సినిమా కోసం ఎంతగానో వెయిట్ చేస్తున్నానని, ఇండియన్ ఆడియన్స్ చూపే ప్రేమ, ఆప్యాయత



లు వెల కట్టలేనివని, ఈ ప్రేమ ఎప్పటికీ ఇలానే కంటిన్యూ అవాలని కోరుకుంటున్నట్టు ప్రియాంక చోప్రా చెప్పారు. దీంతో ప్రియాంక మాట్లాడింది ఎస్ఎస్ఎంబీ29 సినిమా గురించేనని మహేష్ ఫ్యాన్స్ భావిస్తూ తెగ సంబరపడిపోతున్నారు. అదే ఇంటర్వ్యూలో ప్రియాంక చోప్రా బొంబాయి మూవీ గురించి కూడా మాట్లాడారు.

తాను ఎక్కువ గా సినిమాలు చూస్తూ పెరగలేదని, తన తండ్రికి మ్యూజిక్ అంటే ఇష్టమవడంతో ఎప్పుడూ ఇంట్లో మ్యూజిక్ వినిపిస్తూనే ఉండేదని, తనకు 13 ఏళ్ల వయసున్నప్పుడు ముంబైలో బొంబాయి సినిమా చూశానని, తనకు ఊహ తెలిసిన తర్వాత చూసిన ఫస్ట్ మూవీ అదేనని, ఆ ఎక్స్‌పీరియెన్స్ ను ఇప్పటికీ మర్చిపోలేనని ప్రియాంక తెలిపారు. కాగా ఎస్ఎస్ఎంబీ29 సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో సాగే కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు రాజమౌళి. ఈ సినిమాలో మహేష్ మునుపెన్నడూ కనిపించని పాత్రలో చాలా కొత్త లుక్ తో కనిపించనున్నారు. ఎస్ఎస్ఎంబీ29ను రాజమౌళి ఎన్నో హంగులతో పాన్ వరల్డ్ లెవెల్ లో తెరకెక్కిస్తున్నారని ఇప్పటికే రైటర్ విజయేంద్ర ప్రసాద్ పలుమార్లు వెల్లడించారు. ఈ సినిమాలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే.

## బ్రేకప్ స్టోరీల గురించి... ఎన్నో బాయ్ ఫ్రెండ్ అంటారు!

కమల్ హాసన్ వారసురాలు శృతి హాసన్ కెరీర్ ఆరంభం నుంచి తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ వచ్చింది. తండ్రి పేరును వినియోగించుకుని ఆఫర్లు దక్కించుకోవడం లేదంటే, తండ్రి పేరును వినియోగించుకుని ఇండస్ట్రీలో నిలదొక్కుకునే ప్రయత్నం ఎప్పుడూ శృతి హాసన్ చేయలేదు. ఇండస్ట్రీలో ఆమె ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాలోనే బికినీ ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి హిట్ పడే వరకు తీవ్రమైన ఒత్తిడికి గురి అయినట్లుగా శృతి హాసన్ చెబుతూ ఉండేది. హీరోయిన్‌గానే కాకుండా ఇండస్ట్రీలో నాలుగు కాలల పాటు ఉండే విధంగా ఎప్పుడూ ఏదో విధంగా ప్రేక్షకుల ముందుకు రావాలని అనుకుంటాను అంటూ గతంలో శృతి హాసన్ చెప్పుకొచ్చింది. తాజాగా



ప్రముఖ నేషనల్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శృతి హాసన్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది. ముఖ్యంగా తన ప్రేమ వ్యవహారాల గురించి, తన తల్లిదండ్రులు విడిపోయిన సమయంలో ఎదుర్కొన్న పరిణామాల గురించి, ఇండస్ట్రీలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి శృతి హాసన్ డెప్త్‌గానే చెప్పుకొచ్చింది. గతంలో ఎప్పుడూ చెప్పని విషయాలను ఈసారి శృతి హాసన్ షేర్ చేసుకోవడంతో ఆమె వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. శృతి హాసన్ వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడిన ప్రతిసారీ ఆమె ప్రేమ వ్యవహారాల గురించి టాపిక్ వస్తుంది. ఆమె ఇప్పటికే రెండు మూడు సార్లు ప్రియుడికి బ్రేకప్ చెప్పింది. ఆఫ్ ది రికార్డ్ మరికొందరు కూడా ఉండి ఉండవచ్చు అంటారు. తాజాగా ఆ విషయం గురించి శృతి హాసన్ స్పందిస్తూ... నాతో ఎవరైనా కొత్త వ్యక్తి కనిపిస్తే చాలా మంది ఇతడు ఎన్నో బాయ్ ఫ్రెండ్ అని అడుగుతూ ఉంటారు. వారు ఆ నెంబర్ గురించి ఆలోచిస్తూ ఉంటారు, కానీ నేను మాత్రం నెంబర్ గురించి ఆలోచించను. నేను కోరుకునే ప్రేమ లభించే వరకు ఎన్ని సార్లు అయినా విఫలం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాను. ఒక వ్యక్తికి బ్రేకప్ అయినంత మాత్రాన తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అంతే కాకుండా ప్రేమికులు ఇద్దరు బ్రేకప్ చెప్పుకున్నప్పుడు ఒకరిని ఒకరు తప్పుపట్టకూడదు. రిలేషన్ షిప్‌లో నిజాయితీగా ఉండాలని నేను అనుకుంటాను, అవతలి వారు మొదట నిజాయితీగా ఉన్నా ఆ తర్వాత ఉండక పోవచ్చు అంది. కోరుకునే ప్రేమ లభించే వరకు వెయిట్ చేస్తానంది. తన తల్లిదండ్రులు కమల్, సారికలు విడాకులు తీసుకున్న సమయంలో తీవ్రమైన ఒత్తిడికి గురి అయ్యాను. చెన్నై నుంచి ముంబై మకాం మార్చిన సమయంలో బెంజ్ కారులో తిరిగే నేను ముంబై లోకల్ రైల్‌లో, ట్యాకీ కారులో తిరగాల్సి వచ్చింది. ఆ సమయంలో జీవితం చాలా నేర్పించింది. అన్ని విషయాలను గుర్తు పెట్టుకుని జీవితంలో ముందుకు సాగుతూ వచ్చాను. తిరిగి నా తండ్రి వద్దకు చేరుకునే వరకు చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. అంత ఈజీగా నా జీవితం సాగలేదని, ముందు ముందు కూడా నటిగా తనను తాను నిరూపించుకునేందుకు విభిన్నమైన పాత్రల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ బోల్డ్‌గా వ్యాఖ్యలు చేసింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536